S & D

www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 193 | మంగళవారం | 2 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

జూన్ 2న 2గా హైకోర్టు?

విభజన దిశగా వడివడిగా పరిణామాలు, త్వరలో న్యాయమూర్తుల కమిటీ

ఎపిలో తాత్కాలిక భవనాల పరిశీలన, ఎంపిక, అనంతరం తుది నిర్ణయం

మన తెలంగాణ / హైదరాబాద్ : మరో ఆరు నెలల్లో ఉమ్మడి హైకోర్టు విభజన ప్రక్రియ పూర్తికానుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు వేర్వేరు హైకోర్టులు జూన్ 2వ తేదీ నుంచి పని చేయడం ప్రారంభించనున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాలుగేళ్ళ తర్వాత హైకోర్టు విభజన ప్రక్రియ ఒక కొలిక్కి వస్తుండడం విశేషం. త్వరలోనే ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు న్యాయమూర్తులతో కూడిన ఒక కమిటీ ఏర్పాటు కానున్నట్లు తెలిసింది. ఎపి ప్రభుత్వం సమకూర్చనున్న తాత్కాలిక భవనాలు హైకోర్టు అవసరాలకు ఏ మేరకు సౌకర్యంగా ఉన్నాయో స్వయంగా అక్కడికి వెళ్ళి పరిశీలించి వచ్చిన తర్వాత అది సమర్పించే నివేదిక తరువాయి 6లో



ప్రధాన న్యాయమూర్తితో సిఎం భేటీ

ఉమ్మడి హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేష్ రంగనాథన్‌తో ముఖ్యమంత్రి కెసిఆర్ సోమవారం సుదీర్ఘంగా చర్చలు జరిపారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి సిజె ఇంటికి వెళ్ళిన కెసిఆర్ సుమారు 2 గంటల పాటు అక్కడే గడిపారు. 24 గంటల విద్యుత్ సరఫరా, శీఘ్ర పారిశ్రామికీకరణ, ఆర్థికాభివృద్ధి తదితరాలను వివరించారు. హైకోర్టు విభజనపై ఎపి సిఎం లేఖ, లోక్‌సభలో కేంద్రం హామీ నేపథ్యంలో వీలైనంత త్వరగా విభజన ప్రక్రియ పూర్తి చేయడానికి సంబంధించి కూడా ఈ సందర్భంగా చర్చించినట్లు తెలిసింది. విడి హైకోర్టు లేని కారణంగా పెండింగ్ కేసుల సంఖ్య పెరిగిపోవడం, ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల భర్తీలో ఇబ్బందులు ఎదురవుతుండడం తదితరాలపై కూడా సిఎం వివరించినట్లు సమాచారం.



మేనిఫెస్టోలో ఇవ్వని హామీ
వేరెక్కడా లేని వెలుగుల వెల్లువ
ప్రశంసల వర్షం కురుస్తోంది
- సిఎం

కాంతి కానుక

విద్యుత్ ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్

నిరంతర విద్యుత్ విప్లవాన్ని సాధించినందుకు సిఎం బహుమతి

- జనవరి 1 నుంచే అమల్లోకి
- జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి ప్రభాకర్‌రావును ఆలింగనం చేసుకొని హర్ష వ్యక్తీకరణ

మన తెలంగాణ/ హైదరాబాద్ : వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా మూడున్నరేళ్ళ తెలంగాణ సాధించిన విప్లవాత్మక విజయమని, ఈ ఘనత విద్యుత్ సంస్థల ఉద్యోగులకే దక్కుతుందని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు వ్యాఖ్యానించారు. ఇంతటి గొప్ప ఖ్యాతిని తెచ్చిపెట్టిన విద్యుత్ ఉద్యోగులకు అభినందనలు మాత్రమే సరిపోవని, నూతన సంవత్సర కానుకగా ఒక ప్రత్యేక ఇంక్రిమెంట్‌ను ఇస్తున్నామని తరువాయి 6లో

సంక్రాంతి సరిహద్దు!

మంచి రోజుల దృష్ట్యా రాష్ట్రంలో పుంజుకోనున్న రాజకీయ వేడి

టిఆర్ఎస్, కాంగ్రెస్‌లో కీలక పరిణామాలు

ఎంఎల్‌ఎలకు మరో సర్వే రిపోర్టు అందజేయనున్న కెసిఆర్

అధికార పక్షం నుంచి వలసలు ముమ్మరించనున్నాయని కాంగ్రెస్ ఆశలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : సంక్రాంతి పండుగ తరువాత రాష్ట్ర రాజకీయాలు వేడెక్కనున్నాయి. పండుగ తరువాత మంచి రోజులు రానుండడంతో కొత్త చేరికలకు ప్రధాన పార్టీలు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. వాస్తవానికి వచ్చే ఏడాది శాసనసభకు ఎన్నికలు జరగనున్నప్పటికీ, ఇంకా ముందుగానే ఎన్నికలు వస్తాయని వార్తలు వెలువడుతున్నాయి. దీనితో కొత్త సంవత్సరంతో పాటే ఎన్నికల సంవత్సరంలోకి అడుగుపెట్టినట్లయింది. ఎన్నికల గడువుకు కొన్ని నెలలు మాత్రమే ఉండడంతో తమ బలాన్ని పెంచుకునేందుకు రాజకీయ పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. సంక్రాంతి తరువాత అధికార పార్టీ నుండి వలసలు ఉంటాయని ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ గట్టిగా చెబుతోంది. ఇందులో సిట్టింగ్ ఎంఎల్‌ఎలు, ఎంపిలు కూడా ఉంటారని చెబుతున్నారు. వరంగల్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాలో టిఆర్ఎస్ నుండి పలువురు తమ పార్టీలో చేరుతారని కాంగ్రెస్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఇప్పటి వరకు తమ తరువాయి 6లో



నిరుద్యోగ భృతి ఇస్తాం

ఈసారి అధికారం కాంగ్రెస్‌కే : ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మన తెలంగాణ/ హుజూర్‌నగర్: తెలంగాణ ప్రజల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ హయంలోనే ప్రత్యేక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని టిపిసిసి అధ్యక్షుడు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని ఇందిరా ప్రాంగణంలో నిర్వహించిన కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్సేనని ఉత్తమ్ పునరుద్ఘాటించారు. రాష్ట్రం ఏర్పడితే కుటుంబానికొక ఉద్యోగం వస్తుందన్న టిఆర్ఎస్‌ను గెలిపిస్తే అధికారంలోకి వచ్చాక కెసిఆర్ కుటుంబానికే నాలుగు ఉద్యోగాలు వచ్చాయన్నారు. దళితులకు మూడెకరాల భూమి, నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు ఎక్కడా అని ప్రశ్నించారు. తెలంగాణలో కుటుంబ పాలన కొనసాగుతుందని ఉత్తమ్ పేర్కొన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఆయన విమర్శించారు. ఖమ్మంలో అన్నదాతలకు బేడీలు వేయడం దుర్మార్గమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో టిఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన ఘనత కెసిఆర్‌కే దక్కిందన్నారు. 2019లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ వ్యాప్తంగా కాంగ్రెస్ భారీ మెజార్టీతో గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో 50 వేల మెజార్టీ సాధించడం ఖాయమని ఉత్తమ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులకు రూ.3 వేలు భృతిగా ఇస్తామని తరువాయి 6లో

ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలోని

విద్యాసంస్థలకు వెలుగు

స్వయంగా నడపడానికి ప్రభుత్వం సిద్ధం

కాదంటే అధ్యాపకుల ఖాళీల భర్తీకి తగిన అనుమతులు మంజూరు చేస్తాం

ఉమ్మడి రాష్ట్రంలో ఎయిడెడ్ విద్యా సంస్థల ప్రమాణాలు దెబ్బతిన్నాయి

నుమాయిష్‌ను ప్రారంభిస్తూ మంత్రి కడియం



మన తెలంగాణ/ హైదరాబాద్: ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే విద్యా సంస్థలను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. సొసైటీకి చెందిన 18 విద్యాసంస్థలను ప్రభుత్వమే నడిపేందుకు సిద్ధంగా ఉన్నదని, ఈ ప్రతిపాదన నచ్చకపోతే ఆ సంస్థలలో అధ్యాపకుల ఖాళీలకు సంబంధించిన ప్రతిపాదనలు పంపిస్తే వాటికి తగిన అనుమతులను మంజూరు చేస్తామని హామీనిచ్చారు. హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సోమవారం "78వ అఖిలభారత పారిశ్రామిక ప్రదర్శన (నుమాయిష్) – 2018"ను ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖమంత్రి, నుమాయిష్ అధ్యక్షులు ఈటల రాజేందర్, ఉపాధ్యక్షులు పి. సరోత్తంరెడ్డి, కార్యదర్శి ఎన్.వి.ఎన్.చార్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో గత ప్రభుత్వాలు ఎయిడెడ్ విద్యా సంస్థలను ధ్వంసం చేశాయని విమర్శించారు. అధ్యాపకుల నియామకాన్ని పట్టించుకోలేదని, మౌలిక సదుపాయాలు కూడా లేవని, తద్వారా ఎయిడెడ్ సంస్థ విద్యా ప్రమాణాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇబ్బడిముబ్బడిగా కళాశాలలకు అనుమతులను మంజూరు చేశారని, విద్యావ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థలో పునర్ వైభవం తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. గతంలో ఓ వెలుగు వెలిగిన ఎగ్జిబిషన్ విద్యా సంస్థలు ఇప్పుడు ఇబ్బందుల్లో తరువాయి 6లో

కుంచెపోటు



మీరు దులపటం కాదు, మీకూ దుమ్ము పులుముతానంటున్నాడు!

మందులో మహిళా హాస్టల్‌పై దాడి

పొరుగున ఉన్న బాలుర హాస్టల్ నిర్వాహకుడి నిర్వాకం

మన తెలంగాణ/ ఎల్‌బినగర్: కొత్త సంవత్సర వేడుకల్లో మద్యం సేవించిన యువకులు ఓ మహిళా హాస్టల్‌పై దాడి చేసిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భాస్కర్ అనే వ్యక్తి దిల్‌సుఖ్‌నగర్ కమలానగర్‌లో మైత్రి మహిళా హాస్టల్‌ను నిర్వహిస్తున్నాడు. ఆ హాస్టల్ సమీపంలోనే జోసఫ్ బాలుర హాస్టల్ ఉంది. దానిని జోసఫ్ రెడ్డి నిర్వహిస్తున్నాడు. ఆదివారం రాత్రి బాలుర హాస్టల్ నిర్వాహకునితో పాటు హాస్టల్‌లో ఉంటున్న గోవింద్ (22)– కరీంనగర్, బ్రహ్మరెడ్డి(26) – గుంటూరు, భాస్కర్ (24) – రంగారెడ్డి, మణిదీప్, బాబాలు మద్యం సేవించి తరువాయి 6లో

జిఎస్‌టి రాబడి డీలా

అక్టోబర్ కంటే నవంబర్ నెలలో తగ్గిన వసూళ్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : జిఎస్‌టి విధానం అమల్లోకి వచ్చిన అనంతరం దేశవ్యాప్తంగా వసూళ్ళు ఐదు నెలల కనిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. ఇది దేశవ్యాప్త పరిస్థితే అయినా, తెలంగాణలో సైతం ప్రతిబింబిస్తోంది. అక్టోబరు నెలలో రూ.1472.33 కోట్ల మేరకు వసూలు కాగా, నవంబరులో అది 1404.08 కోట్లకు తగ్గింది. ఎక్సైజ్ పన్ను నుంచి జరిగే సర్దుబాటు సైతం రూ. 368 కోట్ల నుంచి రూ. 336.31 కోట్లకు తగ్గింది. ఇక రాష్ట్ర జిఎస్‌టి వసూళ్ళు కూడా రూ. 850.66 కోట్ల నుంచి రూ.750.51 కోట్లకు తగ్గింది. కేంద్రం నుంచి రావాల్సిన ఐజిఎస్‌టి వాటా మాత్రం స్వల్పంగా పెరిగింది. అక్టోబరులో జిఎస్‌టి పన్ను వసూళ్ళ వృద్ధిరేటు 26.34 శాతం ఉంటే నవంబరులో అది 25.69 శాతానికి తగ్గిపోయింది. పండుగల సీజన్‌లో పన్ను వసూళ్ళు పెరగడానికి బదులుగా తగ్గడంపై రాష్ట్ర రెవెన్యూ శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో వివిధ శ్లాబుల్లో ఉన్న వస్తువులపై పన్నును తగ్గించి 5 శాతం పరిధిలోని శ్లాబ్‌లో చేర్చినందువల్ల రెవెన్యూ తగ్గిందని తరువాయి 6లో

మత ఘర్షణలు, ముస్లింల అభివృద్ధిపై కాంగ్రెస్ చర్చకు సిద్ధమా? : ఇంద్రసేనారెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్: ఏ ప్రభుత్వ హయాంలో మత ఘర్షణలు, ముస్లింల అభివృద్ధి జరిగిందనే అంశంపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ సిద్ధమా అని బిజెపి సీనియర్ నేత ఎన్.ఇంద్రసేనారెడ్డి పిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి సవాల్ విసిరారు. దేశంలో మత ఘర్షణలకు ప్రధాన కారణం కాంగ్రెస్ పార్టీయేనని ఆరోపించారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం బిజెపి నేతలు డా. ఎన్.ప్రకాశ్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, వి.సుధాకర్‌శర్మతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బిజెపి మత కల్లోలాలను సృష్టించాలని చూస్తోందని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించడాన్ని ఖండించారు. కాంగ్రెస్ పార్టీది నీచమైన చరిత్ర అని, ముస్లింలకు బిజెపి వ్యతిరేకమనే భావనను సృష్టించి, ముస్లింలను భయందోళనకు గురిచేసి, ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడుతోందని ఆరోపించారు. 70 ఏళ్ల పాలనలో అత్యధికంగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పేద ప్రజలకు, ముస్లిం అభివృద్ధికి ఏం చేశారని ప్రశ్నించారు. ముస్లిం మహిళల సమస్యలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలోనికి అడుగుపెట్టినప్పటికీ కాంగ్రెస్ పార్టీ కొత్త ఆలోచనలు చేయకుండా పాత పద్ధతులనే అనుసరిస్తోందన్నారు. ఉన్న సీట్లు కూడా పోతాయనే భయం కాంగ్రెస్‌ను వెంటాడుతోందని, అందుకే ఇష్టానుసారంగా బిజెపిపై ఆరో పణలు చేస్తున్నదన్నారు.



ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును సోమవారం డిజిపి మహేందర్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా సిఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పారు.

2499



- భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు
- 1671 వాహనాల సీజ్

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: రాత్రి పది గంటలు అవుతుందనగానే పోలీసులు ముమ్మర తనిఖీలు మొదలుపెట్టారు. ముందస్తు హెచ్చరికలు చేసినా, విస్తృత ప్రచారం కల్పించి ఆంక్షలు విధించినా మందుబాబులు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. ఎలాంటి రాజీలేకుండా, ఎక్కడా ఒత్తిళ్లకు అవకాశమివ్వకుండా, తనిఖీలు చేపట్టిన పోలీసులు వందల సంఖ్యలో కేసులు నమోదు చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్‌ల పరిధిలో డిసెంబర్ 31న రాత్రి 10 గంటల నుంచి తెల్లవారు జాము 3 గంటల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు జరిపినట్టు అధికార వర్గాలు వెల్లడించాయి

22,540 వాహనాల తనిఖీలు..

పోలీసు అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం 31న రాత్రి 10 గం.ల నుండి జనవరి 1 తెల్లవారు జాము 3 గం.ల వరకు జరిపిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా మొత్తం 22,540 వాహనాల తనిఖీలు జరపగా 2,499 కేసులను నమోదు చేసినట్టు పోలీసు వర్గాలు వెల్లడిస్తున్నాయి. కాగా మొత్తం 1671 వాహనాలను సీజ్ చేశారు. ఇందులో 1309 ద్విచక్ర వాహనాలను, 86 మూడు చక్రాలవి, 276 నాలు చక్రాల వాహనాలున్నాయని పోలీసు వర్గాలు వివరిస్తున్నాయి. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 1683 కేసులు, సైబరాబాద్ పరిధిలో 582, రాచకొండ పోలీసు కమిషనరేట్ ప్రాంతంలో 234 కేసులు నమోదైనట్టు పేర్కొన్నారు.

దేశ రాజధాని ఢిల్లీలోనూ: దేశ రాజధాని నగరం న్యూఢిల్లీలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అర్ధరాత్రి 12గంటల ముందు 745 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డారని పోలీసులు తెలిపారు. 12 గంటల తర్వాత 1007 కేసు లు కాగా మొత్తం 1,752 కేసులు నమోదు చేసినట్టు పో లీసు వర్గాలు వెల్లడించాయి. ఉల్లంఘనలో 90శాతం యువత ఉన్నట్లు పేర్కొంటున్నారు.

బెంగళూరులో: కర్ణాటక రాజధాని బెంగళూరులో 1300 మంది ట్రాఫిక్ ఉల్లంఘించినట్టు పోలీసులు వెల్లడించారు.

ప్రదీప్ @ 170



టివి యాంకర్, నటుడు ప్రదీప్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. అతడికి చేసిన బ్రీత్ ఎనలైజర్ టెస్ట్‌లో ఆల్కహాల్ 170 పాయింట్లుగా నమోదైనట్టు అధికారులు తెలిపారు. ప్రదీప్ కారులో మరో ముగ్గురు ఉన్నట్టు పోలీసు వర్గాలు వెల్లడించాయి. వాస్తవానికి 35 పాయింట్లు దాటితేనే వాహనదారుడి వాహనాన్ని సీజ్ చేసి, శిక్షను అమలు చేయడం జరుగుతుందని పోలీసులు పేర్కొంటున్నారు. ప్రదీప్‌కు జరిమానాతో పాటు జైలు శిక్ష పడే అవకాశాలు లేకపోలేదని పోలీసు వర్గాలు వెల్లడించాయి. పట్టుబడిన వారిలో చాలామంది సంపన్న వర్గాలు, వారి పిల్లలే ఉన్నారన్నారు.

ఒక్కరోజులోనే రూ.160 కోట్ల మద్యం అమ్మకాలు



మన తెలంగాణ/హైదరాబాద్: నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా ఆ దివారం ఒక్కరోజే రాష్ట్రంలో రికార్డు స్థాయిలో అత్యధికంగా రూ.160 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయని అబ్కారీ అధికారులు తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 20 శాతం మద్యం అమ్మకాలు పెరిగాయి. అత్యధికంగా రంగారెడ్డి (పాత) జిల్లాలో రూ.50 కోట్ల మద్యం అమ్మకాలు జరిగాయి.

సినీ టికెట్ల కమిటీపై రిట్

మన తెలంగాణ/ హైదరాబాద్ : సినిమా టిక్కెట్ రేట్లను నిర్ణయించే కమిటీలో నిర్మాతలు దగ్గుబాటి సురేశ్‌బాబు, సి.కళ్యాణ్‌లను సభ్యులుగా నియమిస్తూ ఏపీ సర్కార్ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైకోర్టు రిట్ దాఖలైంది. నిర్మాతలు లాభాలు ఆర్జించే కోణంలోనే వారి ఆలోచన ఉంటుందని, ప్రేక్షకుల కోణంలో వారు పరిశీలన చేయబోరంటూ సినీ ప్రేక్షక వినియోగదారుల సంఘం అధ్యక్షుడు జీఎల్ నర్సింహారావు రిట్ వేశారు. కమిటీ ఏర్పాటుపై ఎవరికీ అభ్యంతర ఉండబోదని, అయితే సినిమాలు తీసే నిర్మాతలే సభ్యులుగా ఉంటే వారే ప్రధానంగా లబ్ధి పొందే అవకాశాలు ఉంటాయని పిటిషనర్ రిట్‌లో అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. సినిమా టిక్కెట్ల రేట్ల నిర్ణయంపై కమిటీ వేయాలని రెండేళ్ల క్రితం హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హోం శాఖ ముఖ్య కార్యదర్శి సారథ్యంలో కమిటీ ఉండాలని ఉత్తర్వులు జారీ చేసింది. అయితే రేట్లపై జీవోలు జారీ చేస్తున్న ప్రభుత్వం ధరల నిర్ణయం కోసం కమిటీ వేయలేదని పిటిషనర్ ఆరోపణ. ఎపి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శితో పాటు సినీ నిర్మాతలు ఆ ఇద్దరినీ ప్రతివాదులుగా చేశారు. ఈ రిట్‌పై మంగళవారం హైకోర్టు విచారణ జరిపే అవ కాశముంది.

సైన్స్ కాంగ్రెస్‌పై పిల్

మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్‌లోని చారిత్రక ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు జరిగేలా ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ పిహెచ్‌డి విద్యార్థులు విజయ్‌కుమార్, కిరణ్‌కుమార్ ఇతరులు హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ప్రభుత్వం తప్పుడు నివేదికలు కేంద్రానికి ఇవ్వడం వల్లే సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు వేరే ప్రాంతంలో నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. దీని వల్ల ఒయు ప్రతిష్ట మంటగలుస్తుందన్నారు. ఇప్పటికే ఒయు రూ.50 కోట్ల వ్యయం కూడా చేశారని, ఇక్కడే నిర్వహిస్తే ఒయుకు రూ.300 కో ట్ల మేరకు లబ్ధి చేకూరేదన్నారు. రూ.50 కోట్లు వృథా కాకుండా ఇక్కడే సమావేశాలు నిర్వహించాలని రిట్‌లో హై కోర్టును కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ కార్యదర్శి, ఒయు విసి, డిజిపి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్లను ప్రతివాదులుగా పేర్కొన్నారు.

గిడ్డంగుల నిర్మాణం ముమ్మరం

- అంచనా వ్యయం వేయి కోట్ల పైనే!
- రెండు విడతల్లో పనులు పూర్తి



మన తెలంగాణ/హైదరాబాద్: రైతులకు గిట్టుబాటు ధర వచ్చే వరకు తమ ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ మార్కెట్లలో కొత్తగా 330 చోట్ల వ్యవసాయ గిడ్డంగుల నిర్మాణాన్ని చేపడుతున్నారు. 17.075 లక్షల మెట్రిల్ టన్నుల ధాన్యాన్ని ఇందులో నిల్వ చేయనున్నారు. నాబార్డు రుణ సహాయంతో చేయనున్న ఈ గిడ్డంగుల నిర్మాణపు అంచనా వ్యయం రూ. 1024.50 కోట్లు కాగలదని భావిస్తున్నారు. మొత్తం రెండు విడుతల్లో ఈ గిడ్డంగులను నిర్మిస్తున్నారు. వీటిలో ఇప్పటివరకు 321 గోదాముల నిర్మాణం మొదలు పెట్టారు. ఈ ఏడాది చివరి నాటికి నిర్మాణం ప్రారంభించినవి పూర్తిచేయాలని మార్కెటింగ్ శాఖ నిర్దేశించుకుంది. ఇప్పటికే వరి, మొక్కజొన్న , పప్పు దినుసులు, నూనె గింజల సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మంచి దిగుబడులు బాగా వచ్చిన ప్పుడు కొన్ని సందర్భాల్లో గిట్టుబాటు ధరలు ఉం డడం లేదు. పంటలు చేతికి అందినా సరైగ గిట్టుబాటు రాని పరిస్థితుల్లో రైతాంగం ఈ గోదాముల్లో పంటలను నిల్వ చేసుకునేందుకు అవకాశం కల్పించనున్నారు. పండించిన పంట నిలువకూ, మార్కెటింగ్‌కు తగిన సౌకర్యాలు అభివృద్ధి చేయడంలో గిడ్డంగులు కీలకంగా నిలుస్తాయని భావిస్తున్నారు.

జిల్లా	సామర్థ్యం (మెట్రిక్ టన్నుల్లో)	నిధులు (రూ. లక్షల్లో)
మహబూబ్‌నగర్	155000	9300
మెదక్	230000	13800
రంగారెడ్డి	307500	18450
నల్లగొండ	82500	4950
ఖమ్మం	117500	7050
నిజామాబాద్	165000	9900
వరంగల్	217500	13050
ఖమ్మం	182500	10950
ఆదిలాబాద్	250000	15000
మొత్తం	1707500	102450

తెలంగాణను నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే సిఎం లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి


మన తెలంగాణ/హైదరాబాద్ : తెలంగాణను దేశంలో నెంబర్ వన్ రాష్ట్రంగా ముఖ్యమంత్రి కెసిఆర్ తీర్చిదిద్దుతున్నారని ఉప ముఖ్యమంత్రి, విద్యా శాఖ మంత్రి కడియం శ్రీహరి అన్నారు. రాష్ట్ర ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో అందరి ఆశలు నెరవేరాలని, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కెసిఆర్ చేస్తున్న అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని, ప్రగతి ఫలాలు పొందాలని అభిలాషించారు. రాష్ట్ర గవర్నర్ ఇ.ఎస్.ఎల్.నరసింహన్‌ను, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావులను కలిసి ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలిపారు. తన నివాసంలో కేక్ కట్ చేసి నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. తనను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన వారికి స్వీట్లను ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విద్యాశాఖ సంక్షేమ, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గత ఏడాదిగా నిర్మించిన విద్యాలయాల భవనాల చిత్రాలతో రూపొందించిన క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు.

ఎంఎస్ఎస్‌పై నిషేధం ఎత్తివేతకు డిమాండ్

మన తెలంగాణ/హైదరాబాద్ : జార్ఖండ్ ప్రభుత్వం మజ్దూర్ సంఘటన్ సమితి (ఎంఎస్ఎస్)పై విధించిన నిషేధాన్ని ఎత్తివేయాలని రెవల్యూషనరీ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఆర్‌డిఎఫ్) డిమాండ్ చేసింది. నిషేధాన్ని బేషరతుగా ఎత్తివేసి ఎంఎస్ఎస్ కార్యాలయాలు యథావిధిగా కార్యకలాపాలు సాగించుకునే అవకాశం కల్పించాలని ఆర్‌డిఎఫ్ అధ్యక్షుడు వరవరరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంతర్గత భద్రత పేరుతో ప్రజా ఉద్యమాల అణచివేతను, గ్రీన్‌హంట్‌ను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. జార్ఖండ్‌లో సహజ వనరులను కార్పొరేట్ దోపిడీకి అప్పగించేందుకు బిజెపి నియంతృత్వ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా గళం విప్పాలని కార్మికులు, ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. మావోయిస్టు పార్టీకి సంబంధించిన సంస్థగా ముద్రవేసి ఎంఎస్ఎస్‌పై నిషేధం విధించారని, నిజానికి ఎంఎస్ఎస్ నమోదిత కార్మిక యూనియన్‌గా రాంచి, ధన్‌బాద్ తదితర ప్రాంతాల్లో కార్యాలయాలు కలిగి చట్టబద్ధంగా, బహిరంగంగా కార్యక్రమాలు నిర్వహించే సంస్థ అని వివరించారు. పర్యాటక స్థలాల అభివృద్ధి పేరుతో జరుగుతున్న విధ్వంసానికి వ్యతిరేకంగా ప్రఎంఎస్ఎస్ ఇతర సంస్థలతో కలిసి ఉద్యమిస్తోందన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎదురిస్తున్నందుకే ఎంఎస్ఎస్‌పై నిషేధం విధించారన్నారు. అభివృద్ధి పేరుతో విధ్వంసక విధానాలను అమలు చేస్తున్న సామ్రాజ్యవాదులు, వారి ఏజెంట్లకు వ్యతిరేకంగా మద్దతు తెలపాలని వరవరరావు కోరారు.

తుది దశలో ‘ఉదయ సముద్రం’

- వారంలో పంపులు, మోటార్ల బిగింపు
- పనుల పురోగతిపై మంత్రి హరీశ్‌రావు నిరంతర సమీక్షలు





మన తెలంగాణ/హైదరాబాద్: ఉదయ సముద్రం ప్రాజెక్టు పనులు వేగంగా సాగుతున్నాయి. త్వరలోనే ఈ ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. పంపులు, మోటార్ల బిగింపు ప్రక్రియ కూడా వారం రోజుల్లోపే పూర్తి చేయనున్నారు. ఫ్లోరైడ్ పీడిత ప్రాంతాలకు తాగునీటి కోసం ఉద్దేశించిన ఉదయ సముద్రం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి ఇరిగేషన్ అధికార యంత్రాంగం ఏజెన్సీలు ప్రయత్నిస్తున్నాయి. నల్లగొండ, నకిరేకల్, మునుగోడు, తుంగతుర్తి అసెంబ్లీ నియోజక వర్గాలలో లక్ష ఎకరాలకు ఈ ప్రాజెక్టు సాగునీటిని అందించనుంది. నల్లగొండ, నార్కెట్ పల్లి, చిట్యాల, మునుగోడు, రామన్నపేట నకిరేకల్ మండలాల్లోని 107 ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు రక్షిత తాగునీటిని అందిస్తారు. ఉదయ సముద్రం పూర్తి అయితే నల్లగొండ నియోజకవర్గంలో 24,468 ఎకరాలు నకిరేకల్ నియోజకవర్గంలో 62,476 ఎకరాలు, మునుగోడులో 10,270 ఎకరాలు , తుంగతుర్తి అసెంబ్లీ నియోజక వర్గంలో 2784 ఎకరాలు సాగులోకి వస్తాయి. జనవరిలో బ్రాహ్మణ వెల్లం రిజర్వాయర్‌లోకి నీళ్లు పడాలన్న మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు ఈ రిజర్వాయర్ పనులను అధికారులు వేగంగా పూర్తి చేస్తున్నారు. ఉదయ సముద్రం ప్రాజెక్టులో 92 మీటర్ల ఎత్తున సర్జ్‌పూల్ నిర్మాణం పూర్తి అవుతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని తాగునీటి సాగునీటి పథకాల పురోగతిని మంత్రి హరీశ్‌రావు నిరంతరం సమీక్షిస్తున్నారు. అధికార యంత్రాంగానికి తగిన సూచనలు, సలహాలు చేస్తున్నారు.

మన తెలంగాణ
3
హైదరాబాద్
మంగళవారం
2, జనవరి 2018
www.manatelangana.news



న్యూజెర్సీలో కాల్పులు : నలుగురు మృతి

అమెరికా : కొత్త సంవత్సరం వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. ఓ బాలుడు తన కుటుంబంపై కాల్పులు జరిపాడు. న్యూజెర్సీలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటనలో నలుగురు చనిపోయారు. న్యూజెర్సీలోని లాంగ్ బ్రాంచ్ స్ట్రీట్‌కు చెందిన ఓ అపార్ట్‌మెంట్‌లో అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నూతన సంవత్సర వేడుకలు జరుకున్నారు. ఇంతలో ఓ బాలుడు అపార్ట్‌మెంట్‌లో చొరబడి ఏకె47తో కాల్పులు జరిపాడు. ఇది ఉగ్ర చర్య కాదని, వ్యక్తిగత కక్షతోనే ఆ బాలుడు కాల్పులు జరిపినట్టు పోలీసులు తెలిపారు. కాల్పులు జరిపిన బాలుడిని పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

ఢిల్లీలో భారీగా ట్రాఫిక్ జామ్

ఢిల్లీ : ఢిల్లీలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నూతన సంవత్సర వేడుకల కోసం ఇండియా గేట్ వద్ద పర్యాటకులతో కిక్కిరిసిపోయింది. ఇండియా గేట్‌తో పాటు తిలక్ మార్గ్, మండి హౌస్ సర్కిల్ తదితర ప్రాంతాల్లో సైతం ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనాలు ముందుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. మునుపెన్నడూ ఇంతగా ట్రాఫిక్ జామ్ కాలేదని పోలీసులు తెలిపారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.



గవర్నర్‌తో సిఎం కెసిఆర్ భేటీ

మన తెలంగాణ/ హైదరాబాద్: ఆంగ్ల నూతన సంవత్సరాది సందర్భంగా గవర్నర్‌ను కలిసిన ముఖ్యమంత్రి కెసిఆర్ శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సర కానుకగా రాష్ట్రమంతటా 24 గంటల విద్యుత్ సరఫరా అమల్లోకి రావడం గురించి గవర్నర్‌కు వివరించారు. ఒకప్పుడు విద్యుత్ కోతలతో సతమతమైన తెలంగాణ ఇప్పుడు నిరంతరాయ విద్యుత్ అందించే స్థాయికి ఎదిగిందని, దీని ప్రభావం వ్యవసాయరంగంలో, ఆర్థికాభివృద్ధిలో, పారిశ్రామికీకరణలో ప్రతిఫలిస్తుందని గవర్నర్‌కు వివరించినట్లు తెలిసింది. మునుపెన్నడూ లేని విధంగా నిరంతరాయ విద్యుత్ సరఫరాకు క్రిందిస్థాయి సిబ్బంది మొదలు ఉన్నతాధికారి వరకు పడిన శ్రమను వివరించినట్లు సమాచారం. దీనికి తోడు హైకోర్టు విభజన ప్రక్రియ తెరమీదకు వచ్చిన అంశాన్ని కూడా ప్రస్తావించినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబునాయుడు హైకోర్టు విభజన గురించి ఇటీవల హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాయడం, తెలంగాణ ఎంపీలు లోకసభలో కేంద్రంపైవత్తిడి తేవడం, కేంద్ర న్యాయమంత్రి స్పష్టమైన హామీ ఇవ్వడం తదితరాలన్నింటినీ గవర్నర్ దృష్టిక సిఎం తీసుకెళ్ళినట్లు తెలిసింది. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి రెండు రాష్ట్రాలకు వేర్వేరు హైకోర్టులు ఏర్పాటయ్యే అంశంపై విస్తృతంగానే వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది.

సిఎంకు రెడ్డి జనసంఘం సత్కారం



మన తెలంగాణ/ హైదరాబాద్ : ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా వేదికపై తన గురువు కాళ్ళకు దండం పెట్టి తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటినందుకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుకి రెడ్డి జనసంఘం నాయకులు సత్కరించారు. ప్రగతిభవన్‌లో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని సిఎం కెసిఆర్‌ను హోం మంత్రి నాయిని నర్సింహారెడ్డి, ఎంఎల్‌సి ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఎంఎల్‌ఎ ప్రశాంత్‌రెడ్డిలతో పాటు రెడ్డి జనసంఘం సలహాదారులు ప్రొఫెసర్ కె.దశరథరెడ్డి, అధ్యక్షులు వేమిరెడ్డి నర్సింహారెడ్డిలు సోమవారం నాడు కలిసారు. ఈ సందర్భంగా ఆయనకు మెమెంటోను అందజేశారు. మెమెంటోపై సిఎం తన గురువుకు పాదాభివందనం చేసిన ఫోటోను ముద్రించారు. గురుపూజ తెలంగాణ సంస్కృతి అని, దానిని ప్రపంచ తెలుగు మహాసభల వేదికగా చాటిన సిఎం కెసిఆర్‌ను అందరూ ప్రశంసించారని వారు పేర్కొన్నారు.

నేడు గవర్నర్‌ను కలువనున్న వామపక్షాలు

మన తెలంగాణ/ హైదరాబాద్: టేకులపల్లి ఎన్‌కౌంటర్ ఘటనపై వామపక్షాలు మంగళవారం గవర్నర్‌కు వినతిపత్రాన్ని అందజేయనున్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి నేతృత్వంలో వామపక్ష నేతలు డి.జి.నరసింహారావు(సిపిఐ(ఎం), పోటు రంగారావు, కె.గోవర్ధన్ (సిపిఐ–ఎంఎల్ న్యూడెమోక్రసి), సి.హెచ్. మురహరి(ఎస్‌యుసిఐ(యు), తాండ్ర కుమార్ (ఎంసిపిఐ(యు), ఆర్.గోవిందు (ఆర్‌ఎస్‌పి), బండా సరేందర్‌రెడ్డి(ఆలిండియా ఫార్వార్డ్ బ్లాక్) గవర్నర్‌ను కలువనున్నారు.

తెలుగు జాతి ఆకాంక్షలు నెరవేరాలి

గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్

మన తెలంగాణ/ హైదరాబాద్ : నూతన సంవత్సరంలో తెలుగు ప్రజల ఆకాంక్షలు నెరవేరాలని గవర్నర్ నరసింహన్ అన్నారు. తెలుగు ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. రాజ్‌భవన్‌లోని ప్రజా దర్బార్‌లో సోమవారం ఆయనను కలిసిన నాయకులు, ప్రభుత్వాధికారులు, ఉద్యోగులు, పాఠశాల విద్యార్థులు, సామాన్య ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో శాసనసమండలి ఛైర్మన్ స్వామిగౌడ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్, శాసనమండలి మాజీ ఛైర్మన్ చక్రపాణి, మాజీ సిఎస్ ఐ.వై.ఆర్.కృష్ణారావు, పలువురు ఉన్నతాధికారులున్నారు.

సిఎంకు ప్రముఖుల శుభాకాంక్షలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును ప్రగతిభవన్‌లో సోమవారం కలుసుకున్న పలువురు ప్రముఖులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.పి.సింగ్, ఇతతర ఐఎఎస్ అధికారులు, డిజిపి మహేందర్‌రెడ్డితో పాటు ఇతర ఐపిఎస్ అధికారులు, విద్యుత్, సింగరేణి, ఆర్టీసి అధికారులు, కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు సిఎంకు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

ఉద్యమంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర సాధనలో ఉపాధ్యాయుల పాత్ర కీలమైనదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అన్నారు. రాష్ట్రోపాధ్యాయ సంఘం, తెలంగాణ రాష్ట్రం (ఎస్‌టియు, టిఎస్) రూపొందించిన నూతన సంవత్సరం 2018 డైరీని ప్రగతి భవన్‌లో సోమవారం ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రస్తావించగా సిఎం సత్వర పరిష్కారానికి కృషి చేస్తానని హామి ఇచ్చినట్టు ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధన కార్యదర్శి. బి.భుజంగరావు, జి.సదానందం గౌడ్‌లు తెలిపారు. కార్యక్రమంలో డైరీ కన్వీనర్ ఎ.వి.సుధాకర్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి బి.రవి తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌టిసిని మరింత మెరుగుపర్చాలి

- **మంత్రి మహేందర్‌రెడ్డి**

మన తెలంగాణ/ హైదరాబాద్: ప్రజా రవాణ వ్యవస్థను మరింత మెరుగుపర్చాలని రవాణ శాఖ మంత్రి పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మంత్రి నివాసంలో రవాణ శాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ, ఆర్‌టిసి ఎండి రమణరావు, రాష్ట్ర ఎంవిఐల సంఘం అధ్యక్షుడు పాపారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ తదితరులు మంత్రి మహేందర్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఆర్‌టిసి బలోపేతంపై వారు కొద్ది సేపుచర్చించారు. హైదరాబాద్ మెట్రో రైలుతో ఆర్‌టిసి బస్సుల అనుసంధానం అంశంపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఇడిలు సత్యనారాయణ, రవీందర్, పురుషోత్తం నాయక్, జెటిసిలు రమేష్, డిటిసిలు ప్రవీన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.





నూతన సంవత్సరం రోజు ''మన తెలంగాణ'' కార్యాలయంలో సిబ్బంది ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంస్థలోని యంగ్ జర్నలిస్టు మౌనికతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎడిటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో మేనేజింగ్ ఎడిటర్ పి.అంజయ్య, ఎడిటోరియల్ కన్సల్టెంట్స్ జి.శ్రీరామమూర్తి, ఎం.సుబ్బారావు, నెట్‌వర్క్ కో-ఆర్డినేటర్ ఆర్.జైపాల్‌రెడ్డి తదితరులు

పోలీసుల చేతిలో సాంకేతిక అస్త్రం

- 'టిఎస్ కాప్' యాప్ ప్రారంభించిన డిజిపి
- నేర సమాచార విశ్లేషణలో కీలకం

మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర డిజిపి మహేందర్ రెడ్డి టిఎస్ కాప్ (TSCOP) మొబైల్ యాప్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ పోలీసు శాఖకు 2018 సంవత్సరం ఒక గేమ్ ఛేంజర్ అని వ్యాఖ్యానించారు. పోలీసు శాఖ ఈ ఏడాది సరికొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించనుందని, అందులో భాగమే ఇప్పుడు శాతి భద్రతలకు, ఇతర అవసరాలకు ఉపయోగపడే 'టిఎస్ కాప్' మొబైల్ అప్లికేషన్ అని పేర్కొన్నారు. టిఎస్ కాప్ మొబైల్ యాప్ ద్వారా 54 రకాల సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. నేర పరిశోధన విభాగాల్లోని ఉద్యోగులకు ఉపయోగపడే సమస్త సమాచారం ఈ యాప్‌లో ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన యాప్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులోకి తెస్తున్నామని వెల్లడించారు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లేలోపే ఈ ప్రత్యేక యాప్ ద్వారా చాలా సమాచారం అందుబాటులోకి వస్తుందన్నారు. మున్ముందు మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని డిజిపి మహేందర్‌రెడ్డి ప్రకటించారు. పోలీసుల విధులు పారదర్శకంగా ఉండేందుకు ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. అలాగే నేరాల నివారణ, నేర దర్యాప్తు, నిందితుల ఆరా, అనుమానాస్పద వ్యక్తుల నివృత్తి, ఏ అధికారి ఎక్కడ విధుల్లో ఉన్నారో ఈ యాప్ ద్వారా తెలిసిపోతుందని, బీట్ పోలీసుల తనిఖీ తీరును కూడా ఇది తెలియజేస్తుందన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే పోలీసు శాఖ చరిత్ర, నేరాల పుట్టుపుర్వోత్తరాలు, ఆయా ఠాణాల భౌగోళిక, నేరాల పరిస్థితులు, స్కూళ్లు, దేవాలయాలు, ఫంక్షన్‌హాల్స్, సిసికెమెరాలు ఎక్కడెక్కడ ఉన్నాయో ఈ యాప్‌ద్వారా క్షణాల్లో తెలుసుకునే సదుపాయం ఉంది. అలాగే ఎవరైనా అనుమానిత వ్యక్తులు పట్టుబడిన సమయంలో వారి ఫోటోను ఈ యాప్‌లో పెట్టడం ద్వారా ఆ వ్యక్తిపై గతంలో ఏమైనా నేరాలు ఉన్నాయా లేదా అనేది క్షణాల్లో తేలిపోతుందన్నారు. తద్వారా అమాయకులను పోలీసులు వేధించకుండా ఇది ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐపిఎస్ అధికారులు అంజనీకుమార్, గోవింద్‌సింగ్, నవీన్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.



యాప్ ఇలా పనిచేస్తుంది : బీట్ పోలీసులు తనిఖీ చేసిన ప్రాంతాల రిపోర్ట్‌ను ఠాణా ఎస్‌హెచ్‌ఓకి యాప్ అందజేస్తుంది. ముందు షిఫ్ట్‌ల్లో పోలీసులు తనిఖీ చేయని ప్రాంతాలను బ్లింక్ చేస్తూ మరుసటి షిఫ్ట్ పోలీసులకు మార్గదర్శకం చేస్తుంది. అన్ని పాయింట్లు, నేరస్థుల ఇళ్లను పోలీసులు తనిఖీ చేసే విధంగా యాప్ దిశ నిర్ధేశం చేస్తుంది. నేరస్తుల చిరునామాలు ఈ యాప్‌లో నిక్షిప్తమై ఉంటాయి. ఏదైనా అధికారి ఏదేని కొత్త ప్రాంతానికి బదిలీపై వెళితే ఆ ప్రాంతంలో నేరస్తుల నివాసాలు ఎక్కడెక్కడ ఉన్నాయి, ఆ నేరస్తుల ఫోటో, వారు చేసిన నేరాల చిట్టా అంతా ఈ యాప్ ద్వారానే తెలుసుకోవచ్చు.

గస్తీ సుస్తికి ఇక స్వస్తి : పోలీసులు ఇటీవల ఇంటింటి సర్వే చేసి నాలుగు వేల మంది నేరస్థుల డేటాను తయారు చేశారు. వారి పేరు, ఫోటో, చిరునామా, ఫోన్ నెంబర్, ప్రస్తుత వృత్తి, కుటుంబ నేపథ్యంతో పాలు తదితర వివరాలను యాప్‌లో పొందుపర్చారు. వారు ఏం చేస్తున్నారో పెట్రోలింగ్ విధుల్లో ఉన్న పోలీసులు నేరస్తుల ఇళ్లకు వెళ్లి తనిఖీ చేయాలి. మాన్యువల్‌గా అయితే ఆ ఇంటికి వెళ్లకుండా వెళ్లినట్లు చెప్పినా అందుకు సాక్ష్యం ఉండేదికాదు. యాప్‌లో ప్రతి నేరస్థుడి ఇంటికి అంక్షాంశాలు, రేఖాంశాల ద్వారా ఫిక్స్ చేశారు. నేరస్థుడి ఇంటికి వెళ్లినప్పుడే యాప్‌లోని అఫెండర్ స్టేటస్ ఒపెన్ అవుతోంది. ఆ సందర్భంలోనే నేరస్థుడి వివరాలను పొందుపర్చాల్సి ఉంటుంది. సంబంధిత ప్రదేశానికి రాకుండా ఎక్కడో ఉండి యాప్ ద్వారా ఫీడ్ చేయడం కుదరదు. నిర్దిష్ట ప్రాంతానికి వెళ్ళినప్పుడు మాత్రమే యాప్‌లోని స్టేటస్ ఒపెన్ అవుతోంది. అప్పుడే సమాచారాన్ని ఫీడ్ చేయగలరు.

యాప్‌లో 54 ఆప్షన్లు : యాప్‌లో ప్రాథమికంగా 54 ఆప్షన్లున్నాయి. ఎంవో ఆఫెండర్ చెకింగ్, క్రైం సీన్ మేనేజ్‌మెంట్, క్రైం మ్యాపింగ్, టవర్ అండ్ కామ్స్, జైల్ రిలీజర్స్, మాన్యువల్ సిస్టమ్, ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్, థర్డ్ ఐ, కొలాబరేషన్, మై డెస్క్, పాట్రోల్ మేనేజ్‌మెంట్, లుకవుట్ నోటీస్ అప్షన్లు ఉన్నాయి. ఇన్సిడెంట్ మేనేజ్‌మెంట్ ఆప్షన్‌లో సంబంధిత పోలీసు స్టేషన్ పరిధిలో ఆస్పత్రులు, అంబులెన్స్‌లు, బ్లడ్‌బ్యాంకులు, అనాథ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు, వెనెన్యూ, మునిపల్, స్త్రీ, శిశుసంక్షమ, విద్యుత్, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తదితర నెంబర్లను పోలీసులకు అందుబాటులో ఉంచారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవటానికి ఈ సౌకర్యం కల్పించారు.

నేరాలు జరగకుండా ముందస్తు చర్యలు

రాష్ట్రంలో పనిచేసే సిబ్బందికి క్రైం మ్యాపింగ్‌తో నేరాలు ఎక్కువ జరిగే ప్రాంతం, సమయం, రోజు గురించి తెలుసుకునే వీలుంది. దాని ఆధారంగా ఆయా ప్రాంతాల్లో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండేందుకు అవకాశముంది. పరిజ్ఞానంతో క్షేత్ర స్థాయిలో ఉండే సిబ్బంది నేరాల నివారణపై పట్టు బిగిస్తారు. ఎప్పటికప్పుడు రిపోర్టులను తీసుకుంటూ విశ్లేషిస్తూ ప్రాపర్టీ అఫెన్స్ తగ్గించేందుకు నిరంతరం ప్రయత్నిస్తారు. పాట్రోలింగ్ కారు పని తీరు :రాష్ట్రంలోని అన్ని ఠాణాల పరిధిలో పాట్రోలింగ్ కార్లు తిరుగుతుంటాయి. వీటి పనితీరును ఈ యాప్ ద్వారా 24 గంటలు తెలుసుకునే సదుపాయం ఉంది. ఏ వాహనం ఎక్కడుందో ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. వాహనం కదులుతూ ఉందా లేక ఒకచోటా ఆగిందా, ఆ వాహనం ఉదయం నుంచి ఏఏ రూట్స్‌లలో తిరిగింది. ఎక్కడెక్కడ ఎంత సేపు ఆగింది అనే వివరాలన్ని ఈ యాప్‌లో నమోదవుతాయి. తద్వారా గస్తీ పోలీసులు అక్రమాలకు పాల్పడే అవకాశాలు లేవు. స్వంత పనులకు వాహనాలను ఉపయోగిస్తే ఈ యాప్ ఇట్టే పట్టేస్తుంది. అలాగే ఆ వాహనంలో రోజుకు ఎంత పెట్రోల్ ఖర్చు అవుతోందో కూడా ఈ యాప్ పసిగడుతుంది.





ఆలయాలకు కొత్త శోభ

హైదరాబాద్ : నూతన సంవత్సరం సందర్భంగా వేములవాడ శ్రీరాజరాజేశ్వర ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. తలనీలాలు సమర్పించి, ధర్మగుండంలో స్నానమాచరించి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతర స్వామివారి దర్శనం చేసుకున్నారు. స్వామి వారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పడుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని అధికారులు ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

యాదాద్రిలో భక్తుల రద్దీ : కొత్త సంవత్సరం సందర్భంగా యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి సోమవారం భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో క్యూలైన్లు నిండిపోయాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా కొండపైకి వాహనాలను అనుమతించడం లేదు.

అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు

- 24గంటల విద్యుత్ చూసి ఆశ్చర్యపోయా
- కెసిఆర్‌పై పవన్ కళ్యాణ్ ప్రశంసల జల్లు



మన తెలంగాణ / హైదరాబాద్ : జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోమవారం సాయంత్రం ముఖ్యమంత్రి కెసిఆర్‌ను ప్రగతిభవన్‌లో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. కొత్త సంవత్సరం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన 24 గంటల విద్యుత్ సరఫరాపై సిఎంతో పవన్ కల్యాణ్ చర్చించారు. ఉమ్మడి రాష్ట్రంలో అనుభవించిన విద్యుత్ కోతల స్థానంలో ఇప్పుడు నిరంతరాయంగా విద్యుత్‌ను సరఫరా చేసే పరిస్థితి గురించి సిఎంతో చర్చించారు. సిఎంతో భేటీ అనంతరం బైటకు వచ్చిన పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్న విషయం తెలుసుకుని ఆశ్చర్యపోయానని, ఉమ్మడి రాష్ట్రంలో సాధ్యంకాని ఈ బృహత్తరమైన కార్యం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎలా సాధ్యమైందో స్వయంగా సిఎంను అడిగి తెలుసుకున్నానని తెలిపారు. విద్యుత్ సరఫరా, కోతల విషయంలో చాలా కాలం నుంచి సందేహాలు ఉండేవని, కెసిఆర్‌తో మాట్లాడిన తర్వాత అవి నివృత్తి అయ్యాయని తెలిపారు. 24 గంటల విద్యుత్ సరఫరా ఎలా సాధ్యమైంతో దేశంలోని ఏ రాష్ట్రమైనా తెలంగాణను అధ్యయనం చేసి ఒక 'కేస్ స్టడీ'గా పరిగణనలోకి తీసుకోవచ్చునని వ్యాఖ్యానించారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేయడం ఎలాగో తెలంగాణను చూసి నేర్చుకోవచ్చని వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించినప్పుడల్లా తెలంగాణలోని నిరంతరాయ ఉచిత విద్యుత్, సంక్షేమ పథకాల పగడ్బందీ అమలు గురించి ఉదహరిస్తూనే ఉంటానని పేర్కొన్నారు. హక్కుల సాధనకు నాయకుల, ప్రజల ఆకాంక్షలు, కార్యదీక్ష ఎలా ఉంటుందో తెలుసుకోడానికి తెలంగాణ నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఆ పార్టీ నాయకులపైనా తనకు తొలి నుంచీ గౌరవం ఉండేదని పవన్ కల్యాణ్ ఒక ప్రశ్నకు సమాధానంగా బదులిచ్చారు. సిఎం కెసిఆర్‌ను ప్రగతిభవన్‌కు వచ్చి కలవడం ఇదే తొలిసారి.

హాఫీజ్‌కు బిగుస్తున్న ఉచ్చు

- జెయుడి, ఎఫ్ఐఎఫ్‌ల స్వాధీనానికి పాక్ ప్రభుత్వం సన్నాహాలు

ఇస్లామాబాద్ : ముంబయి ఉగ్రదాడి సూత్రధారి హాఫీజ్ సయీద్‌పై పాక్ ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు సిద్ధమౌతున్నట్లు కొన్ని రహస్య పత్రాలు వెల్లడిస్తున్నాయి. అంతర్జాతీయ వార్తా సంస్థ రాయిటర్స్ సేకరించిన కొన్ని డాక్యుమెంట్లు ఈ విషయాన్ని వెల్లడిచేస్తున్నాయి. హాఫీజ్ సయీద్‌కు ఆర్థిక దన్నుగా ఉన్న సంస్థలను పాక్ ప్రభుత్వం టార్గెట్ చేసే అవకాశాలున్నట్లు ఆ రహస్య పత్రాల ద్వారా తెలుస్తోంది. హాఫీజ్ సయీద్‌కి చెందిన జమాత్ ఉద్ దవా (జెయుడి), ఫలాహ్ ఇ ఇన్సానియత్ (ఎఫ్ఐఎఫ్) సంస్థలను స్వాధీనం చేసుకునే విషయంలో మీ కార్యాచరణ ప్రణాళికను డిసెంబర్ 28 లోగా తమకు తెలియజేయండని పాక్ ఆర్థిక శాఖ ఐదు స్థానిక ప్రభుత్వాల(ప్రావిన్సు)ను, వివిధ ప్రభుత్వ శాఖలను ఆదేశించింది. ఈ రహస్య ఆదేశాలతో కూడిన పత్రాలు బయటకు పొక్కాయి.


డిసెంబర్ 19న రహస్య ఆదేశాలు జారీ

పాక్ ఆర్థిక శాఖ డిసెంబర్ 19న వెలువరించిన ఆదేశాల్లో ఫైనాన్సియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఎటిఎఫ్)అనే అంతర్జాతీయ సంస్థ గురించి ప్రస్తావించింది. టెర్రర్ ఫైనాన్సింగ్ విషయంలో పాక్ కఠినంగా వ్యవహరించకపోతే పాకిస్థాన్ దేశపు పేరును నిషేధిత జాబితాలో చేర్చాల్సివస్తుందని ఎఫ్ఎటిఎఫ్ చేసిన హెచ్చరికను కూడా ఆర్థిక శాఖ తన రహస్య పత్రంలో పేర్కొంది.హాఫీజ్ సయీద్‌కి చెందిన జమాత్ ఉద్ దవా (జెయుడి), ఫలా హ్ ఇ ఇన్సానియత్ (ఎఫ్ఐఎఫ్) సంస్థల పేర్లను మాత్రమే ఎఫ్ఎటిఎఫ్ ప్రముఖంగా ప్రస్తావించిన అంశాన్ని ఆర్థిక శాఖ తన ఆదేశాల్లో పేర్కొంది. జమాత్ ఉద్ దవా (జెయుడి), ఫలాహ్ ఇ ఇన్సానియత్ (ఎఫ్ఐఎఫ్) సంస్థల స్వాధీన విషయాన్ని రాయిటర్స్ సంస్థ పాక్ విదేశాంగ మంత్రి అహ్సాన్ ఇక్బాల్ వద్ద ప్రస్తావించింది. ఆ సంస్థ అడిగిన ప్రశ్నలకు మంత్రి లిఖిత పూర్వక సమాధానాలు అందించారు. అమెరికా ఒత్తిడి మేరకు పాకిస్తాన్‌లో ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని, ఒక బాధ్యతయత దేశంగా అంతర్జాతీయ సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని, తమ దేశ ప్రజల కోసం అనేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఎవరినో సంతోష పరిచేందుకు పాక్ ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదని తేల్చిచెప్పారు. జమాత్ ఉద్ దవా (జెయుడి), ఫలాహ్ ఇ ఇన్సానియత్ సంస్థలను అదు పునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందనే అంశంపై ఆ సంస్థ అధికార ప్రతినిధి సల్మాన్ షహీద్ స్పందించారు.



S & D

“ఆదర్శాలు ఆదుకోనంత మాత్రాన ఓటమి అనుకోవటం తప్పు. అలా అనుకొని ఆదర్శాలను మరచిపోవడం అసలైన ఓటమి.
– గాంధీజీ”



రజనీ ‘సంచలన రాజకీయం’

సంపాదకీయం

తమిళ సినీరంగుల ప్రపంచ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ అరంగేట్రం చేస్తున్నట్లు ఎట్టకేలకు ప్రకటించి తన అభిమానులను ఆనంద పరవశులను చేశారు. ఐదురోజులపాటు ఫ్యాన్స్‌క్లబ్బులతో సమావేశాలు, గ్రూఫ్ ఫోటోల తదుపరి, ‘ఇప్పుడు నేను రాజకీయాల్లోకి రాకపోతే నాకు జీవితాన్నిచ్చిన తమిళ ప్రజలకు మంచి చేయలేకపోయానన్న అపరాధ భావం నా మరణం వరకు వెన్నాడుతూనే ఉంటుంది. నా సొంత రాజకీయ పార్టీ పెడతాను. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో (2021)మొత్తం 234 స్థానాలకు పోటీ చేస్తాం’ అని అభిమానుల కేరింతల మధ్య ప్రకటించారు. సమయాభావం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేయడం లేదని, 2019 లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ‘సరైన సమయం’లో నిర్ణయం తీసుకుంటానన్నారు. రజనీ రాజకీయాల్లోని వస్తాడా, రాడా అనే 21 సంవత్సరాల సస్పెన్స్‌కు తెరపడింది. 1996లో డిఎంకె–తమిళ మానిల కాంగ్రెస్ కూటమికి ఆయన తోడ్పాటు ప్రకటించారు. డిఎంకె అధికారంలోకి వచ్చింది. ఎఐఎడిఎంకె అధినేత జయలలిత మరణం, కరుణానిధి వృద్ధాప్య అస్వస్థతతో రాష్ట్రంలో ఏర్పడిన రాజకీయ శూన్యత తనను ముఖ్యమంత్రి పీఠానికి చేర్చుతుందని ఆయన భావించినట్లున్నారు. గత సంవత్సరం ఫ్యాన్స్ క్లబ్బుల సమావేశం సందర్భంలోనే రజనీ రాజకీయ రంగప్రవేశ ప్రకటన చేస్తారని అభిమానులు భావించారు. అయితే ఆధ్యాత్మికుడైన రజనీకాంత్ ‘దేవుడు శాసిస్తాడు–రజనీ పాటిస్తాడు’ అంటూ అప్పటికి నిర్ణయాన్ని వాయిదా వేశారు. జయలలిత మరణానంతర పరిణామాలను పరోక్షంగా ప్రస్తావిస్తూ, గత సంవత్సర కాలంలో దిగజారిన తమిళనాడు ప్రతిష్టను పునరుద్ధరించటం తన ధ్యేయంగా ప్రకటించారు. అవినీతి నిర్మూలన ఆయన ప్రధాన ఎజండా. ప్రజలకు చేరాల్సిన సొమ్మును మధ్యలో తినేసే రాజకీయ రాబందులు లేని వ్యవస్థను ఆయన ఊహిస్తున్నారు.‘‘మేము చేసిన వాగ్దానాలను మూడేళ్లలో నెరవేర్చలేకపోతే రాజీనామా చేస్తాం’’ అన్న రజనీ ప్రకటనే ఆయన ఊహాజనితవాది అని వెల్లడిస్తున్నది.

తమిళనాట సినిమాలకు, రాజకీయరంగానికీ అవినాభావ సంబంధం ఉంది. అన్నాదురై, కరుణానిధి, ఎంజి రామచంద్రన్, జయలలిత సినీ జగత్తునుంచి ద్రవిడ రాజకీయాల్లో ప్రవేశించి అందలమెక్కినవారే. బ్రాహ్మణీక వ్యవస్థకు వ్యతిరేకంగా బలమైన సంఘ సంస్కరణోద్యమం నడిపిన ద్రవిడ ఉద్యమం వారికి పునాది. తమిళభాష, ద్రవిడ, సంస్కృతి పరిరక్షణ వారి ప్రచారాస్త్రం. అందువల్లనే బ్రాహ్మణీకవాద బిజెపికి ఎన్ని ప్రయత్నాలు చేసినా తమిళనాడులో పునాదికరవైంది. రజనీకాంత్ ఆశీస్సులు పొందటానికి, ఆయన్ను రాజకీయాల్లోకి తేవటానికి బిజెపి జాతీయ నాయకత్వం చాలా ప్రయత్నాలు చేసింది. గత లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్రమోడీ రజనీని కలవటం గుర్తు చేసుకోదగింది.

తమిళ రాజకీయాల్లో అదృష్ట పరీక్షలో విఫలమైన సినీ ప్రముఖుల్లో శివాజీ గణేశన్, విజయకాంత్, శరత్‌కుమార్ ఉన్నారు. అందువల్ల సినిమాల ద్వారా లభించిన స్టార్ ఇమేజి ఒక్కటే రాజకీయరంగంలో సక్సెస్‌కు బాటవేయదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనుభవం కూడా అదే. ఎన్‌టిఆర్ సక్సెస్ కాగా చిరంజీవి విఫలమైనాడు. కుల, మతాలకు అతీతంగా ‘‘ఆధ్యాత్మిక రాజకీయాలు’’ నడుపుతానంటున్న రజనీకాంత్, అవినీతిని అసహ్యించుకోవటం మినహా దాని స్వరూప స్వభావాలేమిటో వివరించలేదు. అయితే ఆయన చిరకాల మిత్రుడు, సాటి మేటి నటుడు కమల్ హాసన్ కూడా రాజకీయాల్లోకి వస్తున్నట్లు ఇంతకుముందే ప్రకటించారు. కాబట్టి అతివాదం నుంచి మితవాదం వరకు సాంప్రదాయక రాజకీయ పార్టీలతో పాటు తనకు సరిసమానమైన సినీ గ్లామర్‌ను కూడా రజనీ ఎదుర్కోవాల్సి ఉంటుంది.


రజనీకాంత్‌కు ఎదురయ్యే సవాళ్లలో ముఖ్యమైంది తన మూలాలు. బెంగళూరులో పుట్టిపెరిగిన మహారాష్ట్రియన్ శివాజీరావు గైక్వాడ్ (రజనీకాంత్)ను జాతి అభిమానం మెండుగా గల తమిళులు ఎంతవరకు ఆమోదిస్తారో వేచిచూడాల్సిందే. తాను 40 ఏళ్లుగా తమిళనాడులో స్థిరపడి తమిళుల్లో ఒకడిగా జీవిస్తున్నానని రజనీకాంత్ చెప్పినప్పటికీ, గత ఏడాది కొన్ని తమిళ దురభిమాన సంఘాలు వ్యతిరేక ప్రదర్శనలు చేశాయి.

‘సెక్యులర్’ తీస్తే అయిపోతుందా?

చూపు

దేశ రాజ్యాంగాన్ని కూర్చడానికి రాజ్యాంగ పీఠం దాదాపు మూడేళ్ల పాటు శ్రమించింది. దాని పరిమితుల గురించి, ఆలోచించిన ఆ పీఠం చైర్మన్ అంబేద్కర్ ‘రాజ్య వ్యవస్థ విధానాలు ఎలా ఉంటే మంచిది, సమాజాన్ని, ఆర్థిక వ్యవహారాలను మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తీర్చిదిద్దడానికి ఏమి చేయాలి, ప్రజలు తమంత తామే నిర్ణయించుకోవాల్సిన అంశాలు ఏమిటి’ అని మథనపడ్డారు. దీనిని నేరుగా రాజ్యాంగంలో పొందుపరిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని భావించారు. ప్రజల అభీష్టాన్ని మన్నించడం గురించి ఆయన నొక్కి చెప్పారు. దీనిని మెజారిటీ అభీష్టాన్ని బలపరచడంగా భావించరాదని కూడా అన్నారు. మైనారిటీల హక్కులను కాపాడడానికి రాజ్యాంగంలో ఎన్నో జాగ్రత్తలు పొందుపరిచారు. రాజ్యాంగానికి మూలస్తంభం దాని పీఠిక. అందులో న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వాలను ప్రజాస్వామ్యవ్యవస్థకు మూల స్తంభాలుగా పేర్కొన్నారు. ఇటీవల కేంద్రమంత్రి అనంత కుమార్ హెగ్డే కొంతకాలంగా రాజ్యాంగంపై సాగుతున్న వివాదాన్ని ఎగసనదోసే ప్రకటన చేశారు. కర్నాటకలో ఒక ప్రసంగం చేస్తూ, కేంద్రప్రభుత్వం రాజ్యాంగాన్ని మార్చడానికి సిద్ధంగా ఉందన్నారు. దాని సెక్యులర్ నైజాన్ని ఆయన వెక్కిరించారు. ముఖ్యంగా రాజ్యాంగం పీఠికలో ‘సెక్యులర్’ అనే పదం ఉండడాన్ని అయన ప్రస్తావించారు. రాజ్యాంగాన్ని ఆమోదించాక గత 67 ఏళ్లలో దాదాపు 100 సార్లు దానిని మార్చారని హెగ్డే పేర్కొన్నారు. 1976లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ సవరణ ద్వారా ‘సెక్యులర్’, ‘సోషలిస్ట్’ పదాలను రాజ్యాం గ పీఠికలో చేర్చారు. అనేక అధికరణలు, సెక్షన్లను కూడా ఆ సవరణ ద్వారా చేర్చారు. 42వ రాజ్యాంగ సవరణ లో భాగంగా భవిష్య సవరణలను సమీక్షించడంలో సుప్రీంకోర్టుకు గల అధికారాలను ఆ సవరణ కత్తిరించింది.

దేశాన్ని పూర్తిగా పార్లమెంట్ సార్వభౌమత్వంలోకి ఆ సవరణ తెచ్చింది. ఎమర్జెన్సీ రోజులలో నాటి ప్రధాని ఇందిరా గాంధీ నిరంకుశ విధానాలను విమర్శించడానికి 42వ రాజ్యాంగ సవరణను ‘భారత రాజ్యాంగంగా’ ప్రతిపక్షాలు ఎద్దేవా చేసేవి.1973లో మౌలిక రాజ్యాంగ వ్యవస్థ పత్రం’ అనేది సుప్రీంకోర్టు నిర్దేశించింది. దాని ద్వారా రాజ్యాంగం కల్పిస్తున్న కొన్ని ప్రాథమిక హక్కులను పార్లమెంట్ అధికారాల వెలుపల ఉంచింది. వాటిని సవరించే అధికారాలు పార్లమెంట్‌కు లేకుండా చేసింది. తరువాత 1980 నాటికి 42వ సవరణలోని అనేక భాగాలను కొట్టివేసి ‘మౌలిక రాజ్యాంగ వ్యవస్థ’ పత్రాన్ని సుప్రీంకోర్టు సంపూర్తిగా అమలులో పెట్టింది. ఎమర్జెన్సీ తరువాత జనతా పార్టీ అధికారాన్ని చేపట్టడం అంతకు ముందు జరిగిన పరిణామం. ఆ ప్రభుత్వం 43వ, 44వ సవరణలను రాజ్యాంగానికి తెచ్చింది. అవి కూడా 42వ సవరణలోని చాలా భాగాలను ప్రక్కనబెట్టడానికే. ప్రాథమిక హక్కులకు గల ప్రత్యేక స్థానం పునరుద్ధరింపబడింది. వాటిని పార్లమెంట్ సవరణ పరిధి నుంచి తప్పించారు. అయితే పీఠిక మాత్రం మార్చకుండా వదిలేశారు. రాజ్యాంగంలో ‘అంతర్గతంగా ఉన్న వాటిని బహిర్గతం చేసినట్లు’సుప్రీం కోర్టు అప్పుడు స్వయంగా వ్యాఖ్యానించింది. ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు, ప్రభుత్వ విధానాలు రాజ్యాంగానికి ‘సెక్యులర్’ రూపాన్ని కల్పిస్తున్నాయి. కేవలం సెక్యులర్ అనే పదాన్ని తొలగించి భారత రాజ్యాంగాన్ని ‘హిందూ’ లేదా ‘ముస్లిమ్’ నియమావళిగా మార్చడానికి లేదు. న్యాయవ్యవస్థ వ్యాఖ్యానాలకు విరుద్ధంగా ప్రాథమిక హక్కులను ఓ చట్టం ద్వారా మార్చడం కుదరదు. ఒక రాజకీయ పార్టీ ఇష్టానుసారం రాజ్యాంగానికి గల సెక్యులర్ స్వభావాన్ని మార్చజాలము.



మతపరమైన హక్కులతో ఎలా వ్యవహరించాలి అనే అంశంపై రాజ్యాంగ పీఠంలో కూలంకషంగా చర్చలు జరిగాయి. దేశవిభజన నేపథ్యంలో జరిగిన అల్లర్లలో వేలమంది మరణించిన ప్రభావంతో ఈ చర్చలు చోటు చేసుకొన్నాయి. అనేక ఇతర ప్రజాస్వామ్య దేశాలలోవలె కాకుండా భారత్‌లో మత ప్రచారాలను ప్రాథమిక హక్కుగా ఎంచుకొంది. అయితే లోతైన చర్చల తరువాతే అలా చేసింది. రాజ్యాంగ పీఠం సూచిస్తున్న ‘సెక్యులర్ రాజ్యం’ ఆలోచన వదులుగా ఉన్నదంటూ 1948 డిసెంబర్ 6న ఒడిశా ఎంపి లోక్‌నాథ్ మిశ్రా ఒక సవరణను ప్రతిపాదించారు. వేలాది సంవత్సరాల అణచివేతకు గురైన దేశ సంస్కృతీ విశ్వాసాలకు రాజ్యాంగం పెద్దపీట వేయాలని ఆయన కోరారు.

వ్యక్తులకు మత ప్రచార స్వేచ్ఛ ఇవ్వడం హిందూ మత నిర్మూలనకు దారి తీస్తుందని మిశ్రా వాదించారు. హిందూ భావజాలానికి తన వ్యతిరేకతను ఇస్లాం ఈ సరికే ప్రకటించిందని, క్రైస్తవమతం దొడ్డిదోవలో ప్రవేశించడానికి ప్రయత్నిస్తోందని ఆయన వివరించారు. మిశ్రా వాదనకు మెజారిటీ సభ్యుల మద్దతు లభించలేదు. ఆత్మప్రబోధం ప్రకారం వ్యవహరించే, వృత్తి నిర్వహించే, మతాన్ని ఆచరించి– ప్రచారం చేసే స్వేచ్ఛను రాజ్యాంగం తుదిపాఠంలో చేర్చారు. హెచ్‌వి కామత్ అనే మరో సభ్యుడు తన యూరోపియన్ అనుభవాన్ని రాజ్యాంగసభలో వివరించారు. చర్చికి ప్రభుత్వ పాలనతో సంబంధం ఉంటే ప్రభావం హానికరంగా ఉంటుందని ఆయన చెప్పారు. ఉదాహరణకు అశోక చక్రవర్తి తన పాలనను బౌద్ధమతంతో ముడిపెట్టడం హిందువులు, బౌద్ధులమధ్య శత్రుత్వాలకు దారితీసిందని ఆయన గుర్తు చేశారు.

ఆధ్యాత్మిక శిక్షణను రాజ్యాంగం అనుమతించాలని ఆయన సూచించారు. మతం అసలు అర్థం ‘ధర్మం’ అని చెప్పారు. మతాలలో నైతిక, ఆధ్యాత్మిక నియమావళిని ప్రభుత్వం తన ప్రజలకు ప్రబోధించాలని కూడా సూచించారు. అయితే ఈ సూచనకు కూడా రాజ్యాంగ పీఠం అనుమతి లభించలేదు. చివరకు అన్ని మతాలను సమానంగా గౌరవించే విధమైన సమగ్ర రూపంతో రాజ్యాంగం రూపుదిద్దుకుంది. రాజ్యవ్యవస్థకు మతపరమైన అంశాలతో అసలు పొత్తుకూడదని స్పష్టంగా అది పేర్కొంది. మతం స్థానంలో సెక్యులరిజానికి క్రమంగా దేశ ప్రజ లు బద్ధులయ్యేలా రాజ్యవ్యవస్థ ఆధిక్యతను రాజ్యాంగం నిర్దేశించింది. 1949 అక్టోబర్‌లో రాజ్యాంగ సభ చివరి రోజుల్లో పీఠికపై చర్చలు సాగాయి. కేవలం సెక్యులర్ దేశంగానే కాకుండా, సోషలిస్టు దేశంగా కూడా భారత్‌కు దిశానిర్దేశాన్ని రాజ్యాంగం చేసింది. సోషలిస్టు దేశం ప్రతిపాదనపై రాజ్యాంగసభ నిలువునా చీలిపోయింది. అంబేద్కర్ ‘సోషలిస్టు’ అనే పదాన్ని తీవ్రంగా వ్యతిరేకించగా, కెటి షా దేశాన్ని ‘సోషలిస్టు, ఫెడరల్ అండ్ సెక్యులర్’గా చేయాలని సూచించారు. తాజాగా మంత్రి హెగ్డే చెబుతున్నట్లు రాజ్యాంగ పీఠిక నుంచి ‘సెక్యులర్’ అనే పదాన్ని తొలగించినంత మాత్రాన అది సెక్యులర్ రాజ్యాంగం కాకుండా పోతుందా అనేది ప్రశ్న. రాజ్యాంగ స్ఫూర్తి ప్రదానం తప్ప ఒక పదం కాదు. మన రాజ్యాంగం సెక్యులర్ స్ఫూర్తితో ఏర్పడిందని చెప్పక తప్పదు. ఒక పదం తొలగించినంతనే దాని స్వరూపం చెదరదు.

* శృతిసాగర్ యమునన్

రజనీ ఆధ్యాత్మిక రాజకీయం?

రాజకీయాలలోకి వస్తున్నానని, వచ్చేఅసెంబ్లీ ఎన్నికలముందు కొత్త పార్టీ పెడతాననీ ప్రకటించిన సందర్భంలో రజనీకాంత్ ‘ఆధ్యాత్మికత, భగవద్గీత’ ఊసు ఎత్తడం భారతీయ జనతా పార్టీ (బిజెపి)తో జత కడతారనడానికి సంకేతమని కొందరు అంటున్నారు. చెన్నై కోడంబాక్కం ప్రాంతం మధ్యలో ఈ ప్రకటన ఆయన చేస్తున్నపుడు హాలు దద్దరిల్లిం ది. ఆయన ఎట్టకేలకు తన ఎన్నికల రాజకీయ రంగ ప్రవేశం గురించి అభిమానుల ఆనందాతిరేకాల మధ్య సస్పెన్స్‌కు తెర దించారు. తలైవర్ (నాయకుడు) అని అభిమానులు పిలుచుకొనే సూపర్ స్టార్ రజనీకాంత్ అలుపుతో నీర సించినవాడైనప్పటికీ తమిళ నాట ఒక శక్తి క్షేత్రం అనదగ్గవాడు. ఆయన వేదిక ఎక్కి ఉపన్యసిస్తుంటే ప్రేక్షకులు మంత్రముగ్ధులై వింటారు.

ఇటీవలి కీలక ప్రకటనలో ఆయన మీడియా పట్ల తనకుగల భయాన్ని వివరిస్తూ ప్రేక్షకులను నవ్వించారు. గత ఏడాదిగా రాష్ట్రంలో రాజకీయ మార్పు ఆవశ్యకత పెరిగిందని, తమళనాడు రాజకీయాలను చూసి ప్రజలు నవ్వుకొంటున్నారని అన్నారు. ప్రజాస్వామ్యం నవ్వులపాలు అవుతున్నదన్నారు. తాను అధికారాన్ని కోరుకొన్న వాడినే అయితే 1966 లోనే 45వ ఏట రాజకీయ రంగ ప్రవేశం చేసేవాడినని, 65 ఏళ్ల వరకూ ఎందుకు ఆగుతానని నవ్వుతూ అన్నారు. 2021లో జరిగే అసెంబ్లీ ఎన్నికలలో మొత్తం 234 స్థానాలకూ తన పార్టీ పోటీ చేస్తుందని కూడా ఆయన తెలిపారు. తన బృందంతో పార్టీ అజెండా, విధానాల గురించి చర్చిస్తానని చెప్పారు. ఇతర రాజకీయ వాదులపైన, నాయకులపైనా వ్యాఖ్యలు చేయకుండా ఉందామని అనుయాయులను ఉద్దేశించి అన్నారు.

తన ప్రసంగంలో ఆయన రెండు అంశాల గురించినొక్కి చెప్పారు. అవినీతిని సహించబోనన్నది మొదటిది.

ఇచ్చిన హామీలను తీర్చని పక్షంలో మూడేళ్లలో రాజీనామా ఇస్తామనడం గమనార్హమైనది. కమ్యూనిజం, కుల వాదం కాకుండా అధ్యాత్మిక వాదం తన మార్గమని రజనీ చెప్పడం రెండో కీలకాంశం. ఈ ప్రకటనే చర్చను రేకెత్తిస్తోంది. ఆయన రాజకీయ ధోరణి ఏమైఉంటుంది అన్నదే ఆ చర్చ. ద్రవిడ ఉద్యమాలతో సంబంధంలేని భవిష్య నాయకుడు రజనీ. అంతేకాకుండా రాజకీయాల్లో ఆధ్యాత్మికత, మతం గురించి మాట్లాడుతున్న తొలి తమిళ నాయకుడు కూడా. గత ఆరు దశాబ్దాలుగా తమిళనాడును ద్రవిడ పార్టీలు పాలించాయి. ద్రవిడ మున్నేట్ర కజగం (డిఎంకె), అఖిల భారత అన్నా ద్రవిడ మున్నేట్ర కజగం (ఎఐఎ డిఎంకె) పార్టీల సిద్ధాంతాలు నాస్తికవాదం, హేతువాదంతో ముడిపడినవి.

పరస్పర ఆకర్షణలో బిజెపి,రజనీ

ఆయన ఆధ్యాత్మికత వ్యాఖ్య బిజెపి, రజనీ ఒకరి కొకరు సైగలు చేసుకుంటున్నారనడానికి నిదర్శనమని రాజకీయ విశ్లేషకులలో ఒక అభిప్రాయం బలపడుతోంది. ‘ఆధ్యాత్మికత పదం, ఆరంభ వ్యాఖ్యల్లో భగవద్గీతను ప్రస్తావించడం ఆయన బిజెపితో జత కడుతున్నారనడానికి సంకేతమని రాజకీయ విశ్లేషకులు అలీ సెంథిల్ నాథన్ వ్యాఖ్యానించారు. రజనీ వల్లె వేసిన భగవద్గీత సూక్తి తుగ్లక్ పత్రిక ఎడిటర్, రాజకీయ వ్యాఖ్యాత చో రామస్వామి విరివిగా వాడుకున్నారు. బిజెపితో రజనీ స్పష్టంగా బయటపడని సంబంధాలు గలవారని ఈ వాస్తవాలు చాటుతున్నాయి. అయితే ఆ పార్టీతో అంటకాగడం చివరకు రజనీకి వినాశకర పరిణామాలను చవిచూపించేదే అవుతుంది. ఎందుకంటే బిజెపి మతపరమైన పార్టీగా పేరు మోసింది.

రజనీ భావజాలం ఏమిటో స్పష్టంగా ఇంకా తెలియడం లేదు. అందుచేత ఆయన ద్రవిడ సిద్ధాంతాలకు అనుకూలురా లేక వ్యతిరేకా అన్నది స్పష్టంగా ఇప్పట్లో విశ్లేషించలేమని మరికొందరు రాజకీయ పండితులు అంటున్నారు. రజనీకాంత్ బిజెపి పావు కావచ్చని ఎఐఎడిఎంకె అధికార ప్రతినిధి ఆవడి కుమార్ వ్యాఖ్యానించారు. రజనీ రాజకీయ ప్రవేశ ప్రకటన చేయగానే తమిళనాడు ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంత కర్త ఎస్ గురుమూర్తి హర్షం ప్రకటించడం బట్టి బిజెపి అనుకూలవాది అన్న అభిప్రాయం బలపడుతోంది. ‘60 ఏళ్లుగా స్తంభించిన ద్రవిడ రాజకీయాల్లో రజనీ రాజకీయ ప్రవేశం ప్రకంపాలు సృష్టిస్తుంది’ అని గురుమూర్తి వ్యాఖ్యానించారు. రజనీ ఆధ్యాత్మికత దేశంలోపలి, వెలుపల ఏ ఇతర నాయకుని కంటే మోడీకి సన్నిహితమైనది అని కూడా గురుమూర్తి ట్వీట్ చేశారు. కానీ తమిళనాడు ప్రజలు అడుగుతున్న మార్పుకు రజనీకాంత్ వాహకుడు అవుతాడా అన్నది అసలు ప్రశ్న.

తమిళ ఓటర్ల సైద్ధాంతిక భావ జాలానికి రజనీ కాంత్ దరిదాపుల్లో లేరని, ఆయనను ద్రవిడ వ్యతిరేక రాజకీయ వేత్తగానే చూడాలని సింథిల్ నాథన్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ద్రవిడ రాజకీయాల పురోగతిపట్ల మద్రాసు యూనివర్శిటీ ప్రొఫెసర్ రామూ మణివణ్ణన్ ఆశావహంగా ఉన్నారు. ప్రస్తుతం ద్రవిడ స్ఫూర్తి అంత బలంగా లేకున్నా పునరుజ్జీవం పొందుతాయని ఆయన ఘంటాపథంగా చెబుతున్నారు. డిఎంకె తిరిగి బలం పుంజుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదని, అది దాని చేతిలోనే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. అయితే దీనిని ద్రవిడ రాజకీయాల పతనంగా భావించరాదని అంటున్నారు. ద్రవిడ జనాభా అధికంగాగల చోట రజనీకాంత్ తనవి ద్రవిడ రాజకీయాలు కావని అనడాన్ని ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. అటువంటి పరిస్థితిలో ఆయన దేనికి ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు? సమీప భవిష్యత్తులో ఈ ప్రశ్నకు రజనీకాంత్ జవాబు ఇచ్చుకోవలసి ఉంటుందని మణివణ్ణన్ హెచ్చరించారు.

జయ మృతితో రాజకీయ సంక్షోభం

ఎఐఎడిఎంకె నేత జయలలిత మృతి తర్వాత తమిళనాడులో రాజకీయ శూన్యం ఏర్పడిన విషయం నిజమే. 2016లో జయలలిత డిఎంకెను ఓడించాక దాని నేత ఎంకె కరుణానిధి ప్రస్తుతం రాజకీయ సన్యాసంలో ఉన్నారు. ఆరోగ్యం ఆయనకు సహకరించడం లేదు. ఆ ఖాళీలోకి ప్రవేశం కోసం రజనీకాంత్ ప్రయత్నిస్తుండవచ్చు. ఆయన అభిమానులు ఆయన రాజకీయ రంగ ప్రవేశ ప్రకటనను అమితానందంతో స్వాగతిస్తున్నారు. తమిళనాడులో2013–14తో పోలిస్తే 2015 –16 మధ్య నిరుద్యోగం 0.5 శాతం పెరిగింది. కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ సర్వేలు జరిపి ఈ విషయం తేల్చింది. ఆ రాష్ట్ర ద్రవ్యలోటు కూడా తీవ్రం గా పెరిగి ఎన్నడూ లేనంత ఎక్కువగా అప్పుల్లో కూరుకుపోయింది. అందుకు ఏడాదిగా పాలనుంటుపడడమే కారణం.

తమిళనాడులో 1990 దశకంలో రజనీ కాంత్ మార్పులు తీసుకువచ్చే బలమైన శక్తిగా ఎదిగారు. అప్పట్లో ఆయన అభిమానుల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఫలితంగా 1996 ఎన్నికలలో ఆయన రాష్ట్ర రాజకీయాల్లో తన ప్రభావాన్ని మొదటిసారి చూపించారు. అప్పట్లో కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రచారం చేయడానికి ఆసక్తి చూపారు. అప్పటి ప్రధాని పివి నరసింహారావు అంతగా సానుకూలత వ్యక్తం చేయనందుకు ఆ ఆలోచనను ఆయన విరమించారు. ఎఐఎడిఎంకెతో పొత్తు పెట్టుకున్నందుకు కాంగ్రెస్ వైఖరిని తప్పుబడుతూ బయటకు వచ్చి తమిళమణిలా కాంగ్రెస్ ను డిఎంకెతో చేతులు కలపడం ద్వారా జికె మూపనార్ స్థాపించారు. ఆ విధంగా తమిళ కాంగ్రెస్‌ను ఆయన చీల్చారు. ఆ సందర్భంలోనే రజనీకాంత్ జయలలితపై తీవ్ర వ్యతిరేక వ్యాఖ్య చేశారు. జయలలితను తిరిగి అధికారంలోకి ఎన్నుకుంటే తమిళనాడుని ఆ దేముడు కూడా రక్షించలేడని ఆయన చేసిన వ్యాఖ్య సంచలనం సృష్టించింది. అది ఎఐఎడిఎంకె ఆ ఏడాది (1996) లో ఓడిపోడానికి కారణమయిందంటే అతిశయోక్తి లేదు.

1998లో, 2002లో ఆయన కొన్ని రాజకీయ ఎత్తులు అవలంబించి ప్రజలలో గుర్తింపు పొందారు. ముఖ్యంగా దేశంలో ప్రధాన నదుల అనుసంధానానికి ఆయన పిలుపునిచ్చారు. అందుకు 2002లో గంటసేపు నిరాహార దీక్ష జరిపారు కూడా. కర్నాటకతో కావేరి జలాల పంపిణీ వివాదంపై తమిళ పరిశ్రమ జరిపిన నిరసనలో పాల్గొనందుకు రజనీ విమర్శలపాలయ్యారు. అయితే ఆయన ప్రారంభించిన నదుల అనుసంధానం ప్రతిపాదన అనుయాయులు, అభిమానుల మద్దతుతో ఒక ఉద్యమంగా బలపడింది. అయితే అప్పట్లో రజనీ తన రాజకీయ నాయకత్వ ముద్రను అంతగా ప్రచారం చేసుకోలేదు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి నదుల అనుసంధానం పథకాన్ని ఎజెండాలో చేర్చుతున్నట్లు ప్రకటించగానే రజనీకాంత్ వాజపేయి ఎన్‌డిఎను బాహాటంగా బలపరిచారు. 2008లో కావేరీ జలాల విడుదలపట్ల కర్నాటక వైఖరిని నిరసిస్తూ జరిగిన ర్యాలీలో రజనీకాంత్ పాల్గొన్నారు. అయినప్పటికీ ఆయనను ద్రవిడ ఉద్యమ నేతగా కాకుండా తాము అభిమానించే హీరోగానే తమిళప్రజలు భావించారు. ఇప్పుడు కూడా ఆయన ప్రకటనల్లో రాజకీయ స్పష్టత లోపించి ఊహాగానాలకు తావిస్తున్నాయి.

* ప్రతిభా పరమేశ్వరన్,
దివ్య కార్తికేయన్

ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌ను ఏర్పాటు చేయాలి

ఎడిటర్‌కు లేఖలు

తెలంగాణలో దశాబ్దాలుగా ఎలాంటి గుర్తింపుకి నోచుకోక అభివృద్ధికి దూరంగా నెట్టివేయబడిన వెనుకబడిన సామాజిక కులాలు, అభివృద్ధి చెందని కులాల వారు ఇప్పటికీ ఆందోళనకరమైన జీవితాలను గడుపుతున్నారు. ఉమ్మడి రాష్ట్రం తెలంగాణ ప్రాంతంలో దళిత, గిరిజన కులాలను ఏనాడూ పట్టించుకున్న పాపాన పోలేదు. ఇవాళ ఈ కులాల జీవన ప్రమాణాల మెరుగుదల తెలంగాణ సమాజంపై పడింది. పధ్నాలుగేళ్లు అలుపెరగకుండా పోరాడి సాధించిన తెలంగాణ అభివృద్ధికి నేడు ముఖ్యమంత్రిగా కెసిఆర్ కృషి చేస్తున్నారు.

దళిత, గిరిజన వర్గాల ప్రజలు అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను తీసుకువచ్చారు. భూ పంపిణీ పథకం ద్వారా ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల భూమిని అందిస్తున్నారు. ఇది నిరంతర ప్రక్రియ. ఈ పథకం వల్ల ఎంతోమంది కళ్లల్లో ఆనందం చూస్తున్నాం. అదే విధంగా గత ప్రభుత్వ గిరిజన తండాలను ఓట్లప్పుడు తప్ప మళ్లీ తరువాత చూసేవారే కారు. ఇప్పుడు ముఖ్యమంత్రి కెసిఆర్ గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా చేయదలచడం యావత్తు గిరిజన ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఎస్‌సి, ఎస్‌టి ప్రజల అభివృద్ధి కోసం దేశంలో ఎక్కడాలేని విధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్ అవకాశం కల్పించిన ఘనత మన కెసిఆర్‌కే దక్కింది.

అదే విధంగా తెరాసలో కూడా రిజర్వేషన్లను అమలు చేసి ఎంతోమందికి పార్టీలో క్రియాశీలక పాత్రలను కట్టబెట్టిన మనసున్న మహరాజు మన కెసిఆర్. ఎస్‌సి, ఎస్‌టి ప్రజల అభివృద్ధికోసం మరొక అవకాశం ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ రూపంలో ఉంది. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి కమిషన్‌లనూ ఏర్పాటు చేసి, అందులో సభ్యులుగా తమ జాతుల కోసం ప్రతినిత్యం కృషి చేసే సామాజిక కార్యకర్తలను కూడా గుర్తించి అవకాశం కల్పిస్తే తెలంగాణ రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి ప్రజలు అభివృద్ధి చెందడం కోసం అనునిత్యం తపిస్తున్న కెసిఆర్‌గారి పాలనను దేశం గుర్తుంచుకుంటుంది. కృషి చేసే వారికి అవకాశం కల్పించాలి. ఎస్‌సి,ఎస్‌టి కమిషన్ స్పష్టత గురించి కేంద్రంపై ఒత్తిడి పెంచాలి.

– గుండమల్ల సతీష్‌కుమార్, సంస్థాన్ నారాయణపురం.

సింగరేణి కబ్జాలపై చర్యలు తీసుకోవాలి

సింగరేణి కార్మికులకు సంస్థలో వారసత్వ ఉద్యోగాలు కెసిఆర్ గారు చెప్పినట్లుగా ఇవ్వాలి. 1920 డిసెంబర్ 23న సింగరేణి కాలరీస్ సంస్థగా ఏర్పడింది. దీనికి పూర్వం డక్కన్ కంపెనీగా పిలవబడే ఈ సంస్థలో 17 ఓపెన్‌కాస్టులు 46 భూగర్భ గనులతో సంస్థ వెలిగిపోతున్నది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో గల పారిశ్రామిక నగరంలో లభించే బొగ్గు ద్వారా వేలకోట్ల ఆదాయం సంపాదించి నేడు జిఎం కార్యాలయంను గోలేటికి తరలించి బెల్లంపల్లిని ఎడారిగా మార్చింది. బెల్లంపల్లిలో సింగరేణి స్థలాలను కార్మికేతరులు ఆక్రమిస్తే చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోంది కాని చర్య తీసుకోవడం లేదు. 57 ఏళ్ల క్రితం సంస్థ నెలకొల్పిన సింగరేణి వ్యాపార సదుపాయాలు పరాధీనం అయితే సంస్థ చోద్యం చూస్తున్నది. బెల్లంపల్లిలో సింగరేణి సంస్థకు చెందిన స్థలాలు అన్నీ ప్రభుత్వానికి సరెండర్ చెయ్యాలి. బెల్లంపల్లిలో గల 34 వార్డుల్లో నివసించే గృహ యజమానులకు పట్టాలు ఇచ్చేలా కలెక్టర్ ఆర్‌వి. కర్ణన్ గారికి ఆర్డర్స్ పంపాలి.

బెల్లంపల్లిలో 27కోట్లతో నిర్మించిన మెడికల్ కళాశాల భవనంను సింగరేణి సంస్థ ప్రభుత్వ వైద్యకళాశాలగా మార్చి ఆస్పత్రిని పాత జిఎం కార్యాలయానికి తరలింప చేయాలి. సింగరేణి సంస్థకు చెందిన ఆస్తులను, స్థలాలను కబ్జా చేసిన వారిపై 420 కేసు నమోదు చేసి చెరసాలకు పంపాలి.

– కోలిపాక శ్రీనివాస్, బెల్లంపల్లి

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సిసి కెమెరాలు ఉత్తమాటేనా?

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో అభద్రతాభావం తాండవిస్తున్నది. గత రెండు సంవత్సరాల క్రితం వరంగల్ రూరల్ జిల్లాలోని మూడు చెక్కలపల్లి ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు లంబాడా బాలికల ఘోర హత్యలు సభ్యసమాజాన్ని తీరని కలవరపాటుకు గురిచేశాయి. హంతకుల్ని ఇప్పటికి గుర్తించి శిక్షించకపోవడం బాధాకరం. బడుగు, బలహీన జనులపట్ల వివక్షను తేటతెల్లం చేస్తున్నది. అప్పుడు ప్రతి గిరిజన ఆశ్రమ పాఠశాలలో సిసి కెమెరాల ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రెండు సంవత్సరాలు గడిచింది. నేటికీ అతీగతీ లేదు. నేతలు, పాలకులు ప్రజల్ని మోసగించటం పరిపాటిగా మారింది. గిరిజన ఆశ్రమ పాఠశాలలతోపాటు మిగతా విద్యార్థుల సంక్షేమ వసతి గృహాల్లో కనీస మౌళిక వసతులు కొరవడిన దుస్థితి నెలకొంటున్నది. చాలామంది వసతి గృహాల పాలనాధికారులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతూ బడుగు, బలహీన విద్యార్థుల నోటికాడి బొక్కల్ని సైతం కాజేస్తూ లక్షలాదిరూపాయల అక్రమార్జన పరులవుతున్నారు.

రాష్ట్రప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలల పట్లనే అత్యంత శ్రద్ధ చూపుతూ గతంలో ఏర్పాటైన ఆశ్రమ, వసతి గృహాలలో మౌలిక వసతులపట్ల నిర్లక్ష్యం వహించడం క్షమించరాని నేరమే. నేటికి కూడా కొన్ని సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు స్నానపుగదులు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలతోపాటు చలికాలంలో కప్పుకునే చద్దర్లు లేవు.

–నల్లెల్ల రాజయ్య, వరంగల్

మన తెలంగాణ
5
హైదరాబాద్
మంగళవారం
2 జనవరి, 2018
www.manatelangana.news



హైదరాబాద్ అంటే ఇప్పటివరకు సాఫ్ట్‌వేర్‌కు కేరాఫ్ అడ్రస్.. ఇప్పుడు రోబో పోలీస్ ప్రవేశంతో హార్డ్‌వేర్‌కు మారింది. నగరంలో ప్రతిరోజు లక్షలమంది ప్రయాణిస్తుంటారు. కిలోమీటర్ల మేర రోడ్లపై ట్రాఫిక్ నిలిచిపోతుంటుంది. ట్రాఫిక్ సమస్య నుంచి గట్టెక్కించడానికి రోబోలను డ్యూటీలకు దించుతున్నారు నగర పోలీసులు. టీహబ్‌లో స్టార్టప్ కంపెనీగా ప్రారంభమైన హెచ్‌బోట్స్ రోబోటిక్స్ కంపెనీ సెక్యూరిటీ రోబోను రూపొందించింది. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారవడం స్మార్ట్ రోబో ప్రత్యేకత.

దేశీయ సాంకేతికతతో

స్మార్ట్ రోబో కాప్


రోబో రూపకర్త కిషన్



ఇంజినీరింగ్ పూర్తి చేసిన కిషన్ , సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన హర్ష, అభిషేక్‌లు, ఐటీ ఇంజినీరింగ్ పూర్తి చేసిన అన్వేష్‌లు రెండువేల క్రితం గచ్చిబౌలి టీహబ్‌లో హెచ్‌బోటిక్స్ స్టార్టప్‌ను స్థాపించారు. రోబోటిక్స్‌పై ఆసక్తి ఉన్న కిషన్ వేలూరులోని విఐటిలో రెండేళ్లపాటు ప్రత్యేక శిక్షణ తీసుకున్నాడు. కాలిఫోర్నియా యూనివర్సిటీలో రోబోటిక్ తయారీపై నాలుగు నెలల శిక్షణ పొందాడు.

రోబో ప్రత్యేకతలు: మొట్టమొదటిసారిగా దేశీయ సాంకేతికతను ఉపయోగించి తయారుచేసిన రోబో పోలీస్ 4 కి.గ్రా బరువు, ఐదు అడుగుల ఏడు అంగుళాల పొడవుంది.



ఆరునెలల్లో 16 మంది సభ్యులు కష్టపడి స్మార్ట్ రోబోను తయారుచేశారు. ఈ రోబోను కేవలం మూడు లక్షల ధరతో అందుబాటులోకి తేవడం మరో ప్రత్యేకత. హెచ్‌బోట్స్ రోబోటెక్స్ ల్యాబ్‌లో ప్రతిఏటా పది రోబోలను తయారుచేసే అవకాశం ఉంది. రోబో పనితీరును ఆరునెలల పాటు పరిశీలించనున్నారు పోలీసులు. అత్యంత రద్దీ ప్రాంతమైన జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్‌లో ఈ చిట్టి రోబో పోలీస్ విధులను నిర్వహిస్తోంది. కేవలం విధులు మాత్రమే కాకుండా ఫిర్యాదులను స్వీకరించడం దీని స్పెషల్.

కేవలం ట్రాఫిక్ విధులను కాకుండా అపార్ట్‌మెంట్ల భద్రతకు ఉపయోగపడేలా కూడా రోబోలను తీర్చిదిద్దారు. ఇవేకాకుండా అన్ని విధాలుగా సెక్యూరిటీ కోణంలో ఉపయోగపడేలా రోబోలన సిద్ధం చేస్తున్నామని సంస్థ సిఈవో కిషన్ తెలిపారు. ఇప్పటికే పొరుగు రాష్ట్రాల నుంచి, ఇతర దేశాల నుంచి ఈ రోబోల కోసం మమ్మల్ని సంప్రదిస్తున్నారని అన్నారు. దీని కోసం ఆరు నెలలతోపాటు 45 లక్షల వ్యయం అయింది. ప్రస్తుతం దుబాయ్‌లో మాత్రమే పోలీస్ రోబో ఉంది. మెకానికల్ 360 డిగ్రీల కంటి స్థాయి పర్యవేక్షణ చేయగల సామర్థ్యాన్ని కలిగి ఉంది. మామూలు ప్లాస్టిక్ కంటే పదిరెట్లు బలాన్ని కలిగున్న నైలాన్ ప్లాస్టిక్‌తో తయారైంది. మల్టీటచ్ స్క్రీన్ కలిగి ఉంది. గొంతును గుర్తుపట్టి ఇంగ్లీషులో సమాధానమిస్తుంది. త్వరలో తెలుగు హిందీలను మాట్లాడగలుగుతుందని హెచ్ బాట్స్ సిఇఓ కిషన్ తెలిపారు. త్వరలో దీని సేవలు మాల్స్, రైల్వేస్టేషన్, ఎయిర్‌పోర్ట్‌లాంటి చోట్ల విస్తరించనున్నారు. ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించడం, బాంబులను, అనుమానితులను గుర్తించడం, వ్యక్తులతో సంభాషించడం, వారి ప్రశ్నలకు సమాధానం ఇవ్వగల సామర్థ్యం కలిగి ఉంది. ముంబయిలోని 26/11 దాడుల్లో తీవ్రవాదులతో పోరాడిన హేమంత్ కర్కరే పేరును ఈ రోబోకు పెట్టారు. ఈ రోబో వ్యవస్థాపకుడు పిఎస్‌వి కిషన్ నేతృత్వంలోని 16 మంది ఇంజినీర్లు , సాఫ్ట్‌వేర్ డెవలపర్ల బృందం రోబోను తయారుచేశారు. రియల్‌ఎస్టేట్, హాస్పిటాలిటీ, హెల్త్‌కేర్ లాంటి ఇతర రంగాల్లో రోబోలను వినియోగించేలా త్వరలో అందుబాటులోకి తెస్తామంటున్నారు.

రోబో రూపకర్త కిషన్ మాట్లాడుతూ " నేను సింగపూర్ వెళ్లినప్పుడు మనం కూడా పోలీస్ రోబోను ఆవిష్కరించాలనే ఆలోచన వచ్చింది. అదికూడా ఇండియాలోనే చేయాలనుకున్నాం. గత ఆరునెలల నుంచి రోబోను తయారుచేస్తున్నాం. మా టీం మొత్తం దాదాపు 20 మంది వరకున్నాం. తెలంగాణ ప్రభుత్వం స్టార్టప్‌లకు చాలా ప్రోత్సాహం ఇస్తుంది. పోలీస్ రోబోకి వీడియో ఆడియో ఫిర్యాదులను ఇవ్వొచ్చు. షీటీమ్స్‌కు కూడా కనెక్ట్ చేశాం. ఈ ఫిర్యాదులన్నీ కంట్రోల్ రూంకి అందిస్తాయివి. స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసినందుకు మాకెన్నో ప్రశంసలొచ్చా"యన్నారు.

వల్కన్ ఎస్

ఇప్పుడు ఉన్న రోజులల్లో యువత ఎక్కువగా ద్విచక్ర వాహనలకు అధిక ప్రాధ్యనత ఇస్తున్నారు. అందులో పలు కంపెనీలు రోజుకో కొత్త వాహనాలను తయారు చేస్తున్నారు. ప్రముఖ కవాసాకీ మోటార్ సైకిల్ కంపెనీ నుంచి మార్కెట్ లోకి కొత్త బైక్ విడుదలైంది. ఇది మన దేశంలోకి 'వల్కన్ ఎస్' అనే పేరుతో వచ్చింది. క్రూజర్‌కు భారీ డిమాండ్ ఉండ డంతో బుకింగ్స్ కూడా పెద్దసంఖ్యలోనే ప్రారంభమయ్యాయి. దీని ఎన్స్ షోరూం ధర రూ. 5.44 లక్షలు. ఈ బైక్ ఫిబ్రవరి 9 నుంచి 14వరకు ఢిల్లీలో జరిగే ఆటో ఎక్స్ ఫోలో ప్రధానలో ఆకర్షణగా నిలువ నుంది.

బైక్ ఫీచర్లు: 650 సీసీ ఇంజన్ లిక్విడ్ కూల్డ్, సిక్స్ స్పీడ్ గేర్ బాక్స్, 300 మీమి డిస్క్ ఉన్నాయి. మిబ్‌లో రేంజ్ క్రూజర్‌లకు ఈ తరహా ఇంజన్‌లని వాడు తుంటారు. ఈ బైక్ చూడటానికి స్పోట్స్ బైక్‌లా చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. ఎర్గో ఫిట్ అనే ప్రత్యేకమైన ఫీచర్ కూడా దీని ప్రత్యేకత. దీని సాయంతో హ్యాండిల్, ఫుట్ పెగ్స్, సీటును రైడర్‌కు అనుగుణంగా మార్చుకోవచ్చు. మహిళలు కూడా ఈ బైక్‌ను సులభంగా నడపవచ్చు.



చేతులు లేకపోతేనేం..



ఈమె పేరు మాళవిక..తమిళనాడులోని కుంభకోణం ప్రాంతానికి చెందినది .ఆమె తండ్రి వాటర్ వర్క్స్ డిపార్టుమెంటులో ఇంజనీర్‌గా పనిచేసారు. తను 13 ఏళ్ల వయస్సులో ఉన్నప్పుడు బ్లాస్ట్‌లో రెండు చేతులూ కోల్పోయింది. అయినా అధైర్యపడకుండా పిహెచ్‌డి సాధించింది. 2002 మే 26 న మాళవిక బికనేర్లోని తన ఇంటి దగ్గర ఆడుకుంటుండగా బాంబ్ బ్లాస్ట్‌లో రెండు చేతులు కోల్పోయింది. ఆ తర్వాత దాదాపు యేడాదిన్నర పాటు ఆసుపత్రికి పరిమితమయ్యింది. ఆసుపత్రినుంచి ఇంటికి తిరిగి వచ్చినాక తన చేతులు లేవని ఏనాడు బాధపడలేదు. జరిగిన ప్రమాదం జరిగిపోయింది, దాన్నే తలుచుకుంటూ కూర్చుంటే జీవితం ముందుకు సాగదు అని ఆలోచించింది. వెంటనే ఓ లక్ష్యాన్ని ఏర్పరుచకుంది, మధ్యలో ఆగిపోయిన చదువును ఎలాగైనా కొనసాగించాలనుకుంది. రెండు చేతులూ లేకపోయినా కంప్యూటర్లో ఎంతో కష్టపడి టైప్ చేయడం నేర్చుకుంది. చివరకు 15 సంవత్సరాల తర్వాత తను అనుకున్నది సాధించింది. తను అనుకున్నట్లుగా పీహెచ్‌డి ని పూర్తిచేసింది. అంతేకాదు ప్రమాదాల్లో గాయపడి.. చేతులూ కాళ్లు కోల్పోయిన వారికి తన జీవితాన్ని గురించి చెప్పి వాళ్లల్లో కొండంత ధైర్యాన్ని నింపుతుంది. నిజంగా మాళవిక చాలా గ్రేట్ అంటూ పలువురు ప్రముఖులు ఆమెను అభినందిస్తున్నారు. మాళవిక పలు విదేశాలల్లో కూడా పలు కార్యక్రమల్లో హాజరైంది. అనేక అవార్డులు అందుకుంది. మరి కొందరు మాళవిక జీవితం ఎందరికో ఆదర్శం కావాలంటూ ప్రశంసిస్తున్నారు.



ఫ్లెక్సిబుల్ స్మార్ట్‌ఫోన్

ఫోన్ టచ్ స్క్రీన్లు పగిలిపోతూ తరచూ మన జేబులు ఖాళీ చేస్తుంటాయి. ఇకపై అలాంటి బాధలు ఉండవు. ఎంత ఘోరంగా వాడినా, భళ్లున కిందపడిపోయినా పగిలిపోని టచ్ స్క్రీన్లను సిద్ధం చేశారు. ఫ్లెక్సిబుల్ స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌గా పిలిచే వీటిని ఇంగ్లండ్‌లోని ప్రముఖ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు రూపొందించారు. ప్రస్తుత టచ్‌స్క్రీన్ల తయారీలో వాడుతున్న ఇండియమ్ టిన్ ఆక్సైడ్ పెళుసుగా ఉంటుంది. పైగా దీని ధర కూడా ఎక్కువ. దీంతో సిల్వర్, గ్రాఫీన్, ఇతర పదార్థాలను కలిపి పగలిపోని స్క్రీన్లను తయారు చేశామని శాస్త్రవేత్తలు తెలిపారు. సిల్వర్ ధర కూడా ఎక్కువే అయినా, నానోవైర్లను గ్రాఫీన్‌కు జతచేసి వీటిని రూపొందించామన్నారు. ఇవి తక్కువ విద్యుత్ వాడుకుంటాయని, ధర కూడా తక్కువే అని వారు చెప్పారు.

ఒక్క ల్యాప్‌టాప్‌కి ఏడు లక్షలా?



అవును మీరు విన్నది నిజమే. దీని ధర కేవలం రూపాయి తక్కువ ఏడు లక్షలే. మీరు ల్యాప్ టాప్ కొనాలనుకుంటున్నారా? అయితే దీనివైపు ఓ లుక్కేయండి. ధర ఎంతని అనుకుంటున్నారా? ఎంతంటే కేవలం రూ. 6,99,999. అబ్బో ల్యాప్‌టాప్ కు ఏడు లక్షలా? అని అవాక్కవుతున్నారు కదా? ఇందులో ఉన్న ప్రత్యేకతలు అలాంటివి మరి. ప్రముఖ ఎలక్ట్రానిక్ సంస్థ యేసర్ 'ప్రిడేటర్ 21 ఎక్స్' పేరుపై కొత్త గేమింగ్ ల్యాప్‌టాప్‌ను విడుదల చేసింది. ఫిప్ కార్ట్, యేసర్ స్టోర్లలో ఈ ల్యాప్‌టాప్‌లు డిసెంబర్ 18 నుంచి అందుబాటులోకి వచ్చాయి. ఐ ట్రాకింగ్ టెక్నాలజీ, వంపులు తిరిగిన స్క్రీన్‌తో వస్తున్న తొలి నోట్‌బుక్ అని "యేసర్" సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. అంతేకాదు ప్రపంచ వ్యాప్తంగా కేవలం 500 ల్యాప్ టాప్ లను మాత్రం అమ్ముతున్నట్లు యేసర్ స్పష్టం చేసింది.

దీని ప్రత్యేకతలు: 21 అంగుళాల ఐపీఎస్ డిస్‌ప్లే, 2560స 1080 రిజల్యూషన్, జీటీఎక్స్ 1080 గ్రాఫిక్ కార్డ్, 7వ తరం ఇంటెల్ కోర్ ఐ7 ప్రాసెసర్, 64జీబీ డీడీఆర్ 4 ర్యామ్, 512 జీబీ గల నాలుగు డ్రైవ్‌లు, 8.5 కిలోగ్రాముల బరువు.

మన తెలంగాణ
6
హైదరాబాద్
మంగళవారం
2, జనవరి 2018
www.manatelangana.news

ఆస్పత్రులకు వెంటనే బకాయిలను చెల్లించండి

మన తెలంగాణ/హైదరాబాద్: ఆరోగ్యశ్రీ, ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ సేవలను అందిస్తున్న ప్రైవేటు ఆస్పత్రులకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని బిజెఎల్పి నేత జి.కిషన్‌రెడ్డి ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన సిఎం కెసిఆర్‌కు లేఖ రాశారు. ఆరోగ్యశ్రీ బకాయిలను చెల్లించకపోవడంతో మూత్రపిండాలు చెడిపోయిన రోగులకు ప్రైవేటు ఆస్పత్రులు దయాలసిస్ వైద్యసేవలను అందించేందుకు నిరాకరిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వ బకాయిలను చెల్లించక పోవడంతో ప్రైవేటు ఆస్పత్రులు వైద్యన్ని అందించడం లేదని, ఫలితంగా ప్రజలు నరకయాతన అనుభవి స్తున్నారని పేర్కొన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు వైద్యం అందించే లక్ష్యంతో ప్రారంభించిన ఆరోగ్య శ్రీ పథకం రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో నీరుగారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య శ్రీ పథకం కింద ప్రైవేటు ఆస్పత్రులకు రూ.600కోట్లు, ఇహెచ్‌ఎస్ పథకం కింద రూ.250 కోట్లకు పైగా బకాయిలు ఉన్నాయని వివరించారు. ఈ నెల 22లోపు ప్రభుత్వం బకాయిలను చెల్లించకపోతే ఆరోగ్య శ్రీ సేవలను పూర్తిగా నిలిపివేయాలని ప్రైవేటు ఆస్పత్రులు నిర్ణయించినట్లు తెలుస్తుందని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.



నేడు బయలుదేరనున్న 'యశ్వంత్‌పూర్'

మన తెలంగాణ/హైదరాబాద్ : అనివార్య కారణాల రీత్యా సోమవారం బయలుదేరాల్సిన యశ్వంత్‌పూర్, గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ మంగళవారం బయలుదేరనుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య పౌర సంబంధాల అధికారి ఎం.ఉమాశంకర్ కుమార్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యశ్వంత్‌పూర్, గోరఖ్‌పూర్ (వయా సికింద్రాబాద్) ఎక్స్‌ప్రెస్ సోమవారం సాయంత్రం 5.20 గంటలకు యశ్వంత్‌పూర్ నుంచి బయలుదేరాల్సి ఉండగా ఆ రైలు మంగళవారం (జనవరి 2వ తేదీ) ఉదయం 5 గంటలకు బయలుదేరనున్నది. మంగళవారం ఉదయం బయలుదేరాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం బయలుదేరనుంది. హైదరాబాద్, న్యూఢిల్లీ మధ్య తిరిగే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ హైదరాబాద్ నుంచి ప్రతి రోజు ఉదయం 6.25 గంటలకు బయలుదేరుతుంది. న్యూఢిల్లీ నుంచి హైదరాబాద్ రావాల్సిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ ఆలస్యం కావడంతో మంగళవారం హైదరాబాద్ నుంచి బయలుదేరాల్సిన రైలు మధ్యాహ్నం 1.55 గంటలకు బయలుదేరనుంది.

నేడు ఢిల్లీకి ఇంద్రకరణ్‌రెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్: గృహ నిర్మాణ, న్యాయ, దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి నేడు ఢిల్లికి వెళ్లనున్నారు. మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని రాష్ట్ర ఎంపిలతో కలిసి ఆయన కేంద్రాన్ని కోరనున్నారు. రాష్ట్ర పార్లమెంటు సభ్యులతో కలిసి ఆయన ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి జునల్ ఓరమ్‌ను కలువనున్నారు. గిరిజన కుంభమేళాగా పిలిచే మేడారం జాతరను జాతీయ పండగగా చేయాలని గుర్తించాలని కేంద్రాన్ని కోరుతామని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అసెంబ్లీలో ఇదివరకే తీర్మానం కూడా చేశామన్నారు. ఆసియా ఖండంలోనే అతి పెద్ద గిరిజన జాతరైన మేడారం సమ్మక్క, సారాలమ్మల జాతరకు జార్ఖండ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహాఆష్ట్రల నుంచి లక్షల సంఖ్యలో హాజరవుతారన్నారు.

ఆరోగ్య తెలంగాణకై అహర్నిశలు శ్రమిస్తా

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆరోగ్య తెలంగాణ సాధనకు అహర్నిశలు శ్రమిస్తానని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుతో తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ముఖ్యమంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలుసుకున్న మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిఎం ఆశీస్సులు తీసుకున్నారు. ఈ ఏడాది శుభప్రదంగా, విజయోత్సవంగా కొనసాగాలని సిఎం ఆకాంక్షించారు.

జ్యోతిష్యశాస్త్రంపై కోర్సులు

మన తెలంగాణ/హైదరాబాద్ : జ్యోతిష్య శాస్త్రంపై కోర్సులను నిర్వహిస్తున్న ట్లు భారతీయ విద్యా భవన్ (హైదరాబాద్ కేంద్ర) తెలిపింది. ఒక సంవత్సరం కాలవ్యవధి కలిగిన జ్యోతిష్య ప్రవీణ, జ్యోతిష్య విశారద కోర్సులను ఆంగ్లమాధ్యమంలో అందిస్తున్నట్లు భవన్ అదనపు రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. తరగతులు కింగ్‌కోఠి రోడ్‌లోని కళాశాల ప్రాంగణంలో జనవరి 7వ తేదీ అంటే ఆదివారం నుంచి నిర్వహిస్తున్నారు. జ్యోతిష్య ప్రవీణ కోర్సులో చేరేందుకు పదవ తరగతి ఉత్తీర్ణత, జ్యోతిష్య విశారదలో చేరేందుకు జ్యోతిష్య ప్రవీణ కోర్సును పూర్తి చేసి ఉండాలన్నారు. ధరఖాస్తులు, మరిన్ని వివరాలకు భవన్స్ కార్యాలయంలో లేదా అదనపు రిజిస్ట్రార్‌ను ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చు.

నిరుద్యోగ భృతి ఇస్తాం

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. వరికి మద్దతు ధర రూ,2వేలు, పత్తి, మిర్చికి సరైన మద్దతు ధర కల్పిస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. పజలే నాకుటుంబ సభ్యులని ఉత్తమ్ అన్నారు. కోదాడ ఎంఎల్ఏ ఉత్తమ్ పద్మావతి మాట్లాడుతూ హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల ప్రజలను తమకుటుంబ సభ్యులుగా భావిస్తున్నామని, తమను ఆదరించి రాష్ట్రంలో కాంగ్రేస్ ప్రభుత్వం వచ్చేందుకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు.

అలరించిన దూందాం కార్యక్రమం : ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా ఏసూరి సోమన్న బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దూందాం కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. టిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ పాటిన జానపద గీతాలు అలరించాయి. హుజూర్‌నగర్,కోదాడ రెండు నియోజకవర్గాల పరిధిలోని వేలాదిమంది కాంగ్రేస్ కార్యకర్తలు, నాయకులు సానుబూతిపరులు కుటుంబ సమేతంగా ఆత్మీయసమ్మేళనంలో సాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధానకార్యదర్శి యరగాని నాగన్నగౌడ్, తన్నీరు మల్లిఖార్జున్, చిట్యాల అమర్ నాద్‌రెడ్డి, అరుణ్‌ఖుమార్ దేశ్‌ముఖ్, యండీ నిజామొద్దీన్, యంపిపిలు, జడ్పీటీసీలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహిళా హాస్టల్‌పై దాడి

(మొదటిపేజీ తరువాయి)

మహిళా హాస్టల్‌పై రాళ్ల దాడి చేశారు. దాడిలో హాస్టల్ కిటకీల అద్దాలు పూర్తిగా ధ్వంసంగాక, హాస్టల్‌లో ఉంటున్న యువతులు ఆందోళనకు గురయ్యారు. పోలీసులు సకాలంలో స్పందించిన దాడి చేసిన జోసఫ్‌రెడ్డి, గోవింద్, బ్రహ్మరెడ్డి, భాస్కర్‌లను అరెస్ట్ చేశారు. మణిదిప్, బాబాలు పరారీలో ఉన్నారు. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రజనీ రాజకీయ ప్రవేశాన్ని అడ్డుకుంటాం

చెన్నై : తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ రాజకీయ ప్రవేశాన్ని నామ్ తంజియార్ పార్టీ అధినేత సీమన్ సోమావారం తీవ్రంగా వ్యతిరేకించారు. తమిళనాడులో పుట్టిన వారే తమిళనాడును పాలించడానికి అర్హులని ఆయన అన్నారు. రజనీకాంత్ మరో 10 సినిమాలు చేసినా తమకు అభ్యంతరం లేదని, ఇక్కడ రాజకీయాలు చేస్తేనే అభ్యంతరమని ఆయన స్పష్టం చేశారు. రజనీకాంత్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టి మమ్మల్ని పాలిస్తే మేం సహించమని సీమన్ మండిపడ్డారు.



రాజ్‌భవన్‌లో 'ప్రజాబింబం' తెలుగు మాస పత్రికను గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా బింబం మాస పత్రిక చీఫ్ ఎడిటర్ కాచం సత్యనారాయణగుప్త తదితరులు పాల్గొన్నారు.

మెట్రో స్పీడ్ తక్కువే..!

- **బెడిసి కొట్టిన ఒప్పందం....**
- **80 కి.మీ వేగం ఇప్పట్లో లేనట్టే**



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : ప్రతిష్టాత్మకంగా నిర్మించిన హైదరాబాద్ మెట్రోరైలు స్పీడు తక్కువగా ఉండటం నగర వాసులకు నిరాశకు గురిచేస్తోంది. ప్రపంచంలోనే ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించామని చెప్పుకుంటున్న మెట్రోరైలు తక్కువ వేగంతోనే ప్రయాణించనుంది. సాధారణ వేగం 33 కి.మీ నుంచి 80 కి.మీ వేగంతో మెట్రోరైలు నడిపిస్తామని ప్రభుత్వంతో ఎల్ అండ్ టి ఒప్పందం కుదుర్చుకుంది. ప్రస్తుతం 70 కి.మీలకే వేగానికి పడిపోయింది. సిగ్నలింగ్ వ్యవస్థ ఏర్పాటు ఒప్పందంలో చోటు చేసుకున్న తప్పిదాలతో ఈ పొరపాటు చోటు చేసుకున్నట్లు తెలిసింది. ప్యారిస్‌కు చెందిన థ్యాంక్స్ పోర్చుగల్ కంపెనీతో ఎల్ అండ్ టి సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు ఒప్పందాన్ని కుదుర్చుకుంది. 80 కి.మీ వేగానికి అనుగుణంగా సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. థ్యాంక్స్ పోర్చుగల్ కంపెనీతో ఎల్ అండ్ టి 70 కి.మీ వేగానికి సంబంధించి ఒప్పందం కుదుర్చుకుంది. ఒప్పందంలో భాగంగా థ్యాంక్స్ పోర్చుగల్ కంపెనీ 70 కి.మీ వేగానికి అనుగుణంగా సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసింది. అందుకు అనుగుణంగా సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తోంది. 80 కి.మీ వేగానికి అనుగుణంగా సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిందిపోయి కేవలం 70 కి.మీ ఎందుకు చేస్తున్నారని ఎల్ అండ్ టి ప్రశ్నించింది. సిగ్నలింగ్ వ్యవస్థకు సంబంధించిన ఒప్పంద పత్రాలను థ్యాంక్స్ పోర్చుగల్ ముందు పెట్టడంతో ఎల్ అండ్ టి విస్తుపోయింది. 80 కి.మీ వేగానికి అనుగుణంగా సిగ్నలింగ్ వ్యవస్థను మార్చాలని ఎల్ అండ్ టి కోరింది. 80 కి.మీ వేగానికి అనుగుణంగా సిగ్నలింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలంటే సాఫ్ట్‌వేర్‌ను మార్చడంతో పాటు ఇతర సాంకేతిక పరమైన మార్పులు చేయాల్సి ఉంటుంది. అందుకు అదనపు వ్యయం అవుతుందని థ్యాంక్స్ పోర్చుగల్ కంపెనీ స్పష్టం చేసింది. అందుకు సుమారు రూ.100 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు వ్యయం అవుతుందని విశ్వసనీయంగా తెలిసింది. దీంతో ఎల్ అండ్ టి 70 కి.మీ వేగానికే పరిమితం చేసింది. ప్రస్తుతం సిగ్నలింగ్ వ్యవస్థ లేకపోవడంతో లోకో పైలెట్లు రైళ్లను నడిపిస్తున్నారు. సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే నిర్దేశించిన 70 కి.మీలోపే నడపాల్సి ఉంటుంది. ఒక్క కి.మీ వేగం పెరిగినా రైలు ఆగిపోతోంది. దీంతో మెట్రోరైలు 10 కి.మీ వేగం తగ్గిపోయింది.

ప్రయాణికులకు మెట్రో షాక్ !

హైదరాబాద్ ప్రయాణికులకు మెట్రోరైల్ షాక్ ఇస్తోంది. నిర్ణీత సమయంలోగా మెట్రోరైళ్లు గమ్యస్థానాలకు చేరడం లేదని ప్రయాణికులు మండిపడుతున్నారు. నిమిషాల్లో ముగియాల్సిన ప్రయాణానికి కూడా రెట్టింపు సమయం పడుతోంది. ప్రస్తుతం 30 నుంచి 33 కి.మీ వేగంతో మాత్రమే మెట్రోరైలు ప్రయాణిస్తుంది. రైల్వే సేఫ్టీ ఆథారిటి పరీక్షల అనంతరమే వేగం పెరగనుంది. మార్చి వరకు రక్షణ పరమైన పరీక్షలు కొనసాగనున్నాయి. కేంద్ర రైల్వే సేఫ్టీ ఆథారిటీ పరీక్షలు పూర్తయ్యాక, ధ్రువీకరణ పత్రం జారీ చేసిన అనంతరమే వేగం పెంచేందుకు అవకాశం ఉంటుంది. అప్పటి వరకు ఇలాగే మందగమనంతోనే ప్రయాణం చేయాల్సిందే. దీంతో ట్రాఫిక్ సమస్యలు లేకుండా వేగంగా గమ్యస్థానం చేరాలనుకుంటున్న వారు నిరుత్సాహానికి గురవుతున్నారు. దీనికి బదులు సిటీ బస్సులోనో, సొంత బైక్ మీదో వెళితే బాగుటుందనే అభిప్రాయానికి వస్తున్నారు. ఆదివారం నాగోల్ మెట్టుగూడ మధ్య నడిచే మెట్రోరైలు అమీర్‌పేట్ స్టేషన్‌లో రెండు గంటల పాటు అగిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అంతకు ముందు రోజులలో బేగంపేట ప్రాంతంలో మెట్రోరైలు 7 నుంచి 10 నిమిషాల పాటు అగిపోతున్నట్లు ప్రయాణికుల ద్వారా తెలిసింది.

ఉద్యోగులా? జాయ్ రైడర్సా...?

మరోవైపు మెట్రోకు కష్టాలు తప్పేట్టు లేవు. ఈ విషయం మెట్రోరైలు నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టికి షాక్ కలిగించేదే. ఎందుకంటే... మెట్రోలో ప్రయాణిస్తున్న అధిక శాతం ప్రయాణికులు కేవలం సరదాగానే ప్రయాణిస్తున్నారు. రోజువారీ కార్యక్రమాల కోసం ప్రయాణిస్తున్న వారు, ఆఫీసులకు వెళుత్నువారు మెట్రోపై పెద్దగా ఆసక్తి చూపడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జనాల సరదా తీరిపోయిన తర్యాత మెట్రోరైళ్లలో ఎక్కే ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పడిపోతుందని భావిస్తున్నారు. దీంతో మెట్రో ఆదాయినికి భారీగా గండి పడే అవకాశాలు ఉన్నాయని రవాణా రంగ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఛార్జీల తగ్గింపు, ప్రయాణ వేగాన్ని పెంచితేనే మెట్రోకు భవిష్యత్ ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మెట్రోరైల్ నిర్వహణలో ఎల్ అండ్ టి ఎం నిర్ణయం తీసుకుంటుందో చూద్దాం.

వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే 24 గంటల విద్యుత్

మన తెలంగాణ/హైదరాబాద్: ప్రభుత్వం వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే 24 గంటల విద్యుత్ పేరుతో ప్రభుత్వం 24గంటల ప్రచారం చేసుకుంటుందని తెలంగాణ జెఏసి ఛైర్మన్ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం సరఫరా చేస్తున్న 9 గంటల విద్యుత్‌ను సక్రమంగా సరఫరా చేస్తే చాలని రైతులు కోరుతున్నారన్నారు. 24గంటల విద్యుత్ సరఫరాకు విద్యుత్ సంస్థలపై సుమారు రూ.10,000 కోట్ల భారం పడుతుందని, ఇందు లో ప్రభుత్వం కేవలం రూ. 5,500 కోట్లనే భరిస్తామని చెబుతుందని, విద్యుత్ సంస్థలు ఆర్థికంగా నష్టాల బాట పట్టాల్సిన పరిస్థితులు వస్తాయని పేర్కొన్నారు. గిట్టుబాటు ధరలు, అరకొర రుణమాఫీతో రైతులు ఇబ్బంది పడుతున్న పట్టించుకోని ప్రభుత్వం, ఇప్పుడు 24గంటల విద్యుత్ సరఫరా ప్రచారానికి కోట్లాది రూపాయాలను ఖర్చు చేస్తుందని విమర్శించారు. టిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో అనేక హామీలను ఇచ్చిందని, ఆ అంశాలను పక్కన పెట్టి కేవలం 24 గంటల విద్యుత్‌పై అమితాసక్తి చూపడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. 2017– 18 దేశంలో 12,29,661 మిలియన్ యూనిట్లు లభ్యత ఉండగా, 13,37,828 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి అవుతుందని, దీంతో 1,08,167 మిలియన్ యూనిట్లు మిగులు విద్యుత్ ఉంటుందని ఆయన వివరించారు.



జూన్ 2న 2గా హైకోర్టు?

(మొదటిపేజీ తరువాయి)

ఆధారంగా తుది నిర్ణయం జరుగుతుందని సమాచారం. కేవలం హైకోర్టు అవసరాలకు మాత్రమే కాకుండా న్యాయమూర్తుల, సిబ్బంది నివాసాలకు కూడా తగినన్ని బంగళాలు అవసరమవుతాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి ఏపీ హైకోర్టు అక్కడి నుంచే పనిచేయవచ్చని సమాచారం. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచీ హైకోర్టు విభజనపై రాష్ట్ర ప్రభుత్వం, న్యాయవాదులు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర వత్తిడి తెచ్చాయి. అప్పటి కేంద్ర న్యాయమంత్రి సదానందగౌడను, ఆ తర్వాత మంత్రి రవిశంకర్ ప్రసాద్‌ను తెలంగాణ న్యాయవాదులు స్వయంగా కలిసి హైకోర్టు విభజన జరగని కారణంగా తెలంగాణకు న్యాయశాఖ (జ్యుడిషియరీ)లో జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. అయితే అప్పట్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిద్ధం కాకపోవడం, ఆ రాష్ట్ర హైకోర్టు అవసరాలకు అనుగుణంగా భవనాలను సిద్ధం చేయకపోవడంతో ఎటూ తేల కుండా ఉండిపోయింది. ఇటీవల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాధన్‌కు లేఖ రాయడం, అందులో ఏపీ రాష్ట్రానికి విడి హైకోర్టు ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేయడం, శాశ్వత భవనాలు నిర్మాణమయ్యేంత వరకు తాత్కాలిక భవనాలను సమకూర్చనున్నట్లు హామీ ఇచ్చిన నేపథ్యంలో ఉమ్మడి హైకోర్టు విభజనకు అడుగులు పడ్డాయి. దీనికి తోడు టీఆర్ఎస్ ఎంపీలు గత బుధవారం లోక్‌సభలో తీవ్ర స్థాయిలో నిరసన వ్యక్తం చేసి సభా కార్యకలాపాలను అడ్డుకున్న తర్వాత మరుసటి రోజున కేంద్ర న్యాయమంత్రి రవిశంకర్ ప్రసాద్ జీరో అవర్‌లో హైకోర్టు విభజనకు మార్గం సుగమమైందని, హైకోర్టుకు అవసరమైన భవనాలను ఏపీ రాష్ట్రం సమకూర్చడానికి సంసిద్ధత వ్యక్తం చేసినందువల్ల త్వరలోనే ఇది కొలిక్కి వస్తుందని హామీ ఇవ్వాల్సివచ్చింది. హైకోర్టు విభజనపై కేంద్ర ప్రభుత్వ వైఖరి స్పష్టమైన తర్వాత సిఎం కెసిఆర్ సైతం సీనియర్ ఎంపీలతో ఈ విషయాన్ని లోతుగా చర్చించినట్లు తెలిసింది. ఏపీలో హైకోర్టు ఏర్పాటుకు విధాన నిర్ణయం జరిగిపోయినందున ఇక జరగాల్సిన ప్రక్రియను వీలైనంత త్వరగా పూర్తిచేయడంలో ఉన్న ఇబ్బందులపై చర్చించినట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం కూడా స్పష్టమైన ప్రకటనను చేయడంతో ఇక రాష్ట్రపతి నుంచి నోటిఫికేషన్ వెలువడడం, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవడం తదితరాలపై కూడా చర్చించినట్లు తెలిసింది. చంద్రబాబు లేఖ అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో ఆ ప్రభుత్వం సమకూర్చిన భవనాలను పరిశీలించడానికి కమిటీ ఏర్పాటుకావడం, పరిశీలన జరిపి నివేదిక ఇవ్వడం, అదనపు సౌకర్యాలు అవసరం అయినట్లయితే ఆ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించడం, రాష్ట్రపతి నుంచి నోటిఫికేషన్ వెలువడడం... ఇలా అనేక రకాల ప్రక్రియలు ఉన్నందువల్ల ఇవన్నీ నాలుగైదు నెలల్లో పూర్తికావడంలోని ఆచరణాత్మక సమస్యలపై సిఎం చర్చించినట్లు తెలిసింది. మే నెల చివరికల్లా హైకోర్టు ఏర్పాటవుతుందని, జూన్ 2వ తేదీ నుంచి రెండు రాష్ట్రాల హైకోర్టులు విడివిడిగా పనిచేయడం ప్రారంభిస్తాయని, ఆ దిశగానే అడుగులు పడుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఉమ్మడి హైకోర్టు పూర్తి స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి కేటాయించబడుతుంది. ఈ ప్రక్రియకు కొనసాగింపుగా రెండు రాష్ట్రాలకు మంజూరైన సిబ్బంది, ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బంది, ఖాళీ పోస్టులు తదితరాలపై స్పష్టత వస్తుంది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు నియామకం, బదిలీ తదితర చర్యల్ని తీసుకుంటాయి.

కాంతి కానుక

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. కొత్త సంవత్సరం తొలి రోజు నుంచే రాష్ట్రంలోని విద్యుత్ ఉద్యోగులందరికీ ఇది వర్తిస్తుందని స్పష్టం చేశారు. సిఎం ప్రకటన పట్ల విద్యుత్ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఆనందంగా జరుపుకుంటున్న కొత్త సంవత్సర వేడుకలకు విద్యుత్ ఉద్యోగులు నిరంతరాయ విద్యుత్‌ను అందించి రెట్టింపు చేశారని సిఎం కెసిఆర్ వ్యాఖ్యానించారు. ప్రగతి భవన్‌లో సిఎం కెసిఆర్ రాష్ట్ర జెన్‌కో, ట్రాన్స్‌కో సంస్థల సిఎండి ప్రభాకర్‌రావును ఆలింగనం చేసుకుని అభినందించడంతో పాటు స్పిడిసిఎల్ సిఎండి రఘుమారెడ్డి, విద్యుత్ క్రమబద్ధీకరణ చైర్మన్ ఇస్మాయిల్ ఆలీ ఖాన్, ట్రాన్స్‌కో సంయుక్త ఎండి శ్రీనివాసరావు, డైరెక్టర్ అశోక్‌కుమార్, వెంకటరాజం, లలిత్‌కుమార్, ఎస్పిడిసిఎల్ డైరెక్టర్ కమాలుద్దీన్ ఆలీఖాన్, ట్రాన్స్‌కో డైరెక్టర్ నర్సింగరావు తదితరులను ప్రశంసించారు. వారందరినీ పేరుపేరునా పలకరించి అభినందించారు. విద్యుత్‌శాఖలోని ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడేనాటికి తీవ్ర విద్యుత్ సంక్షోభం ఉన్నదని, మూడున్నరేళ్ళలోనే యావత్తు దేశం ఆశ్చర్యపోయే విధంగా 24 గంటల విద్యుత్‌ను అందించగలుగుతున్నామని, ఇది ఉద్యోగులందరి సమిష్టి కృషి వల్లనే సాధ్యమైందని సిఎం కెసిఆర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలంతా రాష్ట్ర విద్యుత్‌శాఖ పనితీరు పట్ల సంతృప్తిగా, ఆనందంగా ఉన్నారని వ్యాఖ్యానించారు. వ్యవసాయరంగానికి తెలంగాణ ఇప్పుడు 24 గంటల ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయడం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. దశాబ్దాల పాటు రైతులు అనుభవించిన కరెంటు కష్టాలకు శాశ్వత విముక్తి కలిగిందని, దీని వెనక విద్యుత్ ఉద్యోగుల చిత్తశుద్ధి, నిబద్ధత, వ్యయప్రయాసలు ఉన్నాయని పేర్కొన్నారు. టీఆర్ఎస్ తన ఎన్నికల ప్రణాళికలో వ్యవసాయ రంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ అనే హామీని ఇవ్వకపోయినా రైతుల జీవన ప్రమాణాలకు దీని అవసరం ఎలాంటిదో గుర్తించి ఆ దిశగా కార్యాచరణ చేపట్టామని గుర్తుచేశారు. తొలుత ఈ సంవత్సరం మార్చి నుంచి వ్యవసాయానికి 24 గంటల విద్యుత్‌ను సరఫరా చేయాలని భావించామని, కానీ యాసంగి పంటలకు వీలుగా దాన్ని జనవరి 1వ తేదీ నుంచే అమలుచేయాలన్న ప్రణాళిక సాకారమైందని పేర్కొన్నారు.

కొన్ని రాష్ట్రాలు వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ ఇస్తూ చార్జీలు వసూలు చేస్తున్నాయని, కొన్ని రాష్ట్రాలు ఉచితంగా ఇస్తున్నప్పటికీ కొన్ని పరిమిత గంటలకు మాత్రమే సరఫరా అవుతోందని, కానీ తెలంగాణ మాత్రం నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్‌ను ఉచితంగా ఇస్తోందని, ఇది దేశంలోనే తెలంగాణకు గొప్ప గుర్తింపు అని పేర్కొన్నారు. చాలా రాష్ట్రాల నుంచి తనకు ఉదయం నుంచీ శుభాకాంక్షలు, అభినందనలు అందుతున్నాయని, రైతుల సంక్షేమం కోసం తీసుకున్న గొప్ప నిర్ణయం అంటూ ప్రశంసించారని సిఎం కెసిఆర్ గుర్తుచేశారు. పక్కా ప్రణాళికతో, పగడ్బందీ కార్యాచరణతోనే ఇది సాధ్యమైందని, ఇందులో విద్యుత్ శాఖ ఉద్యోగుల ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు.విద్యుత్ ఉద్యోగులకు సిఎం కెసిఆర్ నూతన సంవత్సర కానుకగా ఒక ప్రత్యేక ఇంక్రిమెంట్‌ను ఇవ్వడంపై సిఎండి ప్రభాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్రాంతి సరిహద్దు!

(మొదటిపేజీ తరువాయి)

పార్టీ నుండే ఎంఎల్ఏలు, ముఖ్య నాయకులను చేర్చుకోవడం ద్వారా పైచేయి సాధించిన టిఆర్ఎస్‌ను అదే అస్త్రంతో దెబ్బకొడతామని పేర్కొంటున్నాయి. సంక్రాంతి వరకు మంచి రోజులు లేకపోవడంతో పండుగ తరువాత చేరికలకు తెరలేపుతామని చెబుతున్నారు. అంతే కాకుండా కాంగ్రెస్ జాతీయ అధ్యక్ష పదవి చేపట్టిన తరువాత తొలిసారిగా రాహుల్‌గాంధీని ఆహ్వానించి వరంగల్‌లో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసేందుకు కూడా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రాహుల్‌ను ఉస్మానియా యూనివర్సిటీకి కూడా రప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. రెండేళ్ళ క్రితం ఆదిలాబాద్‌కు వచ్చిన సందర్భంలోనే ఒయుకు వస్తానని ఆయన విద్యార్థి సంఘం నాయకులకు హామీనిచ్చారు. ఆ తరువాత సంగారెడ్డి బహిరంగ సభకు వచ్చినా ఒయుకు మాత్రం వెళ్ళ లేకపోయారు. ఈ సారి రాష్ట్రానికి వచ్చినప్పుడు కచ్చితంగా ఒయు సందర్శన కూడా ఉంటుందని, నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకుంటుండడం, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌ను కూడా నిర్వహించలేకపోవడం వంటి ఘటనల నేపథ్యంలో రాహుల్ పర్యటన తమకు కలిసివస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది. అలాగే టిపిసిసి కొత్త కమిటీ ఏర్పాటైన తరువాత సీనియర్ నాయకులందరితో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా బస్సు యాత్రకు యోచిస్తోంది. ఇక అధికార టిఆర్ఎస్ కూడా సంక్రాంతి తరువాత అటు పరిపాలన, ఇటు పార్టీ పరంగా కార్యాచరణలో వేగం పెంచనుంది. పండుగ తరువాత మరో సర్వే రిపోర్ట్‌ను కెసిఆర్ ఎంఎల్ఏలకు అందజేయనున్నారు. ఎన్నికలకు చేరువకావడంతో సిట్టింగ్ ఎంఎల్ఏల పనితీరు మెరుగుపరుచుకునేందుకు ఈ రిపోర్టే చివరి అవకాశంగా ఉంటుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మరోవైపు కాంగ్రెస్ పార్టీలో చేరికలకు కౌంటర్‌గా ఆ పార్టీకి చెందిన కొందరు మాజీ మంత్రులను ఇప్పటికే టచ్‌లో ఉంచినట్లు సమాచారం. తమ పార్టీ నుండి చేరే వారి ఆధారంగా వారిని దశల వారీగా పార్టీలో చేర్చుకోవాలని టిఆర్ఎస్ అధినేత వ్యూహమని తెలిసింది. అలాగే ప్రభుత్వ హామీలను సాధ్యమైనేంత వరకు ఏడాది మొదటి అర్థభాగంలోనే పూర్తి చేసుకునేలా ముఖ్యమంత్రి కెసిఆర్ చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే మిషన్ భగీరథ పనులు, గ్రామీణ భూ రికార్డుల ప్రక్షాళన పూర్తవుతున్నాయి. అలాగే ఎకరానికి రూ.8వేల పథకాన్ని ఈ ఏడాది నుండే అమలు చేయనున్నారు. ప్రాజెక్టుల్లో కాళేశ్వరాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఈ ఏడాదే పూర్తి చేసి నీళ్ళు ఇవ్వాలని, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు కూడా సాధ్యమైనంత ఎక్కువగా పూర్తి చేయాలనే సంకల్పంతో సాగుతోంది. దీనికి తోడు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ళ నిర్మాణం, ప్రభుత్వ ఉద్యోగాల నోటిఫికేషన్‌లు, నియామకాల్లో కూడా వేగంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. మరోవైపు వచ్చే ఏడాది పూర్తి స్థాయి బడ్జెట్ కాకుండా ఓటాన్ అకౌంట్ ప్రవేశపెట్టే అవకాశమే ఉండడంతో మార్చిలో ప్రవేశపెట్టనున్న బడ్జెటే టిఆర్ఎస్ ప్రభుత్వానికి కీలకమైంది. ఇది ఎన్నికల బడ్జెట్‌గా ఉండబోతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఎస్‌సి, ఎస్‌టిలకు నిధులతో పాటు బిసిలకు సబ్‌ప్లాన్ తరహాలో నిధులు కేటాయించనున్నారు. ఇక బిజెపి కూడా సంక్రాంతి తరువాత జాతీయ అధ్యక్షుడు అమిత్ షా పర్యటన పెట్టుకుంది. ఈ పర్యటన సందర్భంగా పలువురి చేరికలు ఉంటాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు.



విద్యాసంస్థలకు వెలుగు

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నాయని, వేతనాలను కూడా చెల్లించని పరిస్థితుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ విద్యా సంస్థలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చేస్తానని, ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఆయన భరోసానిచ్చారు. ఉప ముఖ్యమంత్రి మహ్మద్ మహమూద్‌అలీ మాట్లాడుతూ నుమాయిష్‌ను సందర్శించేందుకు విదేశాల నుంచి కూడా వస్తుంటారన్నారు. ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని విద్య రంగంపై ఖర్చు పెట్టడాన్ని ఆయన అభినంధించారు. సంవత్సరానికి ఒకే సారి కాకుండా మధ్య మధ్యలో కూడా నుమాయిష్ నిర్వహించాలని సూచించారు. సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు. మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ సొసైటీ ద్వారా వచ్చే ఆదాయంతో 18 కళాశాలను నిర్వహిస్తున్నామని, తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. సొసైటీకి చెందిన విద్యాసంస్థలు కొంత ఆర్థిక ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. విద్యాసంస్థల జీతభత్యాలకు ఎగ్జిబిషన్ సొసైటి ఆధ్వర్యంలో కొంత కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నట్లు ఆయన వెల్లడించారు. సిఎం మార్గనిర్ధేశం ప్రకారమే కొత్త ఒరడితో ఎగ్జిబిషన్‌ను నిర్వహించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నుమాయిష్‌లో స్టాల్స్‌ల సంఖ్యను పెంచుతామన్నారు. పి. సరోత్తమరెడ్డి మాట్లాడుతూ ఎగ్జిబిషన్‌కు చెందిన విద్యా సంస్థలలో కాంట్రాక్ట్ అధ్యాపకులకు వేతనాలను ప్రభుత్వమే చెల్లించేలా చూడాలని కోరారు.

2500స్టాల్స్: ఈసారి నుమాయిష్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు మొత్తం 2500 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. నుమాయిష్‌కు వచ్చే సందర్శకులకు ఉచితంగానే వై– ఫై సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సిసి కెమెరాలను, షీటీమ్స్‌ను ఏర్పాటు చేయడంతో పాటు రెండు వందల మంది వాలంటీర్లను కూడా నియమించారు. సందర్శకులకు ఇబ్బందులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు .

జిఎస్‌టి రాబడి డీలా

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే పరిస్థితి అని ఉదహరించారు. జిఎస్టి అమల్లోకి వచ్చిన జూలై నెలలో దేశం మొత్తంమీద 94,063 కోట్ల మేరకు వసూళ్ళు జరిగితే ఆ తర్వాత ప్రతి నెలా ఇది తగ్గుతూ నవంబరు నాటికి రూ. 80,808 కోట్లకు పడిపోయింది. రాష్ట్రంలో సైతం ఆగస్టులో రూ. 1417.72 కోట్లు, సెప్టెంబరులో రూ. 1499.41 కోట్లు, అక్టోబరులో రూ. 1472.33 కోట్లు ఉంటే నవంబరులో అది రూ. 1404.08 కోట్లకు తగ్గింది. జిఎస్టి అమల్లోకి రాకపూర్వం గతేడాది నవంబరులో వ్యాట్ వసూళ్ళు రూ. 2746.03 కోట్లు. జిఎస్టి వచ్చిన తర్వాత ఎక్సయిజ్, కేంద్ర వాటా, జిఎస్టి నష్టపరిహారం కింద వచ్చిన రూ. 162 కోట్లు కలిపితే నవంబరు మాసానికి మొత్తం రూ. 3451.46 కోట్లుగా తేలింది. జిఎస్టి విధాన వలన దేశం మొత్తంమీద పన్ను చెల్లింపుదారుల సంఖ్య 80 లక్షల నుంచి 99 లక్షలకు పెరిగినా ప్రతి నెలా లేదా త్రైమాసికంగా పన్నులు చెల్లిస్తున్నవారు మాత్రం 53.06 లక్షల మంది మాత్రమే. రాష్ట్రంలో సైతం పన్ను చెల్లింపుదారుల్లో సుమారు 80% మంది జిఎస్టి పరిధిలోకి వచ్చారని అధికారి వివరించారు. జిఎస్టిపై ఇంకా అవగాహన కలిగించాల్సి ఉన్నదని అన్నారు. ఆర్థికరంగంలోనే ఒక భారీ సంస్కరణ అయినందువల్ల అలవాటుపడడానికి కొంత సమయం పడుతుందన్నారు. ఆర్థిక శాఖ అధికారి ఒకరు మాట్లాడుతూ, వ్యాట్ విధానంలో వ్యాపారస్తులకు, రాష్ట్ర రెవిన్యూ అధికారులకు స్పష్టమైన అవగాహన, అనుభవం ఉన్నదని, అయితే జిఎస్టి వయసు కేవలం ఐదారు నెలలు మాత్రమేనని, ఇంకా నడక నేర్చుకునే దశలోనే ఉన్నదని, పరుగులు పెట్టాలంటే కనీసం ఒకటి రెండు సంవత్సరాలు పడుతుందని అభిప్రాయపడ్డారు. జిఎస్టి వల్ల దేశం మొత్తంమీద వసూళ్ళు మందగించిన మాట వాస్తవమే అయినా అందుకు చాలా కారణాలు ఉన్నాయని, అయితే తెలంగాణలో పన్ను వసూళ్ళు పెద్దగా ఆందోళన చెందాల్సినంతటి స్థాయిలో లేవని అన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నాటికి అంతా సర్దుకుంటుందని, ఆర్థిక పరిస్థితి కూడా కుదుట పడుతుందని అన్నారు. అనేక రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ పరిస్థితి చాలా సంతృప్తిగా ఉందని వ్యాఖ్యానించారు.



నయీం కేసులో నిర్లక్ష్య ధోరణి : కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

మన తెలంగాణ/యాదాద్రి భువనగిరి : మిషన్లతో లెక్కించిన 2వేల కోట్లు ఏమైనట్టు? నయీం డైరీ ఎటు పోయినట్టు? విచారణ పేరుతో నయీం కేసు విషయంలో నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తుందని ఎమ్మెల్సీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి టిఆర్ఎస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంతి భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నయీం డైరీలో కొందరి ఎమ్మెల్సీల పేర్లు, టిఆర్ఎస్ రాష్ట్ర నాయకుల పేర్లు ఉన్నందుననే నయీం డైరీని తెరువకపోవడం శోచనీయమన్నారు. ఆ 2 వేల కోట్లు ప్రజా సంక్షేమానికి ఖర్చుచేయాలన్నారు. అమాయకులను భయభ్రాంతులకు గురిచేసి నయీం గుంజుకున్న వ్యవసాయ భూములు, బంగ్లాలు, భవంతుల బాధితులు అయోమయంతోనే నిరీక్షిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. హైదరాబాద్ హన్మకొండ జాతీయ రహదారిపై పేద ప్రజలకు వైద్య సహాయానికి అందుబాటులో ఉన్న నిమ్స్ ఆసుపత్రిలో పూర్తి స్థాయి వైద్యాన్ని అందించకపోవడం బాధాకరమన్నారు. పార్టీ అధిష్టానం ఆదేశిస్తే భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న 7 అసెంబ్లీ స్థానాలను గెలిపించి తీరుతానని అన్నారు. సమావేశంలో టిపిసిసి మాజీ కార్యదర్శి తంగెళ్ళపల్లి రవికుమార్, భువనగిరి మున్సిపల్ మాజీ చైర్మెన్ బర్రెజహాంగీర్, డిసిసి ప్రధాన కార్యదర్శి పంజాల రామాంజనేయలుగౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్టు మీద పడి బాలుడు మృతి



మన తెలంగాణ/కమ్మర్‌పల్లి (నిజామాబాద్ జిల్లా): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని దేవుడికి అభిషేకానికి వెళ్లిన ఓ బాలుడు ఆలయంలో చెట్టు విరిగి మీద పడడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషాద సంఘటన కమ్మర్‌పల్లి మండలం ఊప్లూర్‌లోని ఆలయంలో సోమవారం జరిగింది. కమ్మర్‌పల్లి మండల కేంద్రానికి చెందిన పొతన్నర్ మణికంఠ (13) అన్న రాహుల్‌ని వారి తల్లి రాణి నూతన సంవత్సర సందర్భంగా అభిషేకం కోసం మండలంలోని ఊప్లూర్‌లో గల శ్రీ బాల రాజరాజేశ్వర స్వామి ఆలయానికి సోమవారం తీసుకువెళ్ళింది. తల్లి కొడుకులు ఆలయలంలో ప్రదక్షిణలు చేస్తుండగా కొబ్బరి చెట్టు విరిగి బాలుడిపై పడింది. దీంతో బాలుడు తల పగిలి మెదడు బయట పడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహన్ని పోస్టుమార్టం నిమితం ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు మణికంఠ హైదరాబాద్ కెకెఆర్ గౌతమ్ స్కూలో 8వ తరగతి చదువుతున్నాడు.క్రిస్మస్ సెలవులతో ఇటీవల ఇంటికి వచ్చాడు. బాలుని తండ్రి రాము ఉపాధి నిమిత్తం ఇజ్రాయిల్ దేశంలో ఉన్నాడు.


ప్రియుడితో కలసి భర్త హత్య

మన తెలంగాణ /కొండమల్లెపల్లి : ప్రియుడితో కలిసి తన సంబంధానికి అడ్డువస్తున్నాడని భావించి భర్తను హత్య చేసిన ఓ భార్యను ఆమె ప్రియుడిని పోలీసులు జైలుకు పంపారు. కొండమల్లెపల్లి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ శివరాంరెడ్డి హత్యకు వివరాలు తెలిపారు. మండల పరిధిలోని చెన్నారం గ్రామ పంచాయతీలో గల ఏపూర్‌తండాలో గత నెల 28న రమావత్ సోమునాయక్ (33) భార్య భారతి చేతిలో హత్యకు గురయ్యాడు. భర్త సోము, కుమారుడు మహేష్‌తో కలసి తండాలో జీవనం సాగిస్తున్న భారతి కొంత కాలంగా అదే తండాకు చెందిన రమావత్ శివనాయక్ (వరసకు బావ)తో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయాన్ని పసిగట్టిన భర్త సోమునాయక్ భార్య భారతిని పలుమార్లు మందలించాడు. అక్రమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించి ఎలాగైన భర్త సోము నాయక్‌ను అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించింది. మద్యం సేవించిన సోము భార్య భారతి కుమారుడు మహేష్‌తో గొడవ పడి నిద్రకు ఉపకరించాడు. అదే అదునుగా అదే సమయంలో ప్రియుడు శివకు ఫోన్‌చేసి రప్పించింది. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో భారతి వద్దకు వచ్చిన ప్రియుడు శివనాయక్ మంచంపై నిద్రిస్తున్న భర్త సోము నాయక్‌ను గట్టిగా గొంతును నులమగా భారతి భర్త సోమునాయక్ ముఖంపై బొంతను వేసి ఊపిరి ఆడకుండా చేసి హత్య చేశారు. సోము అన్నయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు సోము భార్యను విచారించగా ఈ విషయాలు బయటి వచ్చాయి. భారతి, రమావత్‌శివనాయక్‌లను అరెస్టు చేసి రిమాండ్ పంపిస్తున్నట్లు సిఐ శివరాంరెడ్డి తెలిపారు.

మూడేళ్ల చిన్నారిపై అత్యాచారం

మన తెలంగాణ/రామచంద్రాపురం : నలభై ఎనిమిదేళ్ల వ్యక్తి లైంగిక దాడికి పాల్పడిన ఘటన సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురం పట్టణంలో చోటుచేసుకుంది. ఈ అమానుష సంఘటనపై స్థానికులు నివ్వెరపోయారు. ఈ ఘటనకు సంబంధించి రామచంద్రాపురం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఇలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన నీరజ్ పాశ్వాన్ రామచంద్రాపురంలో నివాసముంటు స్థానికంగా ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం నీరజ్ పాశ్వాన్ భార్య తన మూడేళ్ల కూతురిని వెంట బెట్టుకుని రామచంద్రాపురం సంతకు వెళ్లారు. కూరగాయలు తీసుకుంటున్న తరుణంలో తల్లి నుండి కూతురు తప్పిపోయింది. దీంతో కుటుంబసభ్యులు ఎంత వెతికినా చిన్నారి జాడ తెలియకపోవడంతో రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్న పోలీసులకు అదేరోజు రాత్రి బిహెచ్ఇఎల్ డిపో బస్ డ్రైవర్ నుండి వచ్చిన ఫోన్ సందేశం వచ్చింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని రక్తస్రావంతో ఉన్న చిన్నారిని చికిత్స నిమిత్తం నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు లైంగిక దాడికి వ్యక్తిని గుర్తించి నిందుతుడిని అదుపులోకి తీసుకున్నారు.నిందితుడిని అమీన్‌పూర్ మండలం ఇసుకబావి గ్రామానికి చెందిన పల్తేవారు శ్రీనివాస్(48)గా గుర్తించినట్టు రామచంద్రాపురం ఇన్‌స్పెక్టర్ భాస్కర్ తెలిపారు. చిన్నారి నీలోఫర్‌లో చికిత్స పొందుతోంది.

మైనర్‌పై వృద్ధుడి అత్యాచారయత్నం



మన తెలంగాణ/పాన్‌గల్: 65ఏళ్ల వృద్ధుడు 11 ఏళ్ల బాలికపై అత్యాచార యత్నం చేసిన ఘటన సోమవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలంలో వెలులోకి వచ్చింది. దావాజిపల్లి గ్రామానికి చెందిన ఎండి .మౌలాలిగ్రామంలోని తన నివాసంలో కిరాణం , చికెన్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు. ఆదివారం అదే గ్రామానికి చెందిన ఓ బాలిక కిరాణా దుకాణానికి వచ్చింది. మౌలాలి బాలికపై అత్యాచార యత్నం చేయబోగా, అటుగా వచ్చిన ఆమె తల్లి అడ్డుకుంది. దీంతో గ్రామస్తులు ఆగ్రహించి మౌలాలి నివాసంపై దాడి చేసి, గుడిసెను కాల్చి వేశారు. ఆలస్యంగా తెలుసుకున్న పోలీసులు సోమవారం హుటాహుటిన గ్రామానికి చేరుకున్నారు. ఎఎస్‌పి సురేందర్ రెడ్డి గ్రామానికి చేరుకొని సంఘటనా వివరాలను తెలుసుకున్నారు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువు మృతి

వైద్యుల నిర్లక్ష్యమంటూ కుటుంబ సభ్యుల ఆందోళన

మన తెలంగాణ/ వర్ని (నిజామాబాద్ జిల్లా): మండలంలోని మోస్రా ప్రభుత్వ ఆసుపత్రిలో శిశువు సోమవారం మృతి చెందడంతో బాలింత కుటుంబీకులు ఆందోళన చేపట్టారు. మోస్రాకు చెందిన మేకల పద్మ కాన్పుకోసం శనివారం మోస్రా దవఖానాలో చేరింది. ఉదయం పురిటి నొప్పులు రావడంతో సాయంత్రం వరకు వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినట్టు బాలింత కుటుంబసభ్యులు ఆరోపించారు. మగ బిడ్డకు జన్మనిచ్చిన అనంతరం ఆదివారం బిడ్డ పరిస్థితి క్షీణించిందని వెంటనే జిల్లా కేంద్ర దవాఖానాకు తరలించాలని వైద్యులు సూచించడంతో 108 ద్వారా చికిత్స నిమిత్తం తరలించామని బాలింత భర్త పేర్కొన్నారు. దవాఖానాలో బాలుడు మృతి చెందాదని చెప్పడంతో సోమవారం మోస్రా దవాఖానా వద్ద ఆందోళన చేపట్టారు. బాలుడి మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆసుపత్రి ఎదుట బైఠాయించారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ డిఎండ్‌హెచ్‌వో విద్య అక్కడికి చేరుకుని ఆందోళనకారులను సముదాయించారు. అందుకు బాద్యులపై చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.

రేపిస్టులకు రాజీ(జ) మార్గం!



- ఎమ్మెల్సీ కుమారుడిపై రేప్ కేసు కొట్టివేత
- వాంగ్మూలాలను మారుస్తున్న బాధితులు
- చోద్యం చూస్తున్న దర్యాప్తు అధికారులు
- కేసుల్లోంచి బయటపడుతున్న విఐపిలు
- సామాన్యులపైనే పోలీసుల ప్రతాపం
- గతేడాది 24 శాతం పెరిగిన రేప్ కేసులు

మన తెలంగాణ/హైదరాబాద్ : హైదరాబాద్‌లోని పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో గతేడాది నమోదైన మహిళా డిజైనర్‌పై జరిగిన అత్యాచారం కేసును పోలీసులు మూసివేశారు. ఈ కేసులో బాధితురాలు నిందితులకు అనుకూలంగా వాంగ్మూలం ఇవ్వడంతో ముగ్గురు నిందితులు బయటపడ్డారు. ఈకేసులో పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. నిందితుల్లో ఓ ఎమ్మెల్సీ కుమారుడు, ఇద్దరు పారిశ్రామిక వేత్తల కుమారులు ఉండడం వల్లనే పోలీసులు కేసును తప్పుదారి పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బంజారాహిల్స్‌కు చెందిన మహిళా డిజైనర్ (23), కొంపల్లికి చెందిన పారిశ్రామిక వేత్త కుమారుడు, బిబిఎ ఫస్టియర్ విద్యార్థి ప్రీతంరెడ్డి (21)లకు గతేడాది జనవరిలో పరిచయం ఏర్పడింది. పెళ్లి విషయంపై మాట్లాడుకుందామని గతేడాది మే 5న ఇంటికి పిలిపించి అత్యాచారం జరిపి బెడ్ రూమ్‌లో బంధించి.. తన ఇద్దరు స్నేహితులు స్నేహిత్‌రెడ్డి (ఎమ్మెల్సీ కుమారుడు) అరఫ్ రెడ్డి (పారిశ్రామికవేత్త కుమారుడు)తో కలిసి మరోసారి అత్యాచారానికి ప్రయత్నించారని..వారి చెరనుంచి ఎలాగోలా తప్పించుకున్నానని..నిందితులపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని బాధితురాలు పేట్‌బషీరాబాద్ పోలీసు స్టేషన్‌లో మరుసటి రోజు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పలు సెక్షన్‌ల కింద పై ముగ్గురు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి..ప్రీతంరెడ్డిని అరెస్టు చేసి జైలుకు పంపారు. మిగతా ఇద్దరు నిందితులు పరారీలోఉన్నారని పేర్కొన్నారు. ఈ కేసు అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ కేసును చేధించేందుకు పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలను దింపారు. 13 మంది నుంచి సాక్ష్యాలను సేకరించారు. బాధితురాలిని వైద్య పరీక్షల నిమిత్తం గాంధీ ఆసుపత్రికి సైతం తరలించారు. ఈ కేసును తప్పుదారి పట్టించేందుకు పోలీసులు చాలానే శ్రమించారు. ఆగమేఘాలపై పోలీసులు చార్జిషీట్‌ను కూడా వేశారు. చివరకు బాధితురాలితో ఏమిజరిగిందో ఏమో తెలియదుగాని ఆమె మెజిస్ట్రేట్ ముందు ఫిర్యాదులో పేర్కొన్న ఆరోపణలకు విరుద్ధంగా..నిందితులకు అనుకూలంగా వాంగ్మూలం ఇవ్వడంతో కేసును కొట్టేశారు.మెజిస్ట్రేట్ ముందు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం.. బాధితురాలు నిందితులపై తమకు తప్పుడు ఫిర్యాదు చేసినట్లు పోలీసులు చెబుతున్నారు.

తప్పుదారి పట్టించినవారిపై చర్యలేవి...
తనను కిడ్నాప్ చేశారని పోలీసులను తప్పుదారి పట్టించి ఫిర్యాదు చేసిన ఓ మహిళా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై రాయదుర్గం పోలీసులు ఐపిసి 203 సెక్షన్ కింద కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. ఈ కేసు కూడా అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది.అలాగే పహాడీషరీఫ్ పోలీసు స్టేషన్‌లో తనపైదాడి జరిగిందని తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తిపై కూడా పోలీసులు కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. అయితే పేట్‌బషీరాబాద్ పోలీసులు మాత్రం అత్యాచారం ఫిర్యాదులో బాధితురాలు పోలీసులను నిజంగా తప్పుదారి పట్టిస్తే ఆమెపై ఎందుకు కేసు పెట్టలేదు..పోలీసులకు బాధితురాలికి, నిందితులకు మధ్య ఏమైనా ఒప్పందం జరిగిందా. చట్టంలో ఉన్న లొసుగులను ఆసరా చేసుకుని అందరూ కలిసి అత్యాచారం కేసును నీరుగార్చారా అనే ఆరోపణలు వస్తున్నాయి. అలాగే బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో ఎపి మంత్రి రావుల కిషోర్‌బాబు కుమారుడు రావుల సుశీల్ ఈవ్‌టీజింగ్‌కు పాల్పడ్డాడు. ఈ కేసు కూడా రెండు రాష్ట్రాల్లో సంచలనం రేపింది. చివరకు బాధితురాలు నిందితుడికి అనుకూలంగా వ్యవహరించడంతో సదరు మంత్రి కుమారుడు కేసు నుంచి బయటపడ్డాడు. ఈ కేసులో కూడా మహిళ పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేసిందా..లేక పోలీసులే అతనిపై తప్పుడు కేసు పెట్టారా. ఒకవేళ ఆమె తప్పుడు ఫిర్యాదు చేసే చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోలేదు. పేట్‌బషీరాబాద్, బంజారాహిల్స్ ఈ రెండు ఘటనల్లో విఐపి నిందితులు ఉండడంతో పోలీసులు కిమ్మనకుండా కేసును నీరుగార్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజానికి ఇక్కడ వారిపై ఐపిసి 203 సెక్షన్ కింద కేసులు పెట్టాల్సి ఉండే.ఇప్పటికైనా ఇలాంటి కేసుల్లో ఎంతటి పెద్దవాళ్లు ఉన్నా పోలీసులు చట్టప్రకారం నడుచుంటేనే మహిళలపై నేరాలు తగ్గుతాయి.

అసోంలో కొలిక్కివస్తున్న 'వలస' లెక్కలు

- 19 మిలియన్ల మందిని పౌరులుగా గుర్తించిన ఎన్ఆర్‌సి

గౌహతి : అసోంలో అక్రమ వలసదారుల లెక్కలు తేల్చే పనిలో ఉన్న ప్రభుత్వం తొలి అడుగు వేసింది. ఆదివారం అర్ధరాత్రి ఒక జాబితాను విడుదల చేసింది. నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ ఫర్ అసోం సంస్థ 19 మిలియన్ల (కోటి 90 లక్షల) ప్రజలను అసోం వాసులుగా గుర్తిస్తున్నట్లు ప్రకటించింది. మరో 13.9 మిలియన్ల (కోటి 39 లక్షల) వ్యక్తుల పేర్లను పరిశీలిస్తోంది. తొలి జాబితాలో పేర్లు లేని వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా శైలేష్ తెలిపారు. మిగతా దరఖాస్తుల పరిశీలన జరుగుతోందని, తుది జాబితా విడుదల అయ్యే వరకు అందరూ ఓపికతో వేచిచూడాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పటిష్ట భద్రత ఏర్పాటు : ఎన్ఆర్‌సి తుదిజాబితా ఎప్పుడు విడుదల కానుందో స్పష్టంగా తెలియడం లేదు. ఈ ప్రక్రియ అంతా సుప్రీం కోర్టు పర్యవేక్షణలో జరుగుతుందని, మరికొన్ని నెలల్లోనే ముగుస్తుదని కొందరు అధికారులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే రాష్ట్రంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. జాబితాలో పేరు లేని వారు ఆందోళనలకు దిగితే వెంటనే అణిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేసింది. సోమవారం సాయంత్రం వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని అసోం డిజిపి ముఖేష్ సహాయ్ తెలిపారు. డ్రాఫ్ట్ జాబితా ఆన్‌లైన్‌లో విడుదల చేయడం వల్ల అందులో తమ పేరు ఉందో లేదో తెలుసుకోడానికి ప్రజలకు కొంత సమయం పడుతుందని ఆయన అన్నారు. ఎన్ఆర్‌సి కార్యాలయాలకు ప్రజలు తరలి వెళుతున్నారని, మరికొన్ని రోజుల పాటు పోలీసు పర్యవేక్షణ కొనసాగుతుందని ఆయన అన్నారు.

తొలి ప్రాధాన్యత వారికే : 1951ఎన్ఆర్‌సిజాబితాలో పేర్లు ఉన్నవారి కుటుంబీకుల పేర్లను ప్రస్తుత ఎన్ఆర్‌సి జాబితాలో చేర్చుతున్నారు. వారి వద్ద నున్న ఆధారాలు క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కొత్త జాబితాలో వారికి స్థానం కల్పిస్తున్నారు. అదే విధంగా 1971 మార్చి 25 వరకు ఉన్న ఎన్నికల జాబితాలో ఉన్న వారికి కూడా ప్రాధాన్యమిచ్చి కొత్త జాబితాలో చేర్చుతున్నారు.

4200 సెంటర్ల వద్ద పరిశీలన : ఆదివారం అర్ధరాత్రి ఎన్ఆర్‌సి విడుదల చేసిన జాబితాలో తమ పేరు ఉందో లేదో తెలుసుకోడానికి జనాభా ఎన్ఆర్‌సి సెంటర్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వం 4200 ఎన్ఆర్‌సి సెంటర్లను ఏర్పాటు చేసింది. సోమవారం ఉదయం నుంచి ప్రజలు ఎన్ఆర్‌సి సెంటర్ల వద్ద బారులు తీరారు. కాల్ సెంటర్ల ద్వారాగానీ, ఎస్ఎంఎస్ చేయడం ద్వారా గానీ తమ పేర్లను జాబితాలో ఉందో లేదో తెలుసుకోడానికి ప్రజలకు అవకాశం కల్పించారు.

1951 తర్వాత ఇదే తొలిసారి : ఎన్ఆర్‌సిని 1951తర్వాత అప్‌డేట్ చేయడం ఇదే తొలిసారి. 1971మార్చి 25 తర్వాత బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వలస వచ్చే వారి వివరాలను సేకరించేందుకు ఈ ప్రక్రియను చేపడుతున్నారు.1971తర్వాత నుంచి అక్రమ వలసదారులు అసోంలో పాగా వేయడంతో 1980లో ఆ రాష్ట్రంలో ఉద్యమం మొదలయింది. అసోం ఏకత్వానికి ముప్పు వాటిల్లనుందని కొందరు ఉద్యమం లేవదీశారు. ఆరేళ్ల పాటు ఆల్ అస్సాం స్టూడెంట్స్ యూనియన్ (ఎఎఎస్‌యు) చేసిన ఆందోళనల కారణంగా 1985లో కీలక ఒప్పందం జరిగింది. కొంత కాలం పాటు ఆ ఒప్పందం మరుగున పడింది. 2005లో తిరిగి ఆ ఒప్పందంపై చర్చ జరిగింది. ఎఎఎస్‌యుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందం ప్రకారం ఎన్ఆర్‌సిని ఆధునీకరించాలని చేయాలని నిర్ణయించడం జరిగింది. మరో పదేళ్ల పాటు ఎటువంటి పురోగతి కనిపించలేదు. అసోంలో 2016లో బిజెపి ప్రభుత్వం ఏర్పడడంతో ఎన్ఆర్‌సి ఆధునీకరణ పనులలో కదిలిక వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలపై ఎఎఎస్‌యు నాయకుడు సముజ్జల్ భట్టాచార్య సంతోషం వ్యక్తం చేశారు.

కామారెడ్డి బస్టాండ్ వద్ద భారీ అగ్నిప్రమాదం



మన తెలంగాణ/కామారెడ్డి : కామారెడ్డి జిల్లా కేంద్రం లో కొత్త బస్టాండ్ ఎదుట ఉన్న దుకాణాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. సోమవారం రాత్రి జరిగిన ఈ అగ్ని ప్రమాదంలో పార్కింగ్‌లో ఉన్న నాలుగు ద్విచక్ర వాహనాలు, పండ్ల దుకాణం, బట్టల దుకాణం, మొబైల్ దుకాణం పూర్తి దగ్ధమయ్యాయి. ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని భావిస్తున్నారు. అగ్ని ప్రమాదం ఘటన స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అర్పే ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్‌పి శ్వేతారెడ్డి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ప్రమాదంలో ఎంతమేరకు నష్టం వాటిల్లింది, ఎలా జరిగిందనే వివరాలు సేకరిస్తున్నట్లు ఎస్‌పి తెలిపారు

వాహనాలు ఢీ.. ఇద్దరు రైతుల మృతి

మన తెలంగాణ / ఆమనగల్లు : హైదరాబాద్ – శ్రీశైలం ప్రధాన రహదారిపై అదివారం అర్ధరాత్రి కోనాపూర్ గేటు సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు రైతులు మృతి చెందగా, మరో ఇద్దరు డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. ఆమనగల్లు సిఐ పి. రవీందర్ ప్రసాద్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం గుట్టలపల్లి గ్రామానికి చెందిన రైతులు ముత్తయ్య (50), పర్వతాలు(28) బోలేరో వాహనంలో తాము పండించిన కూరగాయాలు తీసుకోని హైదరాబాద్‌లోని మాదన్నపేట్ మండిలో విక్రయించేందుకు ఆదివారం రాత్రి బయలుదేరారు. ఈ క్రమంలో రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం కోనాపూర్ గేటు సమీపంలో వారు ప్రయాణిస్తున్న బోలెరో వాహనాన్ని హైదరాబాద్ నుంచి ఆమనగల్లు వైపు వస్తున్న జిజెన్ వాహనం బలంగా ఢీకొంది. ఆమనగల్లు సిఐ రవీందర్‌ప్రసాద్, ఎస్ఐలు ఎల్లపురెడ్డి రామలింగారెడ్డి, కడ్తాల ఎస్ఐ సుందరయ్యలు ప్రమాద స్థలానికి చేరుకొని తీవ్రంగా గాయపడిన డ్రైవర్లు ఆమనగల్లును చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఉస్మానియాకు తరలించారు. బోలేరో వాహనం క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన రైతుల మృతదేహాలను రెండు గంటల పాటు శ్రమించి జెసిబి సహాయంతో మృతదేహలను వెలికితీశారు. మృతిచెందిన రాములు, పర్వతాలు మృతదేహలను పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆమనగల్లు ఎస్ఐ ఎల్లపురెడ్డి రామలింగారెడ్డి తెలిపారు.

నేడు అరుణ్ సాగర్ అవార్డుల ప్రదానం

మన తెలంగాణ / హైదరాబాద్ : అరుణ్ సాగర్ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డుల ప్రదాన కార్యక్రమం మంగళవారం పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు తెలంగాణ మీడియా అకాడమి చైర్మన్ అల్లం నారాయణ పేర్కొన్నారు. టివి 5 సౌజన్యంతో మీడియా అకాడమి ఈ అవార్డులను అందించనున్న విషయం తెలిసిందే. మంత్రులు హరీష్ రావు, తుమ్మల నాగేశ్వర రావు, శాసన మండలి విప్ పల్లా రాజేశ్వరరెడ్డితో పాటు టివి 5 ఎండి రవీంద్ర నాథ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఇదే ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి, గాయకుడు గోరటి వెంకన్నకు అరుణ్ సాగర్ సాహితీ పురస్కారం అందించనున్నట్లు మీడియా అకాడమి చైర్మన్ తెలిపారు.ఈ సందర్భంగా సోషల్ మీడియా– మెయిన్ స్ట్రీమ్ మీడియా అనే అంశంపై సీనియర్ పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్ ప్రసంగం కూడా ఉంటుందన్నారు.

పుష్కర కాలంగా అదే ఆనవాయితీ

ఎస్ఎంహెచ్ హాస్టల్ విద్యార్థుల నడుమ మంత్రి హరీశ్‌రావు నూతన సంవత్సర వేడుకలు



మన తెలంగాణ/సిద్దిపేట ప్రతినిధి : నూతన సంవత్సర వేడుకలంటే అందరూ మిత్రులు, కుటుంబ సభ్యులతో ఆనందోత్సాహాలతో గడుపుదామనుకుంటారు. ఇందు కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తారు. కానీ మంత్రి హరీశ్‌రావు దీనికి పూర్తిగా విరుద్ధం. ఉద్యమ సమయంలో వున్న రోజుల్లోనూ ప్రభుత్వ కార్యకలాపాల్లో ఊపిరి సలపకుండా వున్న నేటి రోజుల్లోనూ తన ఆనవాయితీ మరచిపోలేదు. దాదాపు పుష్కరకాలంగా నూతన సంవత్సర వేడుకలను సిద్దిపేట ఎస్ఎంహెచ్ విద్యార్థులతో జరుపుకుంటూ వస్తున్నారు. సిద్దిపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత ఎస్ఎంహెచ్ హాస్టల్ విద్యార్థులతో నూతన సంవత్సర వేడుకలను జరుపుకోవడం ప్రారంభించారు. అప్పుడు తెలంగాణ ఉద్యమంలో ఎంత బిజీగా వున్నా డిసెంబరు 31 రాత్రి హరీశ్‌రావు ఎక్కడుంటారంటే సిద్దిపేట ఎస్ఎంహెచ్ హాస్టల్ అని నియోజకవర్గ ప్రజలు చెప్పుకునేంతగా తయారైంది. దాదాపు గత 12 సంవత్సరాలుగా హాస్టల్ విద్యార్థులతో కేక్ కట్‌చేసి వారితో కలసి సహపంక్తి భోజనం చేసి అర్ధరాత్రి వరకు వేడుకల్లో పాల్గొనడమే కాకుండా వారికి కెరీర్ కౌన్సిలింగ్ చేసేవారు. ఈ సందర్భంగా కొందరు ఉన్నతాధికారులను సైతం అక్కడికి రప్పించి వారితో కెరీర్ ఎలా నిర్మించుకోవాలో సలహాలు, సూచనలు ఇప్పించే వారు. ఇదే అనవాయితీని పాటిస్తూ శనివారం సిద్దిపేట ఎస్సీ, ఎస్టీ ఎస్ఎంహెచ్ హాస్టల్ విద్యార్థులతో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. కాగా గత పుష్కరకాలంగా హాస్టల్ విద్యార్థులతోనే నూతన సంవత్సర వేడుకలు జరుపునే విషయం తెలుసుకున్న తడకపల్లి గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు, బిసి హాస్టల్ విద్యార్థులు సైతం తమ వద్దకు రావాలని ఆహ్వానించడంతో మూడు హాస్టళ్లలో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొని వారితో కలసి సహపంక్తి భోజనం చేశారు. బాలికల గురుకుల పాఠశాలలోని నారాయణఖేడ్‌కు చెందిన పదవ తరగతి విద్యార్థిని దివ్య మంత్రి హరీశ్‌రావుతో కలసి ఫోటో దిగాలని ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నానని భావోద్వేగానికి గురై కన్నీళ్లపర్యంతమైంది. వెంటనే మంత్రి హరీశ్‌రావు దివ్యను అనునయించడమే కాకుండా కన్నీళ్లు తుడిచి ఫోటో దిగడం గమనార్హం. మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ ఈ వేడుకలు మూడు హాస్టళ్లలో జరుపుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. తాను ఎంత బిజీగా వున్నా ఏడాదిలో ఒక పూట హాస్టల్ విద్యార్థులతో గడపాలనే ఆనవాయితీని మంత్రి కొనసాగిస్తుండటం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

సుశీల్ కిడ్నాప్ నిందితుల అరెస్టు



మన తెలంగాణ/చర్లపల్లి : డబ్బున్న వారిని ఎంపిక చేసుకుని కిడ్నాప్ చేస్తే పెద్ద ఎత్తున సంపాదించవచ్చనే దుర్బుద్ధితో ఉన్న బృందాన్ని పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. సంచలనం సృష్టించిన బోడుప్పల్ పల్లవి స్కూల్ డైరెక్టర్ కిడ్నాప్ కథను పోలీసులు ఛేదించారు. సోమవారం రాచకొండ పోలీస్ కమిషనర్ పరిధిలోని మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో మల్కాజిగిరి డిసిపి ఉమామహేశ్వర శర్మ, ఎస్ఓటి డిసిపి రఫీక్, ఎసిపి సందీప్‌లతో కలసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. డిసెంబర్ 14 న బోడుప్పల్ పల్లవి స్కూల్ డైరెక్టర్ సుశీల్‌కుమార్ పాఠశాల నుంచి తన నివాసానికి బయలుదేరాడు. సుశీల్ సమీప బంధువు గడ్డి సదానంద్ అలియాస్ నంద్ మరో ఐదుగురు మిత్రులతో కలసి కిడ్నాప్‌కు పథకం వేసుకున్నాడు. సుశీల్ కారును ట్రాఫిక్ పోలీసుల వేషంలో ఉన్న కిడ్నాపర్లు ఆపి సార్ రమ్మంటున్నాడని పిలిచారు. సుశీల్ మూతికి ప్లాస్టర్, వేసి కాళ్లూ చేతులు కట్టేసి మరో కారులో ఎక్కించుకుని వెళ్లారు. రాత్రి అయినా సుశీల్ ఇంటికి రాకపోవడంతో తెలిసిన వారిని విచారించి స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కిడ్నాపర్లు సుశీల్‌ను శామీర్‌పేట్ మండలం కొల్తూర్ వద్ద వదిలిపెట్టారు. రంగంలోకి దిగిన పోలీసులు సుశీల్ కారు బెంగళూర్‌లో ఉందని తెలుసుకుని నిందితులను పట్టుకున్నారు. అసలు సూత్రధారి సుశీల్ సమీప బంధువు గడ్డి సదానంద్ పరారీలో ఉన్నాడు. సల్లాగోని సంతోష్ (42), రాహుల్ (27), ఏరుకల కిరణ్ (26) ఎలూరి నరేష్ (26), ఎండి యునిస్‌ఖాన్ (27)లను అరెస్టు చేసి నిందితుల నుంచి 32 ఎంఎం పిస్టల్, ఆరు బుల్లెట్లు, సుశీల్‌కు చెందిన బంగారు గొలుసు, కిడ్నాప్‌కు వినియోగించిన రెండు కార్లు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

S & D

చిరంజీవికి కృతజ్ఞతలు చెప్పిన పొట్టి వీరయ్య

ఇటీవల కమేడియన్ పొట్టి వీరయ్య ఆర్థిక, ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకొని మెగాస్టార్ చిరంజీవి ఆయనకు రూ.2 లక్షలు ఆర్థిక సహాయం చేసిన సంగతి తెలిసిందే. ఆ మొత్తాన్ని మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ రాజా ఆధ్వర్యంలో అందజేశారు. కాగా సోమవారం ఉదయం పొట్టి వీరయ్య చిరంజీవి ఇంటికెళ్లి స్వయంగా ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ప్రస్తుతం తన ఆరోగ్యం బాగుందని... చిరంజీవి కొండంత అండ మరువలేనిదని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటానని పొట్టి వీరయ్య తెలిపారు. 'మా' అధ్యక్షుడు శివాజీరాజా మాట్లాడుతూ ''పొట్టి వీరయ్య ఆర్థిక, ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని చిరంజీవి మానవతా ధృక్పథంతో ఆయన ఆర్థిక సహాయం చేశారు. దీంతో పొట్టి వీరయ్య కోలుకొని ప్రస్తుతం ఎంతో సంతోషంగా ఉన్నారు''అని చెప్పారు.



ఇక్కడ కాదు బోర్డర్‌లో...



అల్లు అర్జున్

అల్లు అర్జున్, అను ఇమాన్యుయల్ జంటగా వక్కంతం వంశీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా'. కె.నాగబాబు సమర్పణలో రామలక్ష్మీ సినీ క్రియేషన్స్ బ్యానర్‌లో శిరీష శ్రీధర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో అర్జున్, శరత్ కుమార్‌లు ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో రెగ్యులర్ షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ ఇంపాక్ట్‌ను విడుదల చేశారు. ఈ టీజర్‌కు మంచి స్పందన వస్తోంది. 'నీకు సూర్య సోల్జర్... కానీ ప్రపంచానికి సూర్య అంటే యాంగర్' అనే డైలాగ్‌తో ప్రారంభమైన ఈ ఇంపాక్ట్ అందరినీ ఆకట్టుకుంటోంది. టైటిల్‌కు తగ్గట్టుగా పాత్రలో లీనమైపోయి నటించిన అల్లుఅర్జున్ ప్రేక్షకులను అలరిస్తున్నాడు. అల్లు అర్జున్ నటన, దర్శకుడి పనితీరు, కెమెరామెన్ విజువల్స్‌తో పాటు డైలాగ్స్ అందరినీ ఆకట్టుకుంటున్నాయి. 'చచ్చిపోతాను కానీ ఇక్కడ కాదు బోర్డర్‌లో చచ్చిపోతాను' అనే డైలాగ్ అభిమానులను అలరిస్తోంది. అన్ని కార్యక్రమాలను పూర్తిచేసిన ఏప్రిల్ 27న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. బాలీవుడ్ సంగీత ద్వయం విశాల్‌శేఖర్ ఈ చిత్రానికి అద్భుతమైన సంగీతాన్ని అందిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః రాజీవ్ రవి, ఫైట్స్ః రామ్‌లక్ష్మణ్, ఎడిటర్ః కోటగిరి వెంకటేశ్వరరావు, సాహిత్యంః రామజోగయ్య శాస్త్రి.


రానా

హాథీ మేరే సాథీ

సాధారణంగా ఏదైనా హిట్టు సినిమా వచ్చిందంటే అందులోని హీరోలకు ఎక్కువ డిమాండ్ వస్తుంది. కానీ విలన్ పాత్రను కూడా హీరోల రేంజులో చూపించే రాజమౌళి సినిమాలు అయితే విలన్లకు కూడా అమాంతం డిమాండ్ పెంచేస్తాయి. అదేవిధంగా 'బాహుబలి'లో భల్లాలదేవ పాత్రలో భయపెట్టిన రానాకు భారీ క్రేజ్ వచ్చి ఇప్పుడు బిజీ ఆర్టిస్టు అయిపోయాడు. ప్రస్తుతం రానా వరుసగా సినిమాలు చేస్తూ దూసుకుపోతున్నాడు. వాటిలో 'హాథీ మేరే సాథీ' సినిమా ఒకటి. 1971లో నాటి బాలీవుడ్ సూపర్‌స్టార్ రాజేష్ ఖన్నా హీరోగా ఈ టైటిల్‌తో వచ్చిన హిందీ సినిమా ఓ క్లాసిక్ మూవీగా నిలిచింది. దానికి రీమేక్‌గా వస్తున్న ఈ కొత్త సినిమాను తమిళ దర్శకుడు ప్రభు సోలోమాన్ రూపొందిస్తున్నాడు. ఈ సినిమాలో బాందేవ్ పాత్రను పోషిస్తున్నాడు రానా. ఏనుగు తొండాన్ని పట్టుకొని నిలబడి ఉన్న రానా ఫస్ట్‌లుక్‌ను కొత్త సంవత్సరం సందర్భంగా రిలీజ్ చేశారు. గతంలో గజరాజు (తమిళంలో 'కుంకి' సినిమా)ను తీసిన ప్రభుకు ఏనుగులు అంటే ప్రాణం. అందుకే అతను రూపొందిస్తున్న ఈ సినిమాపై అంచనాలు బాగానే ఉన్నాయి. ఇక తెలుగులో ఈ సినిమాను సురేష్ ప్రొడక్షన్స్ వారు రిలీజ్ చేయబోతున్నట్లు తెలిసింది.


నాగార్జున



నాగ్ @58

అక్కినేని నాగార్జున ప్రస్తుతం ఎంతో హ్యాపీగా ఉన్నారు. టాలీవుడ్‌లోని నలుగురు సీనియర్ స్టార్ హీరోలలో ఒకరైన ఆయన ఇప్పుడు తన వారసులను హీరోలుగా స్థిరపరిచే ప్రయత్నంలో సక్సెస్ కావడంతో పాటు ఆయన కూడా మంచి జోరు మీద ఉన్నాడు. ఇటు సినిమాల పరంగానే కాకుండా వ్యక్తిగతంగా కూడా నాగార్జునకు 2017 చాలా ముఖ్యమైన సంవత్సరం. 2017లో తన జీవితంలోని ముఖ్య ఘట్టాలతో ఓ పోస్టర్‌ను రూపొందించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు నాగార్జున. ఓం నమో వెంకటేశాయ చిత్రం నుంచి అఖిల్ 'హలో' ఆడియో ఫంక్షన్, రారండోయ్ వేడుక చూద్దాం మూవీ, నాగచైతన్యసమంతల నిశ్చితార్థం, సంగీత్, వారి పెళ్లి, సమంతతో కలిసి నటించిన 'రాజుగారి గది 2' పోస్టర్, అమలతో ఓ సందర్భం, సైమా ఈవెంట్‌లో అఖిల్ పాడడం, అన్నపూర్ణ స్టూడియోస్‌లో అగ్ని ప్రమాదంతో పాటు షర్ట్ విప్పేసి తన ఫిట్‌నెస్‌ను తెలియజేసే ఫొటోను కూడా ఈ పోస్టర్‌లో అమర్చారు ఈ సీనియర్‌స్టార్. ఇక 58 ఏళ్ల వయసులో దాదాపు సిక్స్ ప్యాక్‌లో ఎంతో ఫిట్‌గా దర్శనమిచ్చాడు నాగార్జున. అయితే ఈ సిక్స్ ప్యాక్ లుక్‌ను రామ్‌గోపాల్‌వర్మతో చేస్తున్న పోలీస్ స్టోరీ బ్యాక్‌డ్రాప్ సినిమాలో బయటపెడతారో లేదా నానీతో కలిసి చేయనున్న మల్టీస్టారర్ మూవీలో ప్రదర్శిస్తాడో చూడాలి.

జనవరి 26న భాగమతి

స్టార్ బ్యూటీ అనుష్క ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'భాగమతి'. అరుంధతి, బాహుబలి, రుద్రమదేవి వంటి హిట్ సినిమాలతో సత్తాచాటిన ఆమె మరోసారి ఈ చిత్రంతో తన టాలెంట్‌ను చూపించబోతోంది. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని అనుష్క కొత్త లుక్‌ను విడుదల చేసింది సినిమా యూనిట్. ఈ అందాలభామ కొత్త లుక్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇదివరకే విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్, టీజర్‌తో అనుష్క అందరినీ భయపెట్టేసింది. వీటితో ఈ సినిమాపై అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. తాజాగా విడుదలైన కొత్త లుక్‌లో అనుష్క ఒక యోగిని తరహాలో ఉంది. దర్శకుడు అశోక్ ఈ సినిమాలో ఏదో మ్యాజిక్ చేశాడనే అనిపిస్తోంది. పలు సినిమాలతో పోటీపడుతూ రిపబ్లిక్ డే సందర్భంగా జనవరి 26న విడుదలకావడానికి 'భాగమతి' సిద్ధమవుతోంది. 'బాహుబలి' తర్వాత అనుష్క కనిపించే ఈ సినిమా కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


అనుష్క

ముచ్చటైన జంట

డా. మోహన్‌బాబు ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'గాయత్రి'. ఈ చిత్రంలో విష్ణు మంచు ఓ పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తుండగా ఆయన సరసన శ్రియా హీరోయిన్‌గా చేస్తోంది. తాజాగా కొత్త సంవత్సరం సందర్భంగా విష్ణు, శ్రియాలు కలిసి ఉన్న ఓ పోస్టర్‌ను విడుదల చేసింది చిత్ర బృందం. క్రిస్మస్‌కు విడుదల చేసిన 'గాయత్రి' ఫస్ట్‌లుక్ పోస్టర్‌లో మోహన్‌బాబు పవర్‌ఫుల్ లుక్‌కు విశేష స్పందన వచ్చింది. ఇప్పుడు విష్ణు, శ్రియాలు ముచ్చటైన జంటగా కనువిందు చేస్తున్న పోస్టర్‌కు కూడా మంచి స్పందన వస్తోంది. దీంతో ఈ చిత్రంలో మాస్ యాక్షన్‌తో పాటు మంచి కుటుంబ కథ కూడా ఉంటుందని అర్థమవుతోంది. మదన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా ఎస్.ఎస్.తమన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. అనసూయ భరద్వాజ్, నిఖిల విమల్, బ్రహ్మానందం ఇతర ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. ఫిబ్రవరి 9న విడుదలకానున్న ఈ చిత్రాన్ని డా.మోహన్‌బాబు తన శ్రీలక్ష్మీ ప్రసన్న పిక్చర్స్ బ్యానర్‌పై నిర్మిస్తుండగా అరియానా, వివియానా, విద్యా నిర్వాణ సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః సర్వేశ్ మురారి, ఎడిటర్ః ఎం.ఆర్.వర్మ, ఫైట్స్ః కనల్ కణ్ణన్, కొరియోగ్రఫీః ప్రేమ్ రక్షిత్, గణేష్ ఆచార్య.


మంచు విష్ణు, శ్రియా

క్రేజీ కాంబినేషన్‌లో...


కొత్త చిత్రం ప్రారంభ వేడుకలో శివకుమార్, సూర్య, సెల్వరాఘవన్, ఎస్.ఆర్.ప్రభు, ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు తదితరులు

గజిని, సింగం చిత్రాల హీరో సూర్య, ఫిదా, ఎంసిఎల చిత్రాల హీరోయిన్ సాయిపల్లవి జంటగా 7జి బృందావన కాలనీ, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే చిత్రాల దర్శకుడు సెల్వ రాఘవన్ దర్శకత్వంలో వస్తున్న కొత్త చిత్రం సోమవారం ప్రారంభమైంది. 'ఖాకి' వంటి హిట్ చిత్రాన్ని అందించిన డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ఎస్.ఆర్.ప్రభు, ఎస్.ఆర్.ప్రకాష్‌బాబులు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ చిత్ర ప్రారంభోత్సవంలో శివకుమార్, సూర్య, కార్తీ, సెల్వ రాఘవన్‌తో పాటు చిత్ర బృందం పాల్గొంది. ఈ సందర్భంగా హీరో సూర్య మాట్లాడుతూ ''నా గత 35 చిత్రాలకు భిన్నంగా ఈ చిత్రం ఉంటుంది. సెల్వ రాఘవన్ చెప్పిన సబ్జెక్ట్ చాలా ఆసక్తికరంగా ఉంది. కమర్షియల్ అంశాలన్నీ ఉంటూ అందరినీ ఆకట్టుకునే చిత్రమిది. ఇందులో హీరోయిన్ సాయిపల్లవి క్యారెక్టర్‌కు కూడా మంచి ప్రాధాన్యత ఉంటుంది''అని అన్నారు. దర్శకుడు సెల్వ రాఘవన్ మాట్లాడుతూ ''సూర్యలాంటి బహుముఖ ప్రతిభ కలిగిన హీరోతో ఈ సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ కథకు సూర్య సరిగ్గా సరిపోతారని సినిమా చూశాక అందరికీ తెలుస్తుంది''అని తెలిపారు. నిర్మాతలు ఎస్.ఆర్.ప్రకాష్‌బాబు, ఎస్.ఆర్.ప్రభు మాట్లాడుతూ ''సూర్య, సాయిపల్లవి, సెల్వ రాఘవన్ కాంబినేషన్‌లో వస్తున్న మంచి సినిమా ఇది. సూర్య కెరీర్‌లో ఓ పెద్ద హిట్ సినిమాగా దీన్ని సెల్వ రాఘవన్ రూపొందిస్తున్నారు. ఈనెల 18న సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించి దీపావళికి ఈ చిత్రాన్ని విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం''అని చెప్పారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీః శివకుమార్ విజయన్, ఎడిటింగ్ః జి.కె.ప్రసన్న, ఆర్ట్ః ఆర్.కె.విజయ్ మురుగన్.

ఛలో పెద్ద హిట్ సాధిస్తుంది


'ఛలో' రెండవ పాట విడుదల కార్యక్రమంలో నాగశౌర్య, గౌతమ్, నరేష్ బి.ఎ.రాజు, శంకర్ ప్రసాద్ మల్పూరి, వెంకీ కుడుముల తదితరులు

ఐరా క్రియేషన్స్ బ్యానర్‌పై నాగశౌర్య, రష్మిక మండన్న హీరో హీరోయిన్లుగా రూపొందుతున్న చిత్రం 'ఛలో'. వెంకీ కుడుముల దర్శకత్వంలో శంకర్ ప్రసాద్ మాల్పూరి సమర్పణలో ఉషా మాల్పూరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కొత్త సంవత్సరం సందర్భంగా సినిమాలోని రెండో పాటను విడుదల చేశారు. సీనియర్ పాత్రికేయులు పసుపులేటి రామారావు, బి.ఎ.రాజు ఈ పాటను రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా బి.ఎ.రాజు మాట్లాడుతూ ''2018 సంవత్సరానికి 'ఛలో' సినిమా ఘనంగా స్వాగతం పలుకుతుంది. ఇదివరకే విడుదలైన తొలి పాట పెద్ద హిట్ అయింది. రెండో పాట కూడా ఎంతో బావుంది. కాసర్ల శ్యామ్ ఈ పాటను ఎంతో చక్కగా రాశారు. ఈ సినిమా పెద్ద హిట్ సాధించి నాగశౌర్య, వెంకీ కుడుములకు మంచి పేరు తెస్తుంది''అని అన్నారు. సీనియర్ నరేష్ మాట్లాడుతూ ''టాలీవుడ్‌లో ఇప్పుడు స్వర్ణ శకం ప్రారంభమైంది. అందరూ టాలీవుడ్ వైపు ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ స్క్రిప్ట్ విన్నప్పుడే సినిమా పెద్ద హిట్ అవుతుందని చెప్పాను. రెండో పాటకు కూడా మంచి స్పందన వస్తోంది. ఈ సినిమా విడుదలకు ముందే థియేట్రికల్ రైట్స్‌తో పాటు శాటిలైట్ రైట్స్ కూడా అమ్ముడై పోవడం ఆనందదాయకం''అని చెప్పారు. చిత్ర సమర్పకుడు శంకర్ ప్రసాద్ మాల్పూరి మాట్లాడుతూ ''ఈ కొత్త ఏడాది అందరికీ మంచి జరగాలి. మా సినిమా 'ఛలో'ను ఫిబ్రవరి 2న పెద్ద ఎత్తున విడుదల చేస్తున్నాం''అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు వెంకీ కుడుముల మాట్లాడుతూ ''తొలి పాటకు మేం ఊహించిన దానికంటే చాలా మంచి స్పందన వచ్చింది. రెండో పాటకు కూడా మంచి స్పందన వస్తోంది. అసోసియేట్ డైరెక్టర్ అయిన నేను 2017లో డైరెక్టర్‌గా మారాను. 2018లో మంచి పేరున్న డైరెక్టర్ అవుతానని అనుకుంటున్నాను. ఇక 'ఛలో' సినిమా సూపర్ హిట్ అవుతుంది'' అని అన్నారు. హీరో నాగశౌర్య మాట్లాడుతూ ''సినిమా చాలా బాగా వచ్చింది. తప్పకుండా 'ఛలో' పెద్ద సక్సెస్ అవుతుందని నమ్మకంగా ఉన్నాం. నిర్మాతలైన మా తల్లిదండ్రులు సినిమా నిర్మాణంలో ఎక్కడా రాజీపడలేదు. సాగర్ మహతి అద్భుతమైన సంగీతాన్ని అందించారు. అలాగే సాయిశ్రీరాం ఇచ్చిన ధైర్యంతోనే మే ప్రొడక్షన్ హౌస్‌ను ప్రారంభించాం. వెంకీ సినిమాను చక్కగా డైరెక్ట్ చేశాడు. తప్పకుండా సినిమా అందరికీ నచ్చుతుంది''అని అన్నారు. సీనియర్ నరేష్, పోసాని కృష్ణమురళి, రఘుబాబు, వెన్నెల కిషోర్, మైమ్ గోపి తదితరులు నటించిన ఈ చిత్రానికి ఆర్ట్ః రాము అరసవిల్లి, ఎడిటింగ్ః కోటగిరి వెంకటేశ్వరరావు, తమ్మిరాజు, సంగీతంః మహతి స్వరసాగర్, సినిమాటోగ్రఫీః సాయి శ్రీరామ్.

సిద్ధు, సీరత్‌కపూర్ జంటగా...

జస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ క్రియేషన్స్ పతాకంపై తేజ డైమండ్స్ అధినేత శ్రీనివాస్ వంగల నిర్మాతగా రచయిత శ్రీధర్ సీపాన దర్శకుడిగా పరిచయమవుతున్న చిత్రం 'బృందావనమది అందరిది'. చిత్ర దర్శకుడు శ్రీధర్ సీపాన మాట్లాడుతూ ''నేను రాసుకున్న కథకు కొత్త నటీనటులు కావాలనుకున్నాను. ప్రధాన తారాగణం నలుగురు ఆర్టిస్టులు మినహా మిగతా వారినందరినీ కొత్త వాళ్లను తీసుకోవడం జరిగింది. పలు ఆడిషన్స్ నిర్వహించి కొత్త నటీనటులను ఎంపికచేసుకున్నాం. ఒకటి, రెండు రోజుల్లో ఎంపికైన నటీనటులకు మెసేజ్‌లు పంపించడం జరుగుతుంది. 'గుంటూర్ టాకీస్' ఫేమ్ సిద్ధును సినిమాలో హీరోగా ఎంపికచేశాం. నా కథలోని క్యారెక్టర్‌కు అతను సరిగ్గా సరిపోతాడు, రెండవ కీలక పాత్రకు ప్రముఖ నిర్మాత లగడపాటి శ్రీధర్ అబ్బాయి విక్రమ్‌ను తీసుకున్నాం. రుద్రమదేవి, రేసుగుర్రం, పటాస్‌లో బాల నటుడు విక్రమ్ తన నటనతో ఆకట్టుకున్నాడు. 'రన్ రాజా రన్' ఫేమ్ సీరత్‌కపూర్‌ను హీరోయిన్‌గా తీసుకున్నాం. తన గ్లామర్ సినిమాకు ప్లస్ అవుతుంది. నాలుగవ ప్రధాన నటునిగా 30 ఇయర్స్ పృథ్వీని తీసుకోవడం జరిగింది. ఈ నలుగురు నటులు సినిమాకు మెయిన్ పిల్లర్లుగా ఉంటారు. ఇక డిసెంబర్ 29 నుండి సినిమా రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో మొదలైంది. సంక్రాంతి పండుగకు సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేస్తాము. ఇక ఈ పండుగకు చిన్న గ్యాప్ తీసుకొని జనవరి 20 నుండి మళ్లీ షూటింగ్‌ను ప్రారంభిస్తాం''అని అన్నారు.


సిద్ధు, సీరత్ కపూర్, పృథ్వీ, శ్రీధర్ సీపాన, శ్రీనివాస్ వంగల తదితరులు


నయనతార

మీడియా వల్లే గొప్ప స్థితికి చేరుకున్నా

సౌత్‌లో స్టార్ హీరోయిన్‌గా తిరుగులేని క్రేజ్‌ను సంపాదించిన బ్యూటీ నయనతార. ప్రస్తుతం ఆమె చేతినిండా సినిమాలతో ఖాళీ లేకుండా బిజీ బిజీగా ఉంటోంది. 'సైరా... నరసింహారెడ్డి'లో చిరంజీవితో కలిసి నటించడానికి సిద్ధమవుతోంది ఈ భామ. అయితే నయనతార తాజాగా మీడియాను ప్రశంసిస్తూ రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అభిమానుల ప్రేమ వల్లే ఇంత ఉన్నత స్థితికి చేరుకున్నానని చెప్పిన ఆమె తనను గొప్ప స్థితికి తీసుకెళ్లడంలో మాత్రం మీడియా మిత్రులే కీలక పాత్ర పోషించారని పేర్కొంది. ఈ లేఖ గురించి ఇప్పుడు కోలీవుడ్‌లో చర్చ జరుగుతోంది. ఇంతవరకు ఏ హీరోయిన్ కాదు కదా హీరో సైతం ఇలా మీడియాకు పబ్లిక్‌గా థాంక్స్ చెప్పిన దాఖలాలు లేవు. నయనతార ఇటీవల తమిళంలో నటించిన 'అర్రం' చిత్రం సూపర్ హిట్ అయింది. ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీని అభిమానులు అద్భుతంగా ఆదరించారు. మీడియా కూడా బాగా సపోర్ట్ చేసింది. నీటి సమస్యను పరిష్కరించే జిల్లా కలెక్టర్‌గా నయనతార నటన ప్రతి ఒక్కరి చేత శభాష్ అనిపించింది. దీన్ని తెలుగులో 'కర్తవ్యం' పేరుతో డబ్ చేయగా త్వరలో ఈ చిత్రం విడుదలకానుంది. ఇక నయనతార నటించిన 'జై సింహా' చిత్రం ఈనెల 12న విడుదలకానుంది. 'సైరా..' షూటింగ్ కోసం ఇదే నెల రెండవ వారంలో సెట్స్‌లోకి అడుగుపెడుతోంది ఈ భామ. దీంతో సౌతిండియన్ టాప్ స్టార్ హీరోలు అందరితో కలిసి నటించిన హీరోయిన్‌గా అరుదైన రికార్డును నయనతార సొంతం చేసుకోనుంది.

మన తెలంగాణ
9 హైదరాబాద్ మంగళవారం 2, జనవరి 2018
www.manatelangana.news



2018లో 2 లక్షల ఐటి ఉద్యోగాలు

న్యూఢిల్లీ: గత ఏడాదిలో దేశీయంగా ఉపాధి అవకాశాలు ఆశించినంతగా లేవు. అయితే కొత్త సంవత్సరం 2018లో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటాయని, ప్రత్యేకించి ఐటీ పరిశ్రమలో 2 లక్షల వరకు నియామకాలు జరగనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. కృత్రిమ మేధస్సు వంటివి రానున్న నేపథ్యంలో ఉపాధి తగ్గనుందనే ఆందోళనలు ఉన్నాయి. అయినప్పటికీ ఇవే అంశాల్లో కొత్త ఉద్యోగాలు సృష్టి ఉండదనుందని వారు అంటున్నారు. ఇతర రంగాల మాట ఎలా ఉన్నా మొబైల్ తయారీ, ఫైనాన్స్ టెక్నాలజీ వంటి రంగాల్లో స్టార్టప్ సంస్థలు విపరీతంగా పెరుగుతాయని అంటున్నారు. దీంతో ఉపాధి కల్పన వేగం పుంజుకుంటుందని టీమ్‌లీజ్ సర్వీసెస్ ఐటీ స్టాఫింగ్ జనరల్ మేనేజర్ అల్కా ధింగ్రా పేర్కొన్నారు. ఆర్థిక సేవలు, డిజిటల్ వ్యాపారాల్లో మెరుగుదల ఉంటుందని, ప్రత్యేకించి డిజిటలీకరణ, ఆటోమేషన్‌లో పెట్టుబడులు పెరుగుతాయని తెలిపారు. పెట్టుబడుల వాతావరణం బాగుండి వ్యాపారాభివృద్ధి జరుగుతుందని ఆయన అన్నారు. 2018లో 20 శాతం కొత్త సంస్థలు పెరిగి ఉద్యోగ కల్పన ఊపందుకుంటుందని పేర్కొన్నారు. భారత ఐటీ రంగం డిజిటల్ నైపుణ్యాలు అవసరమైన 1.8 నుంచి 2 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టిస్తుందని అంచనా వేశారు.

విద్యుత్ కేంద్రాలకు తగినంత బొగ్గుసరఫరా



మన తెలంగాణ / హైదరాబాద్ : విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు తగినంత బొగ్గును సరఫరా చేసేందుకు సింగరేణి సంస్థ సిద్దంగా ఉందని ఆ సంస్థ సిఎండి ఎన్. శ్రీధర్ తెలిపారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి, పరిశ్రమలకు 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి సరఫరాతో పాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 9 నెలల కాల వ్యవధిలో సింగరేణి సాధించిన ప్రగతిపై సిఎండి శ్రీధర్ సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం 24 గంటల విద్యుత్ సరఫరా ప్రకటించిన నేపథ్యంలో సింగరేణితో బొగ్గు సరఫరా ఒప్పందం గల అన్ని థర్మల్ విద్యుత్ కేంద్రాలకు, ఇతర పరిశ్రమలకు ఏ మాత్రం బొగ్గు కొరత రాకుండా పని చేయాలని ఆయన సింగరేణి కార్మికులకు సూచించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సిఎండి శ్రీధర్ ఈ మేరకు విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.


విప్రో భాగస్వామ్యంతో మహీంద్రా కనెక్ట్ ఫస్ట్ సేవలు



మన తెలంగాణ / హైదరాబాద్ : దేశంలో మల్టీ బ్రాండ్ ప్రీ ఓన్డ్ కార్ల సమస్యలను పరిష్కరించేందుకు మహీంద్రా సంస్థ ''కనెక్ట్ ఫస్ట్''ను ప్రారంభించకున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. విప్రో లిమిటెడ్ భాగస్వామ్యంతో దేశ వ్యాప్తంగా 1500లకు పైగా మహీంద్రా ఫస్ట్ చాయిస్ వీల్స్ లిమిటెడ్, మరో 700 ఫ్రాంచైజీ ఔట్‌లెట్ల ద్వారా ఫస్ట్ కనెక్ట్ కార్యక్రమాలు వాహన యజమానులకు అందుబాటులో ఉంటాయని తెలిపింది. విప్రో ఇండియా బిజినెస్ యూనిట్ సీనియర్ వైస్ ప్రసిడెంట్ ఏవి. శ్రీనాథ్, మహీంద్రా ఫస్ట్ ఛాయిస్ వీల్స్ ఎండి, సిఈవో డా. నాగేంద్ర పల్లె ఈ మేరకు ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. వాహన యజమానికి సంపూర్ణ భద్రత, మెయింటెనెన్స్, డ్రైవింగ్ యనలిస్టిక్స్ తదితర సేవలను కనెక్ట్ ఫస్ట్ ద్వారా అందించనున్నారు. కనెక్ట్ ఫస్ట్ కోసం వినియోగదారులు రూ. 7999 చెల్లించి ఏడాది పాటు యాప్‌ను సబ్‌స్రైబ్ చేసుకోవాల్సి ఉంటుంది.

ఎస్‌బిఐ తీపికబురు

రుణాలపై 30 బేసిస్ పాయింట్ల వడ్డీ రేటు తగ్గింపు



న్యూఢిల్లీ: దేశీయ అతిపెద్ద ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బిఐ రుణగ్రహీతలకు కొత్త సంవత్సరం తీపి కబురు వినిపించింది. రుణాలపై వడ్డీ రేట్లను 30 బేసిస్ పాయింట్ల మేరకు తగ్గించింది. ఈ కొత్త వడ్డీ రేట్లు జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయని ప్రకటించింది. ప్రస్తుతం కస్టమర్లకు 8.95 శాతం వడ్డీ రేటు ఉండగా, ఇప్పుడు ఇది 8.65 శాతానికి తగ్గనుంది. బిపిఎల్‌ఆర్ (బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేట్) 13.70 శాతం నుంచి 13.40 శాతానికి తగ్గనుంది. బ్యాంక్ తీసుకున్న ఈ నిర్ణయంతో 80 లక్షల మంది కస్టమర్లకు ప్రయోజనం పొందనున్నారని ఎస్‌బిఐ రిటైల్, డిజిటల్ బ్యాంకింగ్ మేనేజింగ్ డైరెక్టర్ పికె గుప్తా తెలిపారు. 2016 ఏప్రిల్‌కు ముందు బేస్ రేట్ ఆధారంగా రుణాలు తీసుకున్న వారికి ఈ తగ్గింపు వర్తిస్తుంది. కొత్త కస్టమర్లు అలాగే ఎస్‌బిఐ వైపు చూస్తున్న ఇతర కస్టమర్లకు గృహ రుణ ప్రాసెసింగ్ ఫీజుపై కొనసాగుతున్న రద్దును కూడా 2018 మార్చి 31 వరకు ఎస్‌బిఐ(స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా) పొడిగించింది. బ్యాంకు తీసుకున్న నిర్ణయంతో బేస్ రేట్ ఆధారంగా గృహ, విద్యా రుణాలు తీసుకున్న వారికి ఉపశమనం కలుగుతుంది. ఇంతకుముందు గత ఏడాది సెప్టెంబర్‌లో 9 శాతంగా ఉన్న వడ్డీ రేటును 8.95 శాతానికి తగ్గించింది. 2016 ఏప్రిల్ తర్వాత రుణాలు తీసుకున్న వారికి నిధుల వ్యయ ఆధారిత రుణ రేటు (ఎంసిఎల్ఆర్) వర్తిస్తుంది. అంటే అంతకు ముందు బేస్ పాయింట్లు ఆధారంగా రుణాలు తీసుకున్న వారికి ఈ తగ్గింపు వర్తిస్తుంది. చాలా వరకు బ్యాంకులు ఎంసిఎల్ఆర్ విధానాన్నే అనుసరిస్తున్నాయి.

ఐదు నెలల గరిష్ఠానికి రూపాయి విలువ



న్యూఢిల్లీ: రూపాయి విలు వ కొత్త సంవత్సరం తొలి రోజు పుంజుకుంది. డాలర్‌తో పోలిస్తే రూపా యి మారకం విలువ 63.65తో ఐదు నెలల గరిష్ఠానికి చేరుకుంది. 2017 ఆగస్టు నుంచి డాలర్‌పై రూపాయి విలువ ఇంతగా పెరగడం ఇదే.. శుక్రవారం రోజు డాలర్‌పై రూపాయి 21 పైసలు పెరిగి 63.87 వద్ద ముగిసింది. ఇప్పుడు మరింతగా పుంజుకుని 41 పైసలు ఎగిసి 63.63 స్థాయిని చేరుకుంది. అంతేకాదు 2018 సంవత్సరంలో రూపాయి విలువ మరింత పుంజుకుంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. అమెరికన్ కరెన్సీ డాలర్‌లో బ్యాంకర్లు, ఎగుమతిదారులు భారీ అమ్మకాలు తదితర కారణాలు దేశీయ కరెన్సీకి సానుకూలంగా మారాయని నిపుణుల అంచనా వేస్తున్నారు. అటు దేశీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి రూపాయికి మద్దతు లభించింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు భారీ నష్టాల్లో ముగిసినప్పటికీ మార్కెట్లు స్థిరంగా ఉండడం రూపాయికి లాభించింది. 2017లో రూపాయి 6 శాతం పెరిగిన విషయం తెలిసిందే. అలాగే డాలర్ కూడా ఇతర గ్లోబల్ కరెన్సీలతో పోలిస్తే లాభాలను అందిస్తోంది. మరోవైపు 2018 మొదటి త్రైమాసికంలో రూపాయి 63 స్థాయికి చేరుతుందని ఫారెక్స్ సలహా సంస్థ ఐఎఫ్‌ఎ గ్లోబల్ పేర్కొంది. 2018 సంవత్సరం రూపాయికి సానుకూలంగా ఉండనుందని ఫారెక్స్ ఎడ్వైజరీ సంస్థ పేర్కొంది.

2018 తొలి రోజు నష్టాలు



ముంబయి: కొత్త సంవత్సరం తొలి రోజు స్టాక్‌మార్కెట్లకు నిరాశే ఎదురైంది. మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం, జాగ్రత్త వహించడంతో సూచీలు తీవ్ర ఒడిదుడుకుల మధ్య భారీగా నష్టపోయాయి. సెన్సెక్స్ కీలక 34 వేల మార్క్ నుంచి కింద పడిపోయింది. అదే సమయంలో నిఫ్టీ కూడా 10,500 పాయింట్ల స్థాయి నుంచి దిగువకు చేరింది. ఐటీ, బ్యాంకింగ్, ఆటోమొబైల్ షేర్లు కూడా బలహీనంగా ఉండటం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 244 కోల్పోయి 33,813 పాయింట్ల వద్ద స్థిరపడింది. అయితే ఉదయం స్వల్ప లాభాలతో ప్రారంభమైన సూచీలు ఆ వెంటనే నష్టాల్లోకి జారుకుని, మళ్లీ కోలుకోలేకపోయాయి. నిఫ్టీ కూడా 95 పాయింట్ల నష్టంతో 10,435 వద్ద ముగిసింది. ప్రధానంగా ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, కోల్‌ఇండియా, సిప్లా, సన్‌ఫార్మా, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ స్వల్పంగా లాభపడ్డాయి. భారతీ ఇన్‌ఫ్రాటెల్, టిసిఎస్, భారత్ పెట్రోలియం, ఇండస్‌ఇండ్ బ్యాంక్, బాష్ లిమిటెడ్ షేర్లు నష్టపోయాయి. రియల్టీ నామమాత్రంగా 0.2 శాతం బలపడగా, మిగిలిన అన్ని రంగాలూ బలహీనపడ్డాయి. ప్రధానంగా బ్యాంకింగ్, ఆటో, ఐటి, ఎఫ్‌ఎంసిజి, మెటల్ 10.5 శాతం మధ్య నష్టపోయాయి. నిఫ్టీ దిగ్గజాలలో ఇన్‌ఫ్రాటెల్, టిసిఎస్, బిపిసిఎల్, ఇండస్‌ఇండ్, బాష్, టాటా మోటార్స్, హెచ్‌యూఎల్, ఒఎన్‌జిసి, వేదాంతా, హెచ్‌సిఎల్ టెక్ 2.31.5 శాతం మధ్య క్షీణించాయి. ఐబి హౌసింగ్, కోల్ ఇండియా, సిప్లా, సన్ ఫార్మా, ఐటిసి 20.5 శాతం మధ్య బలపడ్డాయి. కాగా బిఎస్‌ఇలో ట్రేడైన మొత్తం షేర్లలో 1637 లాభపడగా, 1231 షేర్లు నష్టపోయాయి. నగదు విభాగంలో శుక్రవారం విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పిఐ) రూ. 595 కోట్లను ఇన్వెస్ట్‌చేయగా, దేశీ ఫండ్స్(డిఐఐ) కూడా రూ.461 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేశాయి. గతేడాదిలో స్టాక్‌మార్కెట్లు మదుపర్లకు మంచి రాబడిని ఇచ్చాయి. 2018లో మార్కెట్లు దూసుకెళ్తాయని, పలు స్టాక్స్ మంచి లాభాలను ఇవ్వనున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు.

కారు సేల్స్‌లో రెండంకెల వృద్ధి

న్యూఢిల్లీ: ఆటో దిగ్గజం మారుతీ సుజుకీ ఇండియా, హోండా కార్స్ ఇండియా కంపెనీలు డిసెంబర్‌లో ప్యాసింజర్ వాహనాల అమ్మకాల్లో దుమ్మురేపాయి. వేగవంతమైన సేల్‌తో రెండంకెల వృద్ధిని నమోదు చేశాయి. మరోవైపు హుందాయ్ మోటార్ ఇండియా దేశీయంగా గత నెలలో స్వల్పంగా సేల్స్ చేపట్టింది. అలాగే యుటిలిటీ వెహికిల్ దిగ్గజం మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం)లు డిసెంబర్‌లో దేశీయంగా ప్యాసింజర్ వాహనాల సేల్స్ 7 శాతం క్షీణించాయి.

పెరిగిన మారుతీ, హోండా కంపెనీల అమ్మకాలు



మారుతీ అమ్మకాల్లో 10 శాతం వృద్ధి

ఇక దేశీయ కారు తయారీ దిగ్గజం మారుతీ సుజుకీ డిసెంబరు నెల అమ్మకాల్లో 10.3 శాతం వృద్ధి సాధించి 1,30,066 యూనిట్లను విక్రయించింది. 2016 డిసెంబరులో మారుతి అమ్మకాలు 1,17,908 యూనిట్లుగా ఉన్నాయి. దేశీయ అమ్మకాల్లో 12శాతం వృద్ధి నమోదు చేసి 1,19,286 యూనిట్లను విక్రయించినట్లు మారుతి సుజుకీ ఓ ప్రకటనలో తెలిపింది. ఆల్టో, వేగాన్ ఆర్ లాంటి మినీ సెగ్మెంట్ కార్ల విక్రయాలు 2 శాతం పెరిగి 31,146 యూనిట్లుగా ఉన్నాయి. ఇక కాంపాక్ట్ సెగ్మెంట్‌లోని స్విఫ్ట్, ఎస్టిలో, డిజైర్, బాలెనో కార్లు వినియోగదారులను ఎక్కువగా ఆకట్టుకున్నాయి. గత నెలలో ఈ కార్లు 53,336 యూనిట్లు సేల్ అయ్యాయి. మధ్య శ్రేణి వాహనమైన మారుతి సియాజ్ అమ్మకాలు డిసెంబరులో 35.8 శాతం పెరిగి 2,382 యూనిట్లు నమోదయ్యాయి. ఎగుమతులు మాత్రం 2016తో పోలిస్తే కాస్త తగ్గాయి. 2016 డిసెంబరులో 11,494 యూనిట్లను ఎగుమతి చేయగా, 2017 డిసెంబరులో ఆ సంఖ్య 6.2 శాతం తగ్గి 10,780 యూనిట్లుగా ఉంది.

9 శాతం పెరిగిన మహీంద్రా సేల్స్

మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ డిసెంబర్‌లో 8 శాతం వృద్ధిని సాధించి 39,200 యూనిట్లను విక్రయించింది. గతేడాది ఇదే సమయంలో 36,464 యూనిట్లను విక్రయించింది. దేశీయ మార్కెట్లో అమ్మకాలు 7 శాతం వృద్ధిని సాధించి 36,979 యూనిట్లను విక్రయించింది. 2016 డిసెంబరులో 34,411 యూనిట్ల అమ్మకాలు మాత్రమే జరిగాయి. ఇక ఎగుమతుల్లోనూ మహీంద్రా పెరుగుదలను నమోదు చేసింది. 2016 డిసెంబరులో 2,053 యూనిట్ల అమ్మకాలు చేపట్టగా, గత నెల 8 శాతం వృద్ధిని నమోదు చేసి 2,221 యూనిట్లను విక్రయించింది. స్కార్పియో, ఎక్స్‌యువి 500, గ్జైలో, బొలొరే, వెరిటో అమ్మకాలు 7 శాతానికి పడిపోయాయి. 2016 డిసెంబరులో 16,799 యూనిట్ల సేల్స్ ఉండగా, గత నెలలో 15,543 యూనిట్ల అమ్మకాలు మాత్రమే జరిగాయి. కమర్షియల్ వెహికల్ అమ్మకాలు మాత్రం 24 శాతం పెరిగాయి. 2016 డిసెంబరులో 14,154 యూనిట్ల అమ్మకాలతో పోలిస్తే గత నెల 17,452 యూనిట్ల విక్రయాలు జరిగాయి. ఇదే వృద్ధిని కొత్త సంవత్సరంలోనూ కొనసాగిస్తామని ఎం అండ్ ఎం ఆటోమోటివ్ సెక్టార్ అధ్యక్షుడు రాజన్ వాధ్రా అన్నారు.

టివిఎస్ సేల్స్ 39 శాతం జంప్

టివిఎస్ మోటార్ కంపెనీ అమ్మకాలు డిసెంబర్ 2.56 లక్షల యూనిట్ల సేల్స్‌తో 39 శాతం జంప్ చేశాయి. ద్విచక్ర వాహనాలకు డిమాండ్ మరింతగా పెరిగింది. గతేడాదిలో ద్విచక్ర వాహనాల్లో 95,281 యూనిట్లు సేల్ అవగా, 63.7 శాతం వృద్ధి నమోదైంది. ఇప్పుడు 2.47 లక్షల యూనిట్లతో 37.9 శాతం వృద్ధి చోటుచేసుకుంది.

అమ్మకాల్లో ఐషర్ మోటార్ జోష్

ఐషర్ మోటార్స్ అమ్మకాల్లో దూసుకెళ్తోంది. 350 సిసి సామర్థ్యం కలిగిన ద్విచక్ర వాహనాల సేల్స్ 17 శాతం పెరిగాయి. ఏడాది–ఏడాది ఆధారంగా చూస్తే 63,269 యూనిట్లతో 20 శాతం వృద్ధిని చూపాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ ఎగుమతులు 48 శాతం అంటే 1,601 యూనిట్లు జంప్ చేశాయి. దేశీయంగా అమ్మకాలు 14.2 శాతం పెరిగాయి. మొత్తం అమ్మకాలు 3,606 యూనిట్లుగా ఉన్నట్లు కంపెనీ వెల్లడించింది.

హ్యుందాయ్ సేల్స్ అప్

హ్యుందాయ్ డిసెంబరులో 10 శాతం వృద్ధిని సాధించింది. 2017 మొత్తం ఏడాదికి గానూ 5.4 శాతం వృద్ధి రేటును నమోదు చేసింది. 2016 డిసెంబరులో 57,164 యూనిట్లను విక్రయించిన కంపెనీ, 2017 డిసెంబరులో 62,899 యూనిట్లను విక్రయించినట్లు తెలియజేసింది.

నేటి నుంచి బిఎస్‌ఎన్‌ఎల్ మెగా మేళా

మన తెలంగాణ / హైదరాబాద్ : నేటి నుండి ఈ నెల 6వ తేదీ వరకు బిఎస్‌ఎన్‌ఎల్ మెగా మేళాను నిర్వహిస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బిఎస్‌ఎన్‌ఎల్ తెలంగాణ టెలికం సర్కిల్ అన్ని వినియోగదారుల సేవా కేంద్రాలు, ముఖ్యమైన రిటైల్ ఔట్‌లెట్లు, ఫ్రాంచైజీ సంస్థల ద్వారా ఉచిత 3జి స్మార్ట్ సిమ్ కార్డును అందజేయనున్నట్లు బిఎస్‌ఎన్‌ఎల్ తెలంగాణ టెలికం సర్కిల్ సిజిఎం వి. సుందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని నూతన కనెక్షన్ల ద్వారా వినియోగదారులు 351 ఎంబి డేటాను ఉచితంగా పొందవచ్చన్నారు. అలాగే లైండ్ లైన్, అన్ని రకాల బ్రాడ్ బ్యాండ్, ఎఫ్‌టిటిహెచ్ కనెక్షన్లను కూడా ఈ మెగా మేళాలో బుకింగ్ చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నెం 1503కి గానీ, లేదా 18001801503కి గానీ ఫోన్ చేయవచ్చని సిజిఎం సుందర్ పేర్కొన్నారు.

నవంబర్‌లో కీలక రంగాల వృద్ధి 6.8 శాతం



న్యూఢిల్లీ: నవంబర్ నెలలో దేశీయంగా ఎనిమిది కీలక రంగాల ఉత్పత్తి 6.8 శాతం వృద్ధితో 13 నెలల గరిష్ఠానికి చేరింది. కీలక రంగాల వృద్ధి అక్టోబర్‌లో 5 శాతం మాత్రమే ఉంది. ఈసారి ముఖ్యంగా సిమెంట్, స్టీలు ఉత్పత్తిలో గణనీయమైన వృద్ధి నమోదైంది. సిమెంట్, స్టీల్ ఉత్పత్తిలో రెండంకెల వృద్ధి నమోదవగా, రిఫైనరీ ఉత్పత్తిలో స్థిరమైన వృద్ధి కనిపించింది. మొత్తం ఉత్పత్తిలో కీలక రంగాల వాటా 40 శాతం ఉంటుంది. సోమవారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమ మంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, సిమెంట్ ఉత్పత్తిలో 17.3 శాతం, స్టీలు ఉత్పత్తిలో 16.6 శాతం వృద్ధి నమోదవగా, అక్టోబర్ నెలలో ఈ రెండు అంశాల్లో వరుసగా 1.3 శాతం, 8.4 శాతం వృద్ధి ఉంది. ఎనిమిది మౌలికసదుపాయ రంగాల్లో బొగ్గు, క్రూడ్ ఆయిల్, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఫెర్టిలైజర్స్, స్టీల్, సిమెంట్, విద్యుత్‌లు ఉంటాయి. మొత్తం పరిశ్రమ ఉత్పత్తిలో ఇవి 40.27 శాతం వృద్ధి నమోదైంది

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	33812.75	−244.08	−0.72%
నిఫ్టీ	10435.55	−95.15	−0.90%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.89
యూరో	75.33
బ్రిటిష్ పౌండ్	85.18
ఆస్ట్రేలియన్ డాలర్	49.84
కెనెడియన్ డాలర్	50.64
ఎమిరైట్ దిర్హామ్	17.67
స్విస్ ఫ్రాంక్	64.97
చైనీస్ యువాన్	9.76
మలేషియన్ రింగిట్	15.3
న్యూజిలాండ్ డాలర్	44.67
హాంగ్‌కాంగ్ డాలర్	8.31
జపనీస్ యెన్	0.57
కువైట్ దినార్	214.41
సౌతాఫ్రికన్ రాండ్	4.59

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28100	30053.48	−0.35%
ముంబై	28850	30855.61	0.28%
ఢిల్లీ	28500	30481.28	0.88%
కోల్‌కతా	29030	31048.13	0.62%
కేరళ	27350	29251.34	0.55%
బెంగళూరు	27500	29411.76	0.73%
హైదరాబాద్	28200	30160.43	0.79%
గల్ఫ్	1346.4	1440.00	0.65%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	శనివారం	మార్పు (%)
చెన్నై	42000.00	41600.00	0.96
ముంబై	42000.00	41600.00	0.96
ఢిల్లీ	42000.00	41600.00	0.96
కోల్‌కతా	42000.00	41600.00	0.96
హైదరాబాద్	42000.00	41600.00	0.96



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	361	విశాఖపట్నం	370
వరంగల్	351	చిత్తూరు	363
విజయవాడ	365	చెన్నై	370
గోదావరి	365	బెంగళూరు	365

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
టాటా పవర్	100.00	92.40	97.15	93.50	3.65	3.90
ఇండియాబుల్స్	1,243.90	1,194.85	1,218.15	1,196.60	21.55	1.80
కోల్ ఇండియా	267.30	262.60	266.65	262.95	3.70	1.41
విప్రో	320.00	309.45	316.55	314.25	2.30	0.73
సన్‌ఫార్మా	585.40	571.25	574.05	571.15	2.90	0.51
సిప్లా	617.85	607.00	611.50	608.50	3.00	0.49
ఐటిసి	392.50	388.50	389.95	388.55	1.40	0.36
యాక్సిస్ బ్యాంక్	569.80	560.50	565.50	563.95	1.55	0.27
లార్సెన్	1,274.00	1,255.90	1,260.70	1,258.25	2.45	0.19
రెల్ క్యాపిటల్	614.00	576.60	598.85	578.70	20.15	3.48

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్టం	కనిష్టం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
భారతి ఇన్‌ఫ్రాటెల్	379.90	368.35	369.95	378.75	8.80	2.32
టిసిఎస్	2,694.80	2,635.00	2,645.60	2,701.20	55.60	2.06
బోస్క్	20,620.00	19,702.40	19,791.90	20,165.55	373.65	1.85
బజాజ్ ఫైనాన్స్	1,760.00	1,720.40	1,725.65	1,756.70	31.05	1.77
బిపిసిఎల్	523.00	507.20	508.60	517.70	9.10	1.76
హెచ్‌యుఎల్	1,367.00	1,340.05	1,344.50	1,367.85	23.35	1.71
టాటా మోటార్స్	436.40	422.25	424.45	431.85	7.40	1.71
హెచ్‌డిఎఫ్‌సి	1,711.05	1,677.50	1,683.75	1,710.40	26.65	1.56
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,655.95	1,618.10	1,623.85	1,648.90	25.05	1.52
అల్ట్రాటెక్ సిమెంట్	4,319.80	4,243.05	4,256.05	4,320.60	64.55	1.49

మన తెలంగాణ
10
హైదరాబాద్
మంగళవారం
2, జనవరి 2018
www.manatelangana.news

పొగమంచు ఎఫెక్ట్ : ఆలస్యంగా 300 విమానాలు



న్యూఢిల్లీ : విమానా సర్వీసులకు పొగమంచు దెబ్బపడింది. దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో సోమవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్ముకుంది. దీంతో 300 విమాన సర్వీసుల రాకపోకల్లో ఆలస్యం చోటు చేసుకోగా, 8 విమాన సర్వీసులను రద్దు చేశారు. ఢిల్లీలో ల్యాండ్ అయ్యే, ఢిల్లీ నుంచి బయలుదేరే అన్ని విమాన రాకపోకలపై ఈ ప్రభావం పడింది. దాదాపు 265 దేశీయ విమానాలు, 67 అంతర్జాతీయ విమానాల రాకపోకల్లో జాప్యం జరిగింది. మరో 8 దేశీయ విమానా సర్వీసులు రద్దయ్యాయి. ఉదయం 7.30 నుంచి 9.30 గంటలకు విమానాలేవీ టేకాఫ్ కాలేదని విమానాశ్రయ అధికారి చెప్పారు. విమానం టేకాఫ్ కావడానికి రన్‌వే విజ్వల్ రేంజ్ 125 మీటర్లకు పైగా ఉండాల్సి ఉండగా, 100–125 మీటర్ల మధ్య ఉండడమే దానికి కారణమన్నారు. అదే విధంగా విమానాలు టేకాఫ్ కాకపోవడంతో పార్కింగ్ బేలు అందుపాటులో లేని కారణంగా విమానాలు ల్యాండ్ కావడానికి జాప్యం జరిగిందని ఆయన చెప్పారు. దట్టమైన పొగమంచు చుట్టుముట్టడంతో సమీప విమానాశ్రయానికి మళ్లించేందుకు కూడా వీలు లేకుండా పోయిందని ఆ అధికారి వెల్లడించారు.


సోనియాతో రాహుల్ కొత్త సంవత్సర వేడుకలు

పనాజి : కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కొత్త సంవత్సర వేడుకలను తన తల్లి సోనియాగాంధీతో కలిసి గోవాలో జరుపుకున్నారని ఓ సీనియర్ పార్టీ నాయకుడు సోమవారం చెప్పారు. డిసెంబర్‌లో కాంగ్రెస్ అధినేత్రి బాధ్యతల నుంచి తప్పుకున్న సోనియాగాంధీ విహార యాత్రకు గోవా వెళ్లారు. ఈ నేపథ్యంలో కొత్తగా కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన రాహుల్ తన తల్లితో కలిసి కొత్త సంవత్సర వేడుకలను జరుపుకునేందుకు గోవా విచ్చేశారు. దక్షిణ గోవా మొబోర్‌లో ఉన్న ఓ ఫైవ్‌స్టార్ హోటల్‌లో ఇద్దరు న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్నట్లు పార్టీ సీనియర్ నేత తెలిపారు. ఇది ప్రైవేటు కార్యక్రమమని, దీనికి పార్టీ నాయకులనుగానీ, కార్యకర్తలనుగానీ అహ్వానించలేదన్నారు. అయితే సోనియాగాంధీ డిసెంబర్ 27 నుంచి గోవాలోనే ఉంటున్నారు. గత వారం బీచ్ రీసార్ట్‌లో ఆమె బైస్కిల్ రైడింగ్ చేసిన దృశ్యాలను విడుదల చేసిన విషయం విదితమే.

సిఎంలకు పొంచివున్న ముప్పు!

న్యూఢిల్లీ : ఇతర రాష్ట్రాల్లో ఆకస్మిక పర్యటనలను వెళ్లే రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కేంద్ర ప్రభుత్వం ఓ సూచన చేసింది. అలాంటి పర్యటనలను రద్దు చేసుకోవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సోమవారంనాడు ఆదేశాలు జారీ చేసింది. ముఖ్యమంత్రులకు భద్రతాపరమైన ముప్పు ఉందని హెచ్చరించింది. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి మరో రాష్ట్రంలో పర్యటించే సమయంలో ముందస్తు సమాచారం ఇవ్వాలని కోరింది. ఆకస్మిక పర్యటనల్లో సిఎంలపై దాడులు జరిగే అవకాశం ఉందనే ఇంటిలిజెన్స్ పక్కా సమాచారంతోనే కేంద్రం హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం.

తుపాకీ మిస్‌ఫైర్, పెళ్లి కొడుకు మృతి



చండీగఢ్ : పెళ్లి వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. గన్ మిస్ ఫైర్ అవ్వడంతో పెళ్లి కొడుకు మృతిచెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన హర్యానాలోని కైథాల్ జిల్లా గుల్హాలోని చీకా టౌన్‌షిప్లో చోటుచేసుకుంది. స్విట్జర్లాండ్‌లో నివసించే ఎన్‌ఆర్‌ఐ విక్రమ్‌జిత్ సింగ్ (36) వివాహం ఆదివారం నిశ్చయించారు. అయితే శనివారం అర్ధరాత్రి పెళ్లికి ముందు నిర్వహించిన ఓ కార్యక్రమం జాగోలో డ్యాన్సులు వేస్తుంటే, మరో వైపు విక్రమ్ సోదరుడు సురేందర్ సింగ్ తు పాకీతో గాల్లోకి కాల్చుతూ సంబరాన్ని చాటుకున్నాడు. అయితే గన్ మిస్ ఫైర్ అవ్వడంతో బుల్లెట్లు నేరుగా పెళ్లికొడుకు, అతని స్నేహితుడు నవ్ తేజ్ సింగ్ శరీరాల్లోకి చొచ్చుకుపోయాయి. విక్రమ్ జిత్ సింగ్ అక్కడికక్కడే మృతిచెందగా, నవ్ తేజ్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు, ఐదుగురు మృతి

జుమయి : బీహార్‌లోని జుముయి జిల్లాలో రోడ్డుపై నుంచి వెళ్తున్న కారు పక్కన ఉన్న చెట్టును ఢీకొనడంతో ఐదుగురు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. ఈ సంఘటన చాంద్‌మందిహ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బిస్‌నపూర్ గ్రామ సమీపంలోని దేయ్‌ఘర్–చకాయ్ ప్రధాన రహదారిపై సోమవారం జరిగింది. చనిపోయిన ఐదుగురు 30 నుంచి 35 ఏళ్ల వయసు వుంటారని స్టేషన్ హౌజ్ ఆఫీసర్ దీపక్ కుమార్ తెలిపారు.

ముంబయి పబ్ మేనేజర్లు అరెస్టు

ముంబయి : గత వారం ముంబయిలోని 'వన్ ఎబౌవ్' పబ్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాద ఘటనకు సంబంధించి ఇద్దరు పబ్ మేనేజర్లను సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. ఈ ప్రమాదంలో 14 మంది ప్రాణాలు కోల్పోగా, 21 మంది క్షతగాత్రులైన విషయం తెలిసిందే. ఎన్‌ఎం జోషి మార్గ్ పోలీస్ స్టేషన్‌కు చెందిన అధికారుల బృందం లోవర్ పరేల్ ప్రాంతంలోని కమల మిల్స్ కాంపౌండ్‌లో ఉన్న 'వన్ ఎబౌవ్' పబ్ మేనేజర్లు గిబ్సన్ లోపెజ్ (34), కెవిన్ బావా (35)లను అరెస్టు చేసినట్లు ఓ అధికారి పేర్కొన్నారు. గతేడాది డిసెంబర్ 29న తెల్లవారుజామున పబ్‌లో మంటలు చెలరేగిన సమయంలో ఈ ఇద్దరు మేనేజర్లు అందులోనే ఉన్నప్పటికీ ప్రమాదం నుంచి తప్పించుకునేలా అతిథులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించలేదన్నారు. ఈ నేపథ్యంలో వారిద్దరిని అదుపులోకి తీసుకున్నామని సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ పాతన్ మీడియాకు వెల్లడించారు. వారిపై ఐపిసి 304, 337, 34 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామన్నారు. వారిద్దరిని కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఆయన చెప్పారు.

బిజెపి తీర్థం పుచ్చుకున్న ఇష్రత్



కోల్‌కతా : ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా పోరాడిన ఇష్రత్ జహాన్ సోమవారం బిజెపిలో చేరారు. ట్రిపుల్ తలాక్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో ఐదుగురు పిటిషన్లు వేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్లు వేసిన వారిలో ఇష్రత్ జహాన్ ఒకరు. హౌరా బిజెపి కార్యాలయంలో బిజెపి పశ్చిమ బెంగాల్ జనరల్ సెక్రటరీ బసు సమక్షంలో ఆమె పార్టీలో చేరారు. ఇష్రత్‌కు ఆమె భర్త 2014లో దుబాయ్ నుంచి ఫోన్‌లో ట్రిపుల్ తలాక్ చెప్పి విడాకులు ఇచ్చాడు. దీంతో ఇష్రత్ సుప్రీంకోర్టు పిటిషన్ వేసింది. ఈ క్రమంలో ట్రిపుల్ తలాక్ రాజ్యాంగ వ్యతిరేకమని గత ఏడాది ఆగస్టు 22న సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ బిల్లు ఇటీవల లోక్‌సభలో ఆమోదం పొందింది. రాజ్యసభలో ఈ బిల్లు ఆమోదం పొందాల్సి ఉంది.

ఉగ్రవాదం వీడకపోతే పాక్‌తో క్రికెట్ ఆడేది లేదు : సుష్మా



న్యూఢిల్లీ : భారత్, పాకిస్థాన్ ద్వైపాక్షిక క్రికెట్ సిరీస్ జరుగనున్న నేపథ్యంలో విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్ కీలకమైన వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాదాన్ని, కాల్పులను విరమించుకుంటేనే తప్ప ఇరు దేశాల మధ్య క్రికెట్ సిరీస్ జరగబోదని అన్నారు. సోమవారం విదేశీ వ్యవహారాలపై పార్లమెంటరీ సంప్రదింపుల కమిటీ సమావేశాల సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశాంగ శాఖ సహాయ మంత్రి ఎంజె అక్బర్, విదేశాంగ కార్యదర్శి ఎస్.జైశంకర్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుష్మా స్వరాజ్ మాట్లాడుతూ ఇరు దేశాల జైళ్లలో మగ్గుతున్న 70 ఏళ్లు నిండిన వృద్ధులు, మహిళలు, మానసిక వైకల్యం కలిగిన ఖైదీలను మానవతా దృక్పథంతో విడుదల చేయాలని ఇటీవల పాక్ రాయబారిలో జరిగిన సమావేశంలో తాను ప్రతిపాదించినట్టు వెల్లడించారు. ఉగ్రవాదం, క్రికెట్ రెండూ వేర్వేరని, ఈ రెండే ఒకే ఒరలో ఇమడబోవని ఆమె స్పష్టం చేశారు. వెంటనే పాకిస్థాన్ సరిహద్దు ఉగ్రవాద కార్యకలాపాలను, కాల్పులను విరమించకపోతే ఈ రెండు దేశాల మధ్య క్రికెట్ సిరీస్ జరిగే అవకాశముందదని ఆమె స్పష్టం చేశారు.

నేడు రాజ్యసభకు ట్రిపుల్ తలాక్ బిల్లు



న్యూఢిల్లీ : ట్రిపుల్ తలాక్ బిల్లును ప్రభుత్వం రాజ్యసభలో మంగళవారం ప్రవేశపెట్టనుంది. భార్యకు మూడు సార్లు తలాక్ చెప్పి విడాకులిచ్చే భర్తకు మూడేళ్ల వరకు జైలు విధించేలా ఈ బిల్లును ప్రతిపాదించారు. ఇప్పటికే ఇది లోక్‌సభలో పాస్ అయిన విషయం విదితమే. ఈ బిల్లును రాజ్యసభలో మంగళవారం కేంద్ర న్యాయ శాఖా మంత్రి రవి శంకర్ ప్రవేశపెట్టనున్నట్టు ఎగువ సభ వ్యవహారాల జాబితాను బట్టి తెలుస్తోంది. బాధిత మహిళకు, ఆమె మైనర్ పిల్లలకు న్యాయపరంగా జీవనాధార భత్యాన్ని పొందే హక్కును ఈ బిల్లును కల్పిస్తుంది. బాధిత మహిళ పిల్లలను తన సంరక్షణలోనే ఉంచుకునేందుకు కూడా మేజిస్ట్రేట్‌ను కోరవచ్చు. ఈ బిల్లు ప్రకారం ట్రిపుల్ తలాక్ మాటగా చెప్పినా, రాతపూర్వకం, ఇ–మెయిల్, ఎస్ఎంఎస్, వాట్సాప్ తదితర సోషల్ మీడియా ద్వారా చెప్పినా కూడా చట్టవిరుద్ధంగా, నేరంగా పరిగణించబడుతుంది. కాగా, ఈ బిల్లు రాజ్యసభలో కూడా పాస్ అయితే దేశంలోని వివిధ ముస్లిం సంఘాలు సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశముందని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) పేర్కొంది. రాజ్యసభలో ప్రభుత్వానికి తగిన మెజార్టీ లేనిపక్షంలో బిల్లును రాజ్యసభలో ప్రవేశపెడితే, దీన్ని పార్లమెంటరీ కమిటీ సమీక్ష కోసం సిఫార్సు చేసే అవకాశాలున్నాయి.

మంత్రి తోమర్ నోటి దురుసు

కాంగ్రెస్‌పై తీవ్ర వివాదాస్పద వ్యాఖ్య



న్యూఢిల్లీ : రాజ్యాంగం, లౌకికవాదులపై కేంద్రమంత్రి అనంతకుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలపై రేగిన వివాదం సద్దుమణుతుండగానే తాజాగా కాంగ్రెస్‌పై మరో కేంద్రమంత్రి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన బిజెపి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి నరేంద్రసింగ్ తోమర్ కాంగ్రెస్ పార్టీనుద్దేశించి అభ్యంతర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని నరేంద్రమోడీకి, కాంగ్రెస్ పార్టీ నేతలకు అసలు పోలికే లేదన్నారు. అది ఎంతగా అంటే మీసంలో ఉండే వెంట్రుకలకు, తోకలో ఉండే వెంట్రుకలకు మధ్య ఉన్నంత అని తోమర్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపిలో ఎంతో అనుభవం ఉన్న నాయకులు ఇటువంటి వ్యాఖ్యలు ఎలా చేయగలుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత, లోక్‌సభలో విపక్ష నేత మల్లిఖార్జున ఖర్గే ప్రశ్నించారు. ఆయన చేసిన వ్యాఖ్యలు పార్లమెంటు సభ్యుల గౌరవాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయన్నారు. దీనిపై ప్రధాని మోడీ తప్పక వివరణ ఇవ్వాల్సిందిగా ఆయన డిమాండ్ చేశారు. అటువంటి పదాలు ఉపయోగించొద్దని మోడీ అయినా కనీసం వారికి హితవు చెప్పాలని సూచించారు.

అబద్ధాలకోరు..మోసకారి



ఫ్లోరిడాలోని పామ్ బీచ్‌లో కొత్త సంవత్సర వేడుకలకు భార్య మెలానియా, కుమారుడు బ్యారన్‌తో కలిసి హాజరవుతున్న ట్రంప్

- లక్షల కోట్లు సాయం చేస్తున్నా ప్రయోజనం లేదు
- ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తే ఊరుకోం
- పాక్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ధ్వజం

న్యూఢిల్లీ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పాకిస్థాన్ పై తీవ్రంగా విరుచుకు పడ్డారు. పాక్ తీరును ట్విట్టర్ ద్వారా ఎండగట్టారు. ఉగ్రవాదుల పట్ల పాక్ అనుసరిస్తున్న వైఖరిని తప్పుబట్టారు.ఉగ్రవాదంపై పోరులో తమకు సాయం చేయడం లేదని మండిపడ్డారు. గత 15 సంవత్సరాల కాలంలో అమెరికా అవివేకంతో వ్యవహరించి పాకిస్థాన్‌కు 33 బిలియన్ డాలర్ల (2,21,100 కోట్లు) ఆర్థిక సాయం చేసిందని, దానికి బదులుగా పాక్ నుంచి తమకు అబద్ధాలు, మోసాలు తప్ప మరేం దక్కలేదని ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్ అమెరికా నాయకులను ఫూల్స్‌గా భావిస్తోందని ట్రంప్ మండిపడ్డారు. ఆఫ్ఘనిస్తాన్‌లో ఉగ్రవాదుల అన్వేషణకై తాము చేస్తున్న ప్రయత్నాలకు పాకిస్థాన్ సహకరించకపోగా, వారికి స్వర్గంలా మారిందని ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశారు. గత కొన్ని నెలలుగా పాక్ తీరును ఎండగడుతున్న ట్రంప్ ఈ సారి మరింత ఘాటైన విమర్శలు చేయ దం ప్రపంచం దృష్టిని ఆకర్షించింది. ఉగ్రవాదుల పట్ల అమెరికా వైఖరిని మరోసారి స్పష్టం చేసింది. ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా వ్యూహాన్ని వెల్లడించిన సందర్భంగా 2017 ఆగస్టు 22న ట్రంప్ పాకిస్థాన్‌కు హెచ్చరిక జారీ చేశారు. ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పిస్తున్న పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్‌ల తీరును అమెరికా సహిస్తూ ఊరుకోదని తేల్చిచెప్పారు. నేరస్థులకు, ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించడం ద్వారా పాకిస్థాన్ చాలా కోల్పోవలసి వస్తుందని, ఆఫ్ఘనిస్తాన్‌తో తాము చేస్తున్న పోరులో సహకరిస్తే ఎంతో లబ్ధి పొందే అవకాశం ఉందని ట్రంప్ స్పష్టం చేశారు. 2017 డిసెంబర్ నెలలో కూడా ఒక సారి ట్రంప్ పాక్‌పై విరుచుకు పడ్డారు.ప్రతి ఏడాది పాకిస్థాన్‌కు భారీ ఆర్థిక సాయం చేస్తున్నామని, పాక్ కూడా తమకు ఖచ్చితంగా సాయం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ కూడా పాక్ తీరును ఎండ గట్టారు.గత నెలలో క్రిస్మస్‌కు కొన్ని రోజుల ముందు ఆఫ్ఘనిస్థాన్‌లోని అమెరికా బలగాలతో ఆయన సమావేశమైన సంగతి తెలిసిందే.



రాష్ట్రపతి భవన్‌లో సోమవారంనాడు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పిన ప్రధాని మోడీ

వ్యవహారిక భాషల్లోనే సైన్స్ సమాచారం : మోడీ

కోల్‌కతా : సైన్స్‌ను అభివృద్ధి చేయడానికి సైన్స్ కమ్యూనికేషన్‌ను వ్యవహారిక భాషల్లోనే విస్తృతస్థాయిలో ప్రోత్సహించాలని ప్రధాని నరేంద్ర మోడీ సూచించారు. సోమవారం ప్రొఫెసర్ సత్యేంద్ర నాథ్ బోస్ 125వ జయంతి ఉత్సవం సందర్భంగా విడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన స్మారకోత్సవంలో ఆయన మాట్లాడుతూ భాష అనేది అడ్డంకి కాదని, అది ఒక సులభతరమైన ప్రక్రియ అని అన్నారు. దేశంలో ప్రతి శాస్త్రవేత్త, పరిశోధకుడు 'నవీన భారతం' కోసం నూతన ఆవిష్కరణలు, పరిశోధనలపై దృష్టిని సారించాలని సూచించారు. బెంగాలీ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను బెం గాలీ భాషలో చెబుతూ ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని..యువతలో లైవ్ సైన్స్, అవగాహనను పెంపొందించేందుకు సైన్స్ కమ్యూనికేషన్‌ను మరింత ప్రోత్సహించాల్సిన అవసరముందన్నారు. దీనికి భాష ఏమాత్రం అడ్డంకి కాదన్నారు. శాస్త్రవేత్తలు చేసే ఆవిష్కరణలు, పరిశోధనలు ప్రస్తుతం ప్రపంచానికి ఎంతో అవసరమన్నారు. అలాగే, శాస్త్రవేత్తలు క్రియేటివ్ టెక్నాలజీకి కొత్త మార్గదర్శకాన్ని ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతం దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ బహుళ భాగ ప్రాజెక్టులను నిర్వహిస్తున్నాయని కితాబిచ్చారు.

ఈ ఏడాది 8 రాష్ట్రాల్లో ఎన్నికలు



న్యూఢిల్లీ : ఈ ఏడాది(2018) దేశవ్యాప్తంగా మొత్తం ఎనిమిది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికలకు ఈ ఎన్నికల సెమీఫైనల్ లాంటివని చెప్పవచ్చు. రాజస్థాన్, మధ్యప్రదేశ్, కర్నాటక, ఛత్తీస్‌గఢ్, నాగాలాండ్, మేఘాలయ, త్రిపుర, మిజోరం తదితర రాష్ట్రాల్లో ఎన్నికల పోరు జరగనుంది. ఈ ఎనిమిది రాష్ట్రాల నుంచి మొత్తం 99 మంది లోక్‌సభ ఎంపిలు ఉండటంతో ఈ ఎన్నికలకు చాలా ప్రాధాన్యత ఏర్పడనుంది. ఈ ఎనిమిదింటిలో చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్, బిజెపిల నడుమే ప్రధాన పోరు జరగనుంది. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్నాటకలో బిజెపికి విజయం అంత సులువుగా దక్కే అవకాశాలు కనిపించడం లేదు. రాజస్థాన్‌లోనూ బిజెపికి ఎదురుగాలి వీచే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా రైతుల్లో అశాంతి, నిరుద్యోగ సమస్య, గుజ్జర్ల ఆందోళన బిజెపి సర్కారును కుదిపేస్తున్నాయి. ఇటీవలి రాజస్థాన్ సర్వేలు కూడా బిజెపికి ఏమంత పెద్దగా అనుకూలంగా రాలేదు. ఇక, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో శివ్‌రాజ్‌సింగ్ చౌహాన్, రమణ్ సింగ్‌లు నాలుగోసారి తమకు అవకాశం కల్పించాలని ప్రజల ముందుకు వెళ్లబోతున్నారు. దీంతో సహజంగానే ఇక్కడ ప్రభుత్వ వ్యతిరేకత కొంత వ్యక్తమయ్యే అవకాశముందని భావిస్తున్నారు. మేఘాలయలో నేషనల్ పీపుల్స్ పార్టీతో బిజెపి పొత్తు పెట్టుకునే అవకాశముందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

ఉగ్రవాదుల్లో పదో తరగతి బాలుడు


న్యూఢిల్లీ : జమ్మూకశ్మీర్లోని పుల్వామా జిల్లాలో సిఆర్‌పిఎఫ్ శిక్షణా కేంద్రంపై ఆదివారం ఉగ్రవాదులు దాడులకు తెగబడ్డారు. పాకిస్థాన్‌కు చెందిన జైషే అహ్మద్ ఉగ్రవాదులు ఆదివారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో గ్రనేడ్లు విసిరి, తుపాకులతో జరిపిన కాల్పుల్లో నలుగురు జవాన్లు అమరులయ్యారు. ప్రతిగా భద్రతా బలగాలు కాల్పులు జరపగా ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మృతి చెందిన ఉగ్రవాదుల్లో పదవ తరగతి చదువుతున్న బాలుడు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. అయితే, ఆ బాలుడి తండ్రి జమ్మూకశ్మీర్ పోలీసు విభాగానికి చెందిన అధికారి కుమారుడుగా భద్రతా బలగాలు పేర్కొన్నాయి. ఉగ్రవాదులు సైనికులపై కాల్పులు జరుపుతున్న సమయంలో ఆ బాలుడు విడియో రికార్డింగ్ చేసినట్టు కూడా వివరించాయి. ఆ బాలుడు కొద్ది మాసాల క్రితమే ఉగ్రవాద సంస్థలో చేరాడని తెలుస్తోంది.

ఆన్‌లైన్ విక్రయాల్లో కొత్త నిబంధనలు



న్యూఢిల్లీ : ఆన్‌లైన్‌లో వస్తువులను విక్రయించే ఇ–కామర్స్ సంస్థలు ఆ వస్తువులపై గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పి)తో పాటు ముగిసే గడువు, కస్టమర్ కేర్ వంటి సమాచారాన్ని ప్రింట్ చేయాలన్న కేంద్ర ప్రభుత్వ నిబంధన సోమవారం నుంచి అమలులోకి వచ్చింది. ఈమేరకు ఇప్పటికే వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వశాఖ 2017 జూన్‌లో లీగల్ మెట్రాలజీ (ప్యాకేజ్డ్ వస్తువులు) నిబంధనల్లో సవరణలు చేసింది. ఈ నిబంధనలను పాటించేందుకు ఇ–కామర్స్ సంస్థలకు అప్పటి నుంచి ఆరు నెలల గడువు ఇచ్చింది. ఈ గడువు డిసెంబరు 31తో ముగిసినందున జనవరి 1 (సోమవారం) నుంచి కొత్త నిబంధనలు అమలులోకి వచ్చాయని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకే ఈ నిబంధనలను తీసుకొచ్చినట్టు పేర్కొంది. కొత్తగా అమలులోకి వచ్చిన నిబంధనలకు అనుగుణంగా ఇ–కామర్స్ సంస్థలు ఇక నుంచి తాము విక్రయించబోయే వస్తువులకు సంబంధించిన సమాచారాన్ని ముందుగా ఇ–కామర్స్ ప్లాట్‌ఫారంలో ప్రదర్శించాల్సివుంటుందని, ఎంఆర్‌పి, గడువు ముగింపు, సంఖ్య, ఏ దేశానికి చెందిన ఉత్పత్తి, కన్సుమర్ కేర్ వంటి సమాచారాన్ని వస్తువులపై ముద్రించాల్సివుంటుందని మంత్రిత్వ శాఖ వివరించింది.

వెబ్‌సైట్ ప్రారంభించిన రజనీ



చెన్నై : తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ రాజకీయ రంగప్రవేశం చేస్తానని ప్రకటించిన మరుసటి రోజే అవినీతిపై యుద్ధం చేసేందుకు సిద్ధమయ్యారు. అవినీతికి వ్యతికిరేకంగా పోరాడేందుకు తనతో కలిసి రావాలని విజ్ఞప్తి చేస్తూ ఒక వెబ్‌సైట్‌ను, మొబైల్ అప్లికేషన్‌ను ప్రారంభించారు. రజనీకాంత్ రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నట్లు ఆదివారం ప్రకటించిన విషయం తెలిసిందే. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమిళనాడులో 234 స్థానాల్లో బరిలోకి దిగుతామన్నారు. అయితే దేశాన్ని అవినీతి రహిత భారత్‌గా తయారు చేసేందుకు తనతో కలిసి వచ్చేందుకు ఒక వెబ్‌సైట్‌ను క్రియేట్ చేసినట్లు ప్రకటిస్తున్న విడియోను ఆయన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 'మీ ఓటర్ ఐడిని ఉపయోగిస్తూ వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకోండి' అని ఆయన విజ్ఞప్తి చేశారు. అవినీతిపై యుద్ధం చేసేందుకు వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని ఆయన ఉద్ఘాటించారు. అందుకు తనతో కలిసి రావాలని అభిమానాలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యం పేరుతో మన స్వదేశీ గడ్డపై మనం దాచుకున్న సొంత డబ్బును రాజకీయ నాయకులు దోచుకుంటున్నారన్నారు. ఈ సమయంలో తాను రాజకీయ రంగ ప్రవేశం చేయకపోతే సిగ్గుచేయవుతుందని ఆయన ఆ విడియోలో స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా, చిత్ర పరిశ్రమకు చెందిన సభ్యులు రాజకీయ రంగప్రవేశం చేసిన సుదీర్ఘ చరిత్ర తమిళనాడుకు ఉంది. గత 60 ఏళ్ల కాలంలో చిత్ర పరిశ్రమ నుంచి వచ్చిన ఎం. కరుణానిధి, ఎంజి రామచంద్రన్, జలయలలిత సుదీర్ఘ కాలం పాటు ముఖ్యమంత్రులుగా పనిచేశారు.



సింగపూర్, మాస్కోలో కొత్త ఏడాది వెలుగులు

పడవ మునక, ముగ్గురు పిల్లలు గల్లంతు

భగల్‌పూర్ : గంగానదిలో పడవ ఒకేవైపు ఒరిగి మునగడంతో అం దులో ప్రయాణిస్తున్న తొమ్మిది పిల్లల్లో ముగ్గురు గల్లంతు కాగా, మరో ఆరుగురు సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఈ ఘటన బీహార్‌లోని భాగల్‌పూర్‌జిల్లా సబౌర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కొత్త సంవత్సరం సందర్భంగా తొమ్మిది మంది పిల్లలు పడవ ఎక్కారు. రాజన్‌దిపూర్ ఘాట్ వద్ద పడవకు ఒకే వైపు బరువు ఎక్కువై అదుపు తప్పి నీటిలో మునిగిపోయింది. దీంతో ముగ్గురు పిల్లలు గల్లంతయ్యారు. మరో ఆరుగురు పిల్లలు స్థానికుల సహాయంతో ఈదుకుంటూ సురక్షితంగా బయటపడ్డారని పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఒ రాజీవ్ కుమార్ చెప్పారు. ఈ పిల్లల వయసు 9 నుంచి 15 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు.

ఎన్ఎంసిని వ్యతిరేకించండి : ఐఎంఎ

మన తెలంగాణ/హైదరాబాద్: నేషనల్ మెడికల్ కమిషన్ ఏర్పాటు ప్రతిపాదనను వ్యతిరేకించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్, హైదరాబాద్ నగర శాఖ పార్లమెంటు సభ్యులను కోరింది. ఈ మేరకు అసోసియేషన్ ప్రతినిధి బృందం సభ్యులు పార్లమెంటు సభ్యులు బండారు దత్తాత్రేయ, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌లను కలిసి వినతిపత్రం సమర్పించింది. పార్లమెంటులో కమిషన్ ఏర్పాటుకు వ్యతిరేకంగా గళం విప్పాలని వారు ఎంపిలను కోరారు. కేంద్ర ప్రభుత్వం మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసిఐ) స్థానంలో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి)ని తెచ్చేందుకు యత్నిస్తుందని వారు ఎంపిలకు తెలిపారు. ఎన్ఎంసిలో అనేక లొసుగులున్నాయని, అవి ఆరోగ్య సేవలకు దెబ్బతీస్తాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం కూడా ఎన్ఎంసి ఏర్పాటు ప్రయత్నాన్ని ఖండించింది.

స్టార్టప్ మేనేజ్‌మెంట్ ప్రోగాం

మన తెలంగాణ / హైదరాబాద్: యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సౌజన్యంతో స్టార్టప్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తున్నట్లు టిఈజెడ్ ఆంత్రప్రెన్యూర్ జోన్ సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది. స్టార్టప్ మేనేజ్‌మెంట్‌లో నాలుగు మాసాల శిక్షణను ఇవ్వనున్నట్లు వెల్లడించింది. మరిన్ని వివరాలకు 8464057972లో సంప్రదించవచ్చని వెల్లడించింది.

మన తెలంగాణ
11
హైదరాబాద్
మంగళవారం
2, జనవరి 2018
www.manatelangana.news

ఇక రోబో ఉపగ్రహాలు!



న్యూయార్క్: అంతరిక్షంలో చెత్తాచెదారం పెరిగిపోతున్న సమస్య నివారణకు ఇక రోబో ఉపగ్రహాలను పంపాలని నాసా నిర్ణయించినట్లు అమెరికా ప్రభుత్వ రక్షణ పరిశోధనల విభాగం ప్రకటించింది. ఇందుకు అవసరమైన సాంకేతిక విజ్ఞానం రూపొందించడానికి నాసా చర్యలు ప్రారంభించింది. ఉపగ్రహాల మరమ్మతులకు ఈ టెక్నాలజీని వినియోగిస్తారు. ఈ రోబోటిక్ ఉపగ్రహాలకు 'రోదసిలో సర్వీస్ స్టేషన్లు' అని పేరు పెట్టారు. ఉప గ్రహాల మరమ్మతులే కాకుండా వాటి జీవిత కాలాన్ని ఈ టెక్నాలజీ పెంచుతుంది. అంతరిక్షంలో పరిభ్రమణ తరుణంలో తలెత్తే సమస్యలను ఆ రోబో ఉపగ్రహాలు స్వయంగా తీర్చుకోగలవని వివరించింది.

థాయ్‌లో భారత్, పాక్ భద్రతా సలహాదార్ల రహస్య చర్చలు

ఇస్లామాబాద్: భారత్, పాకిస్థాన్ దేశాల భద్రతా సలహాదారుడు థాయిలాండ్‌లో రహస్య సమావేశం జరిపినట్లు పాక్ సీనియర్ అధికారి ఒకరు సోమవారం తెలిపారు. పాక్ జాతీయ భద్రతా సలహాదారు లెఫ్టినెంట్ జనరల్ నసేర్ ఖాన్ జాన్‌జువా, భారత భద్రతా సలహాదారు అజిత్ దోవల్ డిసెంబర్ 27న థాయిలాండ్‌లో సమావేశం అయినట్లు డాన్ న్యూస్ పత్రిక తెలిపింది. వారిద్దరి మధ్య స్నేహ పూర్వకంగా చర్చలు సాగినట్లు ఆ పత్రిక పేర్కొంది. సమావేశం ఉపయుక్తంగా సాగినట్లు దౌత్యస్థాయిలో సంప్రదింపులను ముందుకు తీసుకుపోవడానికి దారి సుగమం అయినట్లు కూడా వార్తలు వచ్చాయి. పాక్ మరణ శిక్ష విధించిన భారతీయ ఖైదీ కులభూషణ్ జాదవ్ తన కుటుంబ సభ్యులను కలుసుకున్న తర్వాత జరిగిన సమావేశం ఇదని పాక్ అధికారులు వివరించారు.

సేఫ్టీ డైరీ, క్యాలెండర్ విడుదల



మన తెలంగాణ/హైదరాబాద్ : దక్షిణ మధ్య రైల్వే 2018 సంవత్సరపు సేఫ్టీ డైరీ, క్యాలెండర్‌ను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్ కుమార్ యాదవ్ విడుదల చేశారు. దక్షిణ మధ్య రైల్వే ప్రధాన కార్యాలయం సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ జాన్ థామస్, చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ డి.కె.సింగ్, ప్రిన్సిపల్ చీఫ్ ఇంజనీర్ కె.వి.శివప్రసాద్, ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ ఎన్.మధుసూదన రావు, సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ అశీష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసిన టిజివో ప్రతినిధి బృందం

మన తెలంగాణ/హైదరాబాద్: టిఆర్ఎస్ ఎంఎల్‌వి, తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం(టిజివో) గౌరవ అధ్యక్షుడు వి.శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ప్రగతిభవన్‌లో సోమవారం ముఖ్యమంత్రి కెసిఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం కెసిఆర్ మాట్లాడుతూ బంగారు తెలంగాణ సాధనలో అధికారులంతా భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిజివో అధ్యక్షురాలు వి.మమత, ప్రతినిధులు ఎ.సత్యనారాయణ, విష్ణువర్ధన్ రావు, సహదేవ్ , ప్రణయ్‌కుమార్, ఎం.బి. కృష్ణయాదవ్, అశోక్‌కుమార్, రవీందర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం టిజివో కార్యాలయంలో నూతన సంవత్సర సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ కేకను కట్ చేశారు.

చంద్రబాబుకు శుభాకాంక్షల వెల్లువ

అమరావతి: నూతన సంవత్సరం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. ఉండవల్లిలోని తమ నివాసంలో చంద్రబాబు దంపతులు ముందుగా తితిదే వేద పండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. అనంతరం సిఎస్ దినేశ్‌కుమార్, డిజిపి మాలకొండయ్య, వివిధ శాఖల ఉన్నతాధికారులు ముఖ్యమంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు, మంత్రులు, ఎంఎల్‌ఎలు, పార్టీ కార్యకర్తలు, మహిళా నేతలు సిఎంకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎపి ఎండిసి డైరీని చంద్రబాబు ఆవిష్కరించారు.

గొట్టిపాడులో ఉద్రిక్తత



గుంటూరు: గుంటూరు జిల్లాలో పత్తిపాడు మండలం గొట్టిపాడులో రెండు సామాజిక వర్గాల మధ్య ఏర్పడిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. గత రాత్రి నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా గ్రామంలోని రెండు వర్గాల మధ్య ఈ వివాదం మొదలైంది. అది కాస్తా ఘర్షణకు దారి తీయడంతో ఇరువర్గాలు రాళ్ల రువ్వుకుని, కర్రలతో దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గ్రామంలో యుద్ధ వాతావరణం నెలకొనడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు యత్నిస్తున్నారు. ఓ వైపు ఇరువర్గాల దాడులు, మరోవైపు పోలీసులు భారీగా మోహరించడంతో ఎప్పుడేమి జరుగుతుందో అన్న భయంతో గ్రామస్తులు హడలిపోతున్నారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వరికోత మిషన్ బోల్తా, ముగ్గురు మృతి

శ్రీకాకుళం: శ్రీకాకులం జిల్లా ఇచ్చాపురం మండలం లొద్దపుట్టి గ్రామంలో సోమవారం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదవశాత్తూ వరికోత మిషన్ బోల్తా పడింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు మృతి చెందారు. మృతులు అదే గ్రామానికి చెందిన తులసమ్మ, జానకమ్మ , పూర్ణమ్మలుగా గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





నివురుగప్పిన నిప్పులా ఇరాన్

- ఘర్షణల్లో ఇప్పటివరకు 12మంది మృతి

టెహ్రాన్: ఇరాన్‌లో రేగిన అశాంతి మూలంగా ఇప్పటివరకు 12మంది మరణించారు. అధ్యక్షుడు హసన్ రౌహానీ అనేక రోజులుగా సాగుతున్న నిరసనలను చల్లార్చడానికి ప్రశాంతంగా ఉండాలని ఇచ్చిన పిలుపును ప్రజలు ఏ మాత్రం లెక్కచేయలేదు. ప్రజలకు హామీ ఇచ్చినప్పటికీ అల్లర్లు చల్లారలేదు. వరుసగా నాలుగో రోజు దేశం అంతటా ఆర్థిక సమస్యల పట్ల నిరసనప్రదర్శనలు జోరందుకొన్నాయి. ఇజె, దోరుద్, మరికొన్ని నగరాలలో ఈ ప్రదర్శనలు జరగ్గా తాజా కాల్పుల్లో నలుగురు మరణించినట్లు మీడియా తెలిపింది. ఒక చోట నిరసన కారులను వారు ఎత్తుకకెళ్ళిన అగ్నిమాపక యంత్రం ఢీకొనగా ఇద్దరు మరణించారు. రెండో పెద్ద నగరం జెహవ్‌లో ప్రదర్శనలు ప్రారంభమయ్యాయి. చాలాచోట్ల ప్రదర్శకులపై పోలీసులు భాష్పవాయువు ప్రమోగించి లాఠీచార్జి చేశారు. ఆదివారం రాత్రి ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించిన ఇరాన్ అధ్యక్షుడు హస్సన్ రౌహానీ ఆపై మీడియాతో మాట్లాడారు. నిరసనలు తెలపటం తప్పు కాదని, అలాగని శాంతి భద్రతలకు భంగం కలిగించటం, ఆస్తులను ధ్వంసం చేస్తే మాత్రం చూస్తూ స హించే ప్రసక్తే లేద ఆందోళనకారులను హెచ్చరిం చారు.

రంగంలోకి దిగాల్సి ఉంటుంది : అమెరికా

ఇరాన్‌లో నెలకొన్న ప్రతిష్టంభనపై అమెరికా స్పందించింది. పరిణామాలు చక్కబెట్టుకోకపోతే అంతర్జాతీయ సమాజం తరపున తాము రంగంలోకి దిగాల్సి ఉంటుందని యూఎస్ రక్షణ శాఖ ఓ ప్రకటనలో హెచ్చరించింది. ఇక ఆందోళనకారులకు మద్దతుగా ట్రంప్ కూడా ఈ మేరకు ట్వీట్ చేశారు. ప్రపంచం మిమిల్ని గమనిస్తోంది.. ప్రజలకు శాంతి యుతంగా నిరసనలు తెలిపే హక్కు ఉంటుందని పేర్కొన్నారు.

బటన్ నొక్కితే అమెరికా స్మాష్

- కొత్త ఏడాది సందేశంలో కిమ్



సియోల్: నూతన సంవత్సర సందేశంలో ఉత్తర కొరియా సోమవారం ధిక్కార స్వరాన్ని పెంచింది. తన డెస్కుపైన అణ్వాయుధ దాడికి బటన్ ఉన్నట్లు తాజా ప్రకటనలో ఉ.కొరియా నేత కిమ్ అన్నారు. అది నొక్కితే అమెరికా తుత్తినియలు అవుతుందని హెచ్చరించారు. మరింతగా ఖండాంతర క్షిపణులు, అణ్వాయుధాలను నిర్మిస్తామని ఆ సందేశంలో ఆ దేశం పేర్కొంది. వినాశకర ఆయుధాల ఉత్పత్తిని పెంచుతామని చాటుకొంది. అణ్వాయుధ దేశంగా రూపొందడానికి 2017లో ఉత్తర కొరియా ధిక్కార ధోరణిలో వ్యూహాలు పన్నడం ప్రారంభించింది. వరుస అణుపాటవ, ఖండాంతర క్షిపణి పరీక్షలకు పాల్పడింది. ప్రతిఒక్క పరీక్షకు ఐక్యరాజ్యసమితి ఆంక్షలను పెంచుతూ వచ్చింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సైనిక చర్య ప్రకటనలతో జవాబిస్తూ వచ్చారు.

నేటి నుంచి ఉపవాస దీక్షలు



- ఎంఆర్‌పిఎస్ మందకృష్ణ మాదిగ

మన తెలంగాణ/హైదరాబాద్: షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ చేయకుండా బిజెపి నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంతో చేస్తున్న జాప్యానికి నిరసనగా, ప్రస్తుత పార్లమెంటులో బిల్లు పెట్టాలనే డిమాండ్‌తో మంగళవారం నుంచి ఉపవాస దీక్షలు చేయనున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తెలిపారు. నగరంలోని ఎంఆర్‌పిఎస్ కేంద్ర కార్యాలయంలో సోమవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు లేదా బాపుఘాట్‌లలో ఉపవాసదీక్ష చేసేందుకు అనుమతి కోరామని, ఆ రెండు చోట్లా వీలు పడకపోతే హైదరాబాద్ పరిధిలో అనుమతించిన చోట ఉపవాసదీక్ష చేస్తామని ఆయన స్పష్టం చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలలోపు ఉపవాస దీక్షకు అనుమతించాలని, లేదంటే తమకిష్టమైన చోట ఉపవాస దీక్ష చేస్తామని ఆయన డెడ్‌లైన్ విధించారు. రాష్ట్రవ్యాప్తంగా మండల, జిల్లా కేంద్రాల్లో ఎంఆర్‌పిఎస్, అనుబంధ శ్రేణులు, వర్గీకరణ మద్దతుదారులు ఉపవాస దీక్షలను చేస్తారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి నేతృత్వంలో ఢిల్లీకి అఖిలపక్షం తీసుకువెళ్లేందుకు ప్రధాని సమయం కోరుతూ ముఖ్యమంత్రి కార్యాలయం గుర్తు చేయాలని, సమయం కేటాయించకపోతే ఆ పార్టీ ఎంపిలు పార్లమెం టులో నిలదీయాలన్నారు. పార్లమెంటులో బిజెపి వర్గీకరణ బిల్లు పెట్టేలా వర్గీకరణకు మద్దతు తెలిపిన కాంగ్రెస్, టిఆర్ఎస్, సిపిఐ, సిపిఎం తదితర పార్టీలు ఒత్తిడి తేవాలని, లేదంటే వర్గీకరణ అనుకూల ప్రతిపక్ష పార్టీలు ప్రైవేటు బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు.

కెసిఆర్‌పై కేసులను తిరగతోడుతాం

ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో మిలియన్ మార్చ్ సందర్భంగా కెసిఆర్, హరీశ్‌రావు, కోదండరాం తదితరులపై హత్యాయత్నంతో పాటు పలు కఠినమైన సెక్షన్‌ల కింద నమోదైన నాన్ బెయిలబుల్ కేసులను తిరగతోడుతామని మందకృష్ణ హెచ్చరించారు. కేసులు నమోదైన తర్వాత 2014 జూన్ 2వ తేదీ వరకు ఆ కేసుల్లో ఎందుకు అరెస్టులు చేయలేదని ఆయన ప్రశ్నించారు. దళితులను కెసిఆర్ మోసం చేస్తుంటే తనకు ఉప ముఖ్యమంత్రి పదవి, తన కూతురుకు స్టేషన్ ఘన్‌పూర్ ఎంఎల్‌ఎ టికెట్ కోసమే కడియం శ్రీహరి వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు.

మంత్రి అఖిలప్రియకు షాక్



ఆళ్లగడ్డ: కొత్త సంవత్సరం రోజు మంత్రి అఖిలప్రియకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆదివారం రాత్రి ఆళ్లగడ్డలో ఎవి సుబ్బారెడ్డి నిర్వహించిన విందుకు 10వేల మంది వరకు హాజరయ్యారు. మంత్రి బంధువులు. కార్యకర్తలు, అనుచరులు కూడా వెళ్లడంతో రాజకీయంగా చర్చనీయాంశమైంది. అంతకుముందు రోజు నుంచే మంత్రి ఎవి సుబ్బారెడ్డి ఫంక్షన్‌ను అడ్డుకోవాలని తీవ్ర ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. సందర్భంగా ఎవి తన సన్నిహితులతో మాట్లాడుతూ భూమాను నమ్ముకున్న వారికి అండగా ఉండేందుకు ఆళ్లగడ్డలోనే ఉంటానని చెప్పినట్లు తెలిసింది. అయితే తన బలాన్ని అధికార పార్టీ నేతల దృష్టికి తీసుకొని వెళ్లి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డ నుంచి పోటీ చేసే యోచనలో ఉన్నట్లు పలువురు నాయకులు పేర్కొంటున్నారు. ఎవి కూడా ఇందుకు అనుగుణంగా పావులు కదుపుతున్నారు. మరోవైపు విందు వివరాలపై మంత్రి ఆరా తీసినట్లు సమాచారం.

బాబు విశ్వసనీయత మరిచారు



- ఎపి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్

చిత్తూరు: విశ్వసనీయత అన్న పదానికి చంద్రబాబు నాయుడు పాతర వేశారని ప్రతిపక్ష నేత, వైసిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలు కొడతారేమో అనే భయంతో ఎన్నికల మేనిఫెస్టోను టిడిపి తన పార్టీ వెబ్‌సైట్ నుంచి తీసేసిందని ఆయన అన్నారు. విశ్వసనీయత అనే పదాన్ని రాజకీయ నేతలు మర్చిపోయారని, మాట తప్పితే రాజీనామా చేసి ఇంటికి పోయే రోజు రావాలని అన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ఆయన సోమవారం చిత్తూరు జిల్లా చిన్నతిప్ప సముద్రంలో ప్రసంగించారు. 'నాలుగేళ్ల చంద్రబాబు పాలన చూసిన తర్వాత సంతోషంగా ఎవరైనా ఉన్నారా? రైతులు, చేనేతలు, అక్కా చెల్లెమ్మలు, విద్యార్థులు, అవ్వాతాతలు ఎవరూ సంతోషంగా లేరు. చేనేతలకు ఇచ్చిన హామీ ఒక్కటి కూడా చంద్రబాబు నెరవేర్చలేదు. ప్రతి కులాన్ని ఎన్ని రకాలుగా మోసం చేయాలో అన్ని రకాలుగా ఆయన మోసం చేశారని విమర్శించారు.

చేనేత పార్కులేవి?: చేనేత కార్మికులకు ఒక్కటైనా మంచి జరిగిందా?వారికి రుణమాఫీ అయిందా అని అడిగితే, చేనేత కార్మికులకు బడ్జెట్‌లో రూ.1000 కోట్ల నిధిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. జిల్లాకో చేనేత పార్క్ ఏర్పాటు చేస్తామని చెప్పి మాట తప్పారు. రుణమాఫీ విషయంలో అదే జరిగిందన్నారు. రుణాలు కట్టలేదని బ్యాంకులు వడ్డీ మీద వడ్డీలను వేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు వల్ల మంచి జరిగేది కూడా జరక్కుండా పోయిందన్నారు. చేనేత కార్మికులు 35మంది చనిపోతే కనీసం 10మందికి కూడా రూ.5 లక్షలు ఇవ్వలేదన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు ఉద్యోగుల వినతి..

ప్రజాసంకల్పయాత్ర చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు కలిశారు. తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించడమే కాకుండా, రెగ్యులర్ ఉద్యోగులకు ఇస్తున్నట్లుగా వేతనాలు ఇవ్వాలని వారు ఈ సందర్భంగా వైఎస్ జగన్‌కు విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రమాదవశాత్తూ, విధి నిర్వహణలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని, విద్యుత్ సంస్థల్లో అవుట్ సోర్సింగ్ విధానాలకు స్వస్తి పలికాలని వారు తమ సమస్యలను ఏకరవు పెట్టారు. వైఎస్ జగన్ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాగా పాదయాత్రలో భాగంగా అడ్డగింటవారిపల్లి చేరుకున్న వైఎస్ జగన్‌కు గ్రామస్తులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు ఘన స్వాగతం పలికారు.

కోస్టారికా విమానం కూలి 12 మంది మృతి

- మృతుల్లో అధికులు అమెరికన్ టూరిస్టులే

సాన్ జోస్ (కోస్టారికా): 10మంది అమెరికన్ పౌరులతో, మరి ఇద్దరు సిబ్బందితో ప్రయాణిస్తున్న విమానం ఒకటి అటవీ ప్రాంతంలో కూలిపోయినట్లు, ఈ ప్రమాదంలో అందరూ మరణించినట్లు కోస్టారికా ప్రభుత్వం ఆదివారం సాయంత్రం ప్రకటించింది. గుయానా కాస్టీ అనే ప్రాంతంలో విమానం కూలిన ప్రదేశం ఫొటోలను, వీడియోను ఆ ప్రభుత్వం విడుదల చేసింది. మృతుల వివరాలు అధికారికంగా ఇంకా ప్రకటించలేదు. మృతులలో ఐదుగురు న్యూయార్క్ వాసులు సెలవులపై విహారం జరుపుతున్నట్లు తెలిసింది. ఎన్‌బిసి న్యూస్ చానెల్‌లో మృతుల వార్తను ఒక వనిత ధృవపరిచారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టారు.

సీ ప్లేన్ ప్రమాదంలో కంపాస్ గ్రూప్ కంపెనీ సిఇఒ మృతి



మెల్‌బోర్న్: బ్రిటన్‌కు చెందిన క్యాటరింగ్ సం స్థ కంపాస్ గ్రూప్ కం పెనీ సిఇఒతో పాటు ఆ యన కుటుంబ సభ్యు లు మరో నలుగురు స ముద్ర విమానం (సీ ప్లే న్) ప్రమాదంలో మరణించారు. కొత్త ఏడాది వేడుకల సమ యంలో ఆస్ట్రేలియాలోని సిడ్నీ రివర్‌లో ఈ ఘటన జరిగింది. సముద్ర విమానం కూలిన ఘటనలో మొత్తం ఆరుగురు ప్రా ణాలు విడిచారు. 58 ఏళ్ల రిచర్డ్ కజిన్స్‌తో పాటు ఎమ్మా బౌడె న్, హీతర్ బౌడెన్, ఎడ్వర్డ్ కజిన్స్, విలియమ్ కజిన్స్‌లు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. పైలట్ గ్యారత్ మోర్గన్ కూడా ఈ ప్రమాదంలో చనిపోయాడు. బ్రిటన్ అధికారులకు ప్రమాదం పట్ల సమాచారం అందజేస్తున్నట్లు ఆస్ట్రేలియా పోలీసులు తెలిపారు. కంపాస్ సంస్థ బ్రిటన్‌లో అతిపెద్దది.

నిరుద్యోగ లెక్కలపై శ్వేతపత్రం విడుదల

- ఎఐఎస్ఎఫ్ డిమాండ్

మన తెలంగాణ/హైదరాబాద్: ఉపాధి కల్పనపై ప్రభుత్వ లెక్కలు గందరగోళంగా ఉన్నాయని, దీనిపై ఒక శ్వేతపత్రాన్ని విడుదల చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మారుపాక అనిల్‌కుమార్ డిమాండ్ చేశారు. హిమాయత్ నగర్‌లోని సత్యనారాయణరెడ్డి భవన్‌లో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహరెడ్డి ప్రారంభించిన నూతన వెబ్‌సైట్‌లో ఇప్పటివరకు 4,57,481 మంది ఉపాధి కల్పనా కార్యాలయంలో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు లెక్కలు చెబుతుంటే మరో వైపు 88, 089 మందిని వివిధ కంపెనీలకు స్పాన్సర్ చేశామని ప్రభుత్వం చెబుతున్నదని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జిహెచ్‌ఎంసి, జాగృతి సంస్థ, ప్రజాప్రతిధులు నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా ఎంత మందికి ఉద్యోగావకాశాలు లభించాయో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. తమ పేర్లను నమోదు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ఉపాధి లేదా ఉపాధి అవకాశాలను కల్పించాలని, లేదా నిరుద్యోగులకు ప్రతి నెలా రూ. 5వేల నిరుద్యోగ భృతిని చెల్లించాలన్నారు. ఈసమావేశంలో ఎఐవైఎఫ్ హైదరాబాద్ అధ్యక్షులు షేక్ నదీమ్, ప్రధాన కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, నాయకులు జి. హరినాథ్‌గౌడ్, బాలకృష్ణ, చైతన్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

24 గంటల విద్యుత్ పేరిట నిధులు వృథా

మన తెలంగాణ/హైదరాబాద్: రైతులకు 24గంటల విద్యుత్ అంటూ ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తూ కోట్లాది రూపాయలను వృథా చేస్తోందని టిపిసిసి కిసాన్ సెల్ చైర్మన్ కోదండరెడ్డి విమర్శించారు. దీని వల్ల రైతులకు ఎలా మేలు జరుగుతుందని ప్రశ్నించారు. గాంధీభవన్‌లో ఆదివారం ఉపాధ్యక్షుడు అన్వేష్‌రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. కెసిఆర్ పాలనలో రైతులు తీవ్రంగా నష్టపోయారని, అందుకే వారిని మభ్యపెట్టేందుకు ప్రభుత్వం 24 గంటల విద్యుత్ అంటూ ఆర్భాటపు ప్రచారం చేస్తోందని విమర్శించారు.

సెల్‌కాన్ డైరెక్టర్లపై కేసు

మన తెలంగాణ/మాదాపూర్:సెల్‌కాన్ డైరెక్టర్లపై మాదాపూర్ పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. కంపెనీకి చెందిన డైరెక్టర్లు తప్పుడు నివేదికలను సృష్టించి రూ.15 కోట్ల మోసానికి పాల్పడినట్లు మరో డైరెక్టర్ వై.స్వప్నకుమార్ కోర్టును ఆశ్రయించారు. ఇందులో రేతినేని మురళీ కృష్ణ, కె.రాధాక్రిష్ణ, కుజేటి కృష్ణ పవన్, వై.గురుస్వామినాయుడులపై పోలీసులు కేసు నమోదు చేశారు. గతంలో గురుస్వామి నాయుడు మిగత డైరెక్టర్లు కలి సి కంపెనీకి సంబంధించిన ఆర్థిక పరమైటు వంటి తప్పుడు నివేదికలు తయారు చేసి రూ.15 కోట్ల మోసానికి పాల్పడ్డారంటూ కంపెనీలో 10 శాతం వాటా ఉన్న డైరెక్టర్ స్వప్నకుమార్ తెలిపారు.

మన తెలంగాణ
12
హైదరాబాద్
మంగళవారం
2, జనవరి 2018
www.manatelangana.news

అగ్రస్థానానికి 5 వికెట్ల దూరంలో స్టెయిన్!

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా బౌలర్ డేల్ స్టెయిన్ ఓ అరుదైన రికార్డుకు చేరువయ్యాడు. ఆ దేశం తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో అగ్రస్థానం దక్కించుకునేందుకు స్టెయిన్ ఐదు అడుగుల దూరంలో ఉన్నాడు. కేప్‌టౌన్ వేదికగా భారత్‌దక్షిణాఫ్రికా మధ్య ఈ నెల 5న మూడు టెస్టు మ్యాచుల సిరీస్ ప్రారంభంకానుంది. ఈ సిరీస్‌లో అతడు ఐదు వికెట్లు సాధిస్తే చాలు దక్షిణాఫ్రికా తరఫున అత్యధిక వికెట్లు తీసిన ఆటగాళ్ల జాబితాలో అగ్రస్థానానికి ఎగబాకుతాడు. ప్రస్తుతం షాన్ పొలాక్ 421 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా.. 417 వికెట్లతో స్టెయిన్ ఉన్నాడు. 108 మ్యాచ్‌ల్లో 202 ఇన్నింగ్స్‌ల ద్వారా పొలాక్ 421 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. పొలాక్ 2008లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు తెలిపాడు. ఇక 85 టెస్టుల్లో 156 ఇన్నింగ్స్‌ల ద్వారా 417 వికెట్లు దక్కించుకున్నాడు. 2015 డిసెంబరులో గాయం కారణంగా స్టెయిన్ క్రికెట్‌కు కాస్త దూరమయ్యాడు. తాజాగా జట్టులో చోటు దక్కించుకున్న స్టెయిన్ ఇప్పుడు ఎలా రాణిస్తాడోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. స్టెయిన్ 2004లో టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. స్టెయిన్ 13 టెస్టుల్లో 65 వికెట్లు తీసుకుని 22.3 సగటుతో ఉన్నాడు. భారత్‌తో ఆడిన 12 టెస్టుల్లో 21.93 సగటుతో ఉన్నాడు.



చరిత్ర సృష్టించిన విదర్భ

● తొమ్మిది వికెట్ల తేడాతో ఢిల్లీపై గెలుపు ● తొలిసారి రంజీ టైటిల్ కైవసం



ఇండోర్: దేశవాళీ రంజీ ట్రోఫీ టోర్నమెంటులో విదర్భ జట్టు సోమవారం చరిత్ర సృష్టించింది. ఇండోర్‌లోని హోల్కర్ మైదానంలో జరిగిన రంజీ టోర్నమెంట్ 2017–18 సీజన్ ఫైనల్‌లో ప్రత్యర్థి ఢిల్లీ జట్టును 9 వికెట్ల తేడాతో మట్టికరిపించింది. దీంతో 83 ఏళ్ల రంజీ చరిత్రలో తొలిసారి ట్రోఫీని గెలుచుకుని చరిత్రను సృష్టించింది. నాగ్‌పూర్‌కు చెందిన విదర్భ జట్టు తొలిసారి రంజీ ఫైనల్‌లో దర్శనమిచ్చింది. 29 పరుగుల లక్ష్య ఛేదనలో విదర్భ కెప్టెన్ ఫైజ్ ఫజల్ వికెట్‌ను మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని పూర్తి చేసింది.

తొలి ఇన్నింగ్స్‌లో ఫీల్డింగ్‌ను ఎంచుకున్న విదర్భ జట్టు రెండో రోజు తొలి భాగంలోనే 295 పరుగులకే ఢిల్లీ జట్టును ఆలౌట్ చేసింది. విదర్భ ఫాస్ట్ బౌలర్ రజనీశ్ గుర్బానీ 59 పరుగులకు ఆరు వికెట్లు తీశాడు. అందులో హ్యాట్రిక్ కూడా ఉంది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన విదర్భ 547 పరుగులకు ఆలౌట్ అయింది. తొలి ఇన్నింగ్స్‌లో విదర్భ ఢిల్లీపై 252 పరుగుల ఆధిక్యతను సాధించింది. విదర్భ జట్టు వికెట్‌కీపర్ అక్షయ్ వాడ్కర్ ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో తన తొలి శతకాన్ని చేశాడు. 7 వికెట్ల నష్టానికి 528 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో ఆటను కొనసాగించిన వాడ్కర్ 133 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అయితే సోమవారం ఉదయం ఢిల్లీ జట్టు మిగిలిన 3 వికెట్లు కూడా తీసుకుంది. ఢిల్లీ యువ పేసర్ నవదీప్ సైనీ 36.3 ఓవర్లలో 135 పరుగులిచ్చి 5 వికెట్లు తీసుకుని రాణించాడు. విదర్భ జట్టుకు చెందిన ఫైజ్ ఫజల్, వసీమ్ జాఫర్, ఆదిత్యా సర్వాతే, సిద్ధేశ్ నెరాల్ అర్ధ శతకాలు చేశారు.

తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీకి ఓ బౌలర్ కొరత ఏర్పడింది. మోకాలి గాయం కారణంగా ఎడమ చేతి వాటం స్పిన్నర్ మన్నన్ శర్మ ఫీల్డ్‌కు దూరమయ్యాడు. అయితే అతడు రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేశాడు.

రెండో ఇన్నింగ్స్‌లో ఢిల్లీ 280 పరుగులకు ఆలౌట్ అయింది. విదర్భ ఆఫ్‌స్పిన్నర్ అక్షయ్ వాఖరే 95 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. దాంతో విదర్భ జట్టుకు లక్ష్య ఛేదన 29 పరుగులయింది. సోమవారం ఆ స్వల్ప లక్ష్యఛేదనను విదర్భ జట్టు సునాయాసంగా ఛేదించి రంజీ టైటిల్‌ను కైవసం చేసుకుంది.

252 పరుగులతో వెనుకబడిన ఢిల్లీ జట్టులో ఓపెనర్ కునాల్ ఛండేలా 32 పరుగులకే ఔటయ్యాడు. బాగా అనుభవం ఉన్న గౌతం గంభీర్‌ను విదర్భ బౌలర్ గుర్బానీ ఎల్‌బిడబ్ల్యు చేశాడు. అయితే ఆ ఎల్‌బిడబ్ల్యుపై చర్చనీయాంశం అయింది. ఢిల్లీ జట్టులో భారత ఓపెనర్ గంభీర్ 37 బంతుల్లో 36 పరుగులు చేసి మెరుగ్గా కనిపించాడు. అతడు మరి కాసేపు క్రీజులో నిలబడి ఉంటే ఢిల్లీకి తోడ్పడి ఉండేవాడే. తొలి ఇన్నింగ్స్‌లో శతకం చేసిన షోరే, రాణా కలసి మూడో వికెటుకు 110 పరుగులు జోడించారు. రెండో ఇన్నింగ్స్‌లో షేరే, రాణా చక్కటి డ్రైవ్స్, ఫ్లిక్స్ కొడుతూ చాలా బాగా ఆడాడు. కానీ వారి ఢిల్లీ జట్టు 164 స్కోరుకు చేరగానే లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ ఆదిత్యా సర్వాతే బంతికి ఫస్ట్ స్లిప్‌లో వసీమ్ జాఫర్ చేతిలో క్యాచౌట్ అయ్యాడు. ఆ తర్వాత రాణా సైతం గుర్బానీ బౌలింగ్‌లో స్టంప్స్ వెనుక ఉన్న వాడ్కర్ చేతిలో క్యాచౌట్ అయ్యాడు. తొలి ఇన్నింగ్స్‌లో మాదిరిగానే రెండో ఇన్నింగ్స్‌లో గుర్బానీ చక్కగా బౌలింగ్ చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో అర్ధ శతకం చేసిన హిమ్మత్ సింగ్‌ను ఆఫ్‌స్పిన్నర్ అక్షయ్ వాఖరే ఖాతా తెరువక ముందే ఔట్ చేశాడు. ఆ తర్వాత బ్యాటింగ్‌కు దిగిన కెప్టెన్ రిషబ్ పంత్(32) సిద్ధేశ్ నెరాల్ వేసిన బంతిని షాట్ కొట్టబోయి ఔటయ్యాడు. దాంతో ఢిల్లీ బ్యాటింగ్ కుప్పకూలడంతో గెలుపు ఆశలు అడియాశలయ్యాయి.

స్కోరు

ఢిల్లీ: మొదటి ఇన్నింగ్స్: 295/10 (102.5 ఓవర్లు), రెండో ఇన్నింగ్స్: 280/10 (76 ఓవర్లు)
విదర్భ: మొదటి ఇన్నింగ్స్: 547/10(163.4 ఓవర్లు), రెండో ఇన్నింగ్స్: 32/1(5 ఓవర్లు).. చివరికి 9 వికెట్ల తేడాతో విదర్భ విజయం.





బెన్‌స్టోక్స్ ఔట్.. మాలన్‌కు చోటు

ఇంగ్లాండ్ వన్డే జట్టు ప్రకటన



లండన్: ఓ వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనలో విచారణ ఎదుర్కొంటున్న ఇంగ్లండ్ ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్‌కు మరోసారి నిరాశే ఎదురైంది. ఆ దాడి కారణంగా యాషెస్ సిరీస్‌కు దూరమైన స్టోక్స్.. ఆస్ట్రేలియాతో త్వరలో ఆరంభమయ్యే వన్డే సిరీస్ నుంచి సైతం వైదొలగాల్సి వచ్చింది. తొలుత స్టోక్స్‌కు వన్డే జట్టులో చోటు కల్పించనప్పటికీ, అతనికి క్రౌన్ ప్రాసిక్యూషన్ సర్వీస్(సిపిఎస్) నుంచి ఇంకా ఎటువంటి క్లియరెన్స్ లభించలేదు. దాంతో అతన్ని వన్డే జట్టు నుంచి తప్పిస్తున్నట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు(ఇసిబి) తెలిపింది. 'రేపు ఇంగ్లాండ్ నుంచి బయల్దేరే వన్డే బృందంతో కలిసి స్టోక్స్ పయనించడం లేదు. బ్రిస్టల్ ఘటనకు సంబంధించి సిపిఎస్ నిర్ణయం ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఆ నేపథ్యంలో స్టోక్స్‌ను ప్రస్తుతానికి జట్టు నుంచి తప్పిస్తున్నాం. ఒకవేళ స్టోక్స్‌పై ఎటువంటి కేసు నమోదు కాకపోతే అతన్ని 48 గంటల్లో తిరిగి జట్టుకు ఎంపిక చేస్తాం. ఇప్పటికైతే స్టోక్స్‌ను వన్డే జట్టు నుంచి తప్పిస్తున్నాం. అతని స్థానంలో డేవిడ్ మాలన్‌కు అవకాశం కల్పిస్తున్నాం' అని ఇసిబి ఓ ప్రకటనలో పేర్కొంది. ఇదిలా ఉండగా ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్)లో ఆడేందుకు బెన్‌స్టోక్స్‌కు ఇసిబి సోమవారం అనుమతినిచ్చింది. ఈ విషయాన్ని బిబిసి పేర్కొంది.

రాజస్థాన్ రాయల్స్ కొత్త ఎత్తుగడ

న్యూఢిల్లీ: ఐపిఎల్ 2018 ఆటగాళ్ల వేలం జనవరి 27, 28న బెంగుళూరులో జరగనుంది. అయితే వేలం కంటే ముందే ఐదుగురు ఆటగాళ్లని ఫ్రాంచైజీలు అట్టిపెట్టుకునే అవకాశం లభించడంతో ఇప్పటికే చెన్నై సూపర్ కింగ్స్ తాము అట్టిపెట్టుకునే క్రికెటర్ల జాబితాని ప్రకటిం చింది. కానీ, రాజస్థాన్ రాయల్స్ మాత్రం ఇప్పటి వరకు ఎవరినీ వేలంలోకి వెళ్లనీకుండా తమ వద్దే ఉంచుకుంటామో చె ప్పకుండా అలానే ఉండిపోయింది. 2015లో ఆడి న జట్టులో నుంచి ఐదుగురు ఆటగాళ్లను తమ వద్దే అట్టిపెట్టుకునే అవకాశాన్ని చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌కి ఇటీవల జరిగిన సమావేశంలో ఐపిఎల్ గవర్నింగ్ కౌన్సిల్ (జిసి) ఇచ్చింది. ఈ రెండు జట్లు 2016, 2017 సీజన్‌లో నిషేధానికి గురై, మళ్లీ 2018లో పునరాగమనం చేయనున్న విషయం తెలిసిందే. జిసి నిర్ణయించిన ప్రకారం ముగ్గుర్ని రిటేన్ చేసుకుని, రైట్ టు మ్యాచ్ (ఆర్‌టిఎం) కార్డు ద్వారా మరో ఇద్దర్ని తీసుకోవచ్చు. ముగ్గుర్ని ఆర్‌టిఎం ద్వారా అట్టిపెట్టుకోవచ్చు. అయితే అట్టిపెట్టుకునే ఐదుగురు ఆటగాళ్లలో ముగ్గురు భారత్, ఇద్దరు విదేశీ క్రికెటర్లు ఉండాలి. ఒకవేళ ఫ్రాంచైజీలు ఎవర్ని అట్టిపెట్టుకోకుంటే 2018 వేలంలో వాళ్లకు మూడు రైటు టు మ్యాచ్ కార్డు అవకాశాలు లభిస్తాయి. ఈ అవకాశాన్ని రాజస్థాన్ రాయల్స్ సద్వినియోగం చేసుకోవాలని యోచిస్తోంది. ఎవరినీ అట్టిపెట్టుకోకుండా రైట్ టు మ్యాచ్ ద్వారా అజింక్యా రహానె, స్టీవ్ స్మిత్ తీసుకోవాలని నిర్ణయించిందట. ఆర్‌టిఎం ముఖ్య ఉద్దేశ్యం వేలంలో తమ ఫ్రాంచైజీకి చెందిన ఆటగాడిని రెండో ఫ్రాంచైజీ కొనుగోలు చేసినప్పుడు ఆర్‌టిఎం ద్వారా అతన్ని తీసుకోవచ్చు. అయితే వేలంలో రెండో ఫ్రాంచైజీ అతనికి ఎంత డబ్బు ఇస్తుందో ఆ మొత్తాన్ని మొదటి ఫ్రాంచైజీ చెల్లించాలి.

ఐపిఎల్‌లో రోహిత్, పాండ్య.. ముంబయి ఇండియన్స్‌కే!

ముంబయి: ఏయే ప్లేర్‌లను తమ జట్టుకే ఉంచుకోవాలనుకుంటున్నారో ఫ్రాంచైజీలు జనవరి 4కల్లా తెలుపాల్సి ఉంది. ఈ నేపథ్యంలో ముంబయి ఇండియన్స్ జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, హార్దిక్‌పాండ్య, కృనాల్ పాండ్య సోదరులను తమ జట్టుకే ఉంచుకోవాలనుకుంటోంది. కాగా ఢిల్లీ డేర్‌డెవిల్స్‌లో అంతగా రాణించని రిషభ్ పంత్, శ్రేయాస్ అయ్యర్‌లను జనవరి 27న జరిగే ఐపిఎల్ వేలంలో ఉంచేసుకోవాలని అనుకుంటోంది. జట్టుకే ఉంచేసుకోవాలనుకున్న ప్లేర్లతోపాటు రైట్ టు మ్యాచ్(ఆర్‌టిఎం) కార్డుల ద్వారా కూడా ఫ్రాంచైజీలు తమకు కావలసిన ప్లేర్‌లను కొనుక్కోవచ్చు. ఈ విషయాలను బిసిసిఐకి చెందిన సీనియర్ అధికారి ఒకరు సోమవారం తెలిపారు. ఇదిలా ఉండగా చెన్నై సూపర్ కింగ్స్ జట్టు కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోని, ఐపిఎల్ సూపర్ స్టార్ సురేశ్ రైనా, ఆల్ రౌండర్ రవీంద్ర జడేజాలను ఉంచేసుకోవాలనుకుంటోంది. ఒకవేళ డ్వేన్ బ్రావోను కూడా రైటు టు మ్యాచ్ కార్డు ద్వారా కొనాలనుకుంటోంది. సన్‌రైజర్స్ హైదరాబాద్ డేవిడ్ వార్నర్‌ను ఉంచేసుకోవాలనుకుంటోంది. ఎంతో ప్రతిభ ఉన్న దీపక్ హుడాను రూ. 3 కోట్లకు కొనాలనుకుంటోంది.





కామన్వెల్త్ గేమ్స్‌కు సాక్షి మాలిక్, బబిత అర్హత

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్ వేదికగా వచ్చే ఏడాది జరగనున్న కామన్‌వెల్త్ గేమ్స్(సిడబ్ల్యుజి)కు ఒలింపిక్ కాంస్యపతక విజేత,స్టార్ రెజ్లర్లు సాక్షి మాలిక్, బబితా కుమారి అర్హత సాధించారు. లక్నోలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ట్రెయినింగ్ సెంటర్‌లో నిర్వహించిన సెలక్షన్ ట్రయల్స్‌లో ఒలింపిక్ పతక విజేత, భారత మహిళా స్టార్ రెజ్లర్ మాలిక్ 62 కిలోల కేటగిరీలో విజయం సాధించి బెర్తు ద క్కించుకుంది. ఆరు వేర్వేరు బరువు విభాగాల ఎంపికలో సాక్షి మాలిక్‌తో పాటు బబితా కుమారి (54 కేజీలు), వినేశ్ ఫోగట్ (50 కేజీలు), పూజా ధండా (57కేజీలు), దివ్య కరణ్ (68కేజీలు), కిరణ్ (76 కేజీలు) కామన్వెల్త్‌కు ఎంపికయ్యారు. సిడబ్ల్యుజి 2018 ఏప్రిల్ 4 నుంచి ఏప్రిల్ 15 మధ్య ఆస్ట్రేలి యాలోని గోల్డ్ కోస్ట్‌లో జరగనుంది. ఈ ఆరుగురు రెజర్లు బిషెక్, కిర్గిజ్‌స్థాన్‌లో 2018లో జరిగే ఆసియాన్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లోనూ మన దేశం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారు.

వెస్టిండీస్, న్యూజిలాండ్ టి20 రెండో మ్యాచ్ వర్షార్పణం

మౌంట్ మౌన్గానుయ్(న్యూజిలాండ్): వెస్టిండీస్, న్యూజిలాండ్ మధ్య జరుగుతున్న రెండో టి20 మ్యాచ్ సోమవారం వర్షం కారణంగా తొమ్మిది ఓవర్ల తర్వాత నిలిచిపోయింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో న్యూజిలాండ్ 1–0 ఆధిక్తను నిలుపుకుంది. న్యూజిలాండ్ తొలి మ్యాచ్‌ను 47 పరుగులతో గెలుచుకుంది. అయితే రెండో టి20 మ్యాచ్‌లో 4 వికెట్ల నష్టానికి 102 పరుగులపై ఆడుతుండగా భారీ వర్ష కురిసింది. దాంతో రాత్రి 10 గంటలకు ఆటను రద్దు చేశారు. ఓపెనర్ కాలిన్ మన్రో 23 బంతుల్లో 66 పరుగులు చేశాడు. 18 బంతుల్లోనే అతడు అర్ధ శతకాన్ని సాధించాడు. మన్రో 11 ఫోర్లు, మూడు సిక్సర్లు బాదాడు. అతడు ఇప్పటికీ వరుసగా నాలుగు బౌండరీలు కొట్టిన కెన్రిక్ విలియమ్స్ కన్నా వెనుక ఉన్నారు. ఒకవేళ మ్యాచ్ కొనసాగి ఉంటే మన్రో ఆయనకు సమం చేసేవాడేమో. మూడో మ్యాచ్ మౌంట్ మౌన్గానుయ్‌లోని బే ఓవల్ మైదానంలోనే బుధవారం జరగనుంది. ఆ రోజు కూడా వర్షం కురిసే అవకాశం ఉందని భావిస్తున్నారు.



ఒయు టేబుల్ టెన్నిస్ జట్టుకు టైటిల్

హైదరాబాద్: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టెన్నిస్ టోర్నమెంట్‌లో ఉస్మానియా యూనివర్సిటీ (ఒయు) మహిళల జట్టు సత్తా చాటింది. చెన్నైలో జరిగిన ఈ టోర్నీలో విజేతగా నిలిచి టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఫైనల్లో ఉస్మానియా జట్టు 3–1తోమద్రాస్ యూనివర్సిటీపై విజయం సాధించింది. అంత కుముందు జరిగిన సెమీస్ మ్యాచ్‌ల్లో ఉస్మానియా 3–0తో ఎస్ఆర్ఎం యూనివర్సిటీపై గెలుపొందగా, మద్రాస్ యూనివర్సిటీ 3–0 తో కాలికట్ జట్టును ఓడించింది. క్వార్టర్స్ మ్యాచ్‌ల్లో ఒయు3–0తో ఆర్‌జియు హెచ్ఎస్ కర్ణాటకపై, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ 3–1 తో అన్నా యూనివర్సిటీపై, కాలికట్ 3–0తో ఎంజి యూనివర్సిటీపై, మద్రాస్ యూని వర్సిటీ 3–1తో కేరళపై విజయం సాధించాయి.



Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.